www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 299 | మంగళవారం | 29-09-2026 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా తెలంగాణ ఛీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 08



ఆయనతో సహా ముగ్గురి పదోన్నతికి సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించిన అనంతరం సిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తదితరులు

03




ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పదవిలో కొనసాగడానికి అనర్హుడని, ఆయనను అరెస్టు చేసి జైలులో పెట్టాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌కె భవన్ వరకు ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించిన ఇ.టి. నరసింహ్మ, కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్ బోస్, కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి, నగర కార్యదర్శి స్టాలిన్ తదితరులు

## హనుమకొండలో ఎఐఎస్ఎఫ్ మహాప్రదర్శన






## శాస్త్రీయ విద్యా విధానానికి విద్యార్థులు పోరాడాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపు
- విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్

**ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల సందర్భంగా హనుమకొండలో వేలాది మందితో విద్యార్థి మహా ప్రదర్శన**



ప్రజాపక్షం/హనుమకొండ

శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం హనుమకొండలో వేలాది మంది విద్యార్థులతో మహా ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పబ్లిక్ గార్డెన్ నుండి ప్రారంభమైన విద్యార్థి ప్రదర్శన కేయూ క్రాస్ రోడ్ మీదుగా కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం వరకు కొనసాగింది. అనంతరం యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవం బహిరంగ సభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తరువాయి 12లో

## 20 కోట్ల ఓట్లు తొలగింపునకు
# మోదీ కుట్ర



- దేశవ్యాప్తంగా తనకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను సర్ పేరుతో తొలగించే యత్నాలు
- ఇప్పటికే దేశంలో 13 కోట్ల ఓట్లు గల్లంతు
- జనాభా తగ్గనప్పుడు ఓట్లు మాత్రమే ఎలా తగ్గుతాయి
- సైమర్ గోబ్యాక్ తరహాలో సర్ గో బ్యాక్ అంటూ దేశం ఏకమౌతోంది
- ప్రతిదిన్ కాన్క్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశవ్యాప్తంగా తనకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కుట్ర పన్నుతున్నారని, మొత్తం 20 కోట్ల ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని చూస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే దేశంలో 13 కోట్ల ఓట్లను తొలగించారని, దేశంలో జనాభా తగ్గనప్పుడు ఓట్లు మాత్రమే ఎలా తగ్గుతాయని ప్రశ్నించారు. పేదల ఓటు హక్కును కాలరాయడానికే ఎస్ఐఆర్ ప్రక్రియను తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. ఢిల్లీలో అసోంకు చెందిన 'ప్రతిదిన్ మీడియా నెట్వర్క్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ది కాన్క్లేవ్ 2026' కార్యక్రమంలో 'ఇండియాస్ నెక్ట్స్ చాప్టర్' అనే అంశంపై సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటిష్ పాలకులు సైమన్ కమిషన్‌ను రుద్దినట్లే ప్రస్తుత ప్రధాని మోదీ ఎన్నికల సంఘాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. 'సైమన్ గో బ్యాక్' అని దేశమంతా ఎలాగైతే ఏకమై నినదించిందో.. అదే తరహా రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు 'ఎస్ఐఆర్ గో బ్యాక్' అంటూ తరువాయి 8లో




## ఖైరతాబాద్ సీటు ఖాళీ

- గెజిట్ విడుదల చేసిన శాసనసభ సచివాలయం
- 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే దానం నాగేందర్‌పై అనర్హత వేటు అమల్లోకి వస్తుందని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గం ఖాళీ అయినట్టుగా రాష్ట్ర సచివాలయంల చేసింది. ఈ మేరకు శాసనసభ సచివాలయ కార్యదర్శి రేండ్ల తిరుపతి గెజిట్ నోటిఫికేసన్ జారీ చేశారు. 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే దానం నాగేందర్‌పై అనర్హత వేటు అమల్లోకి వస్తుందని గెజిట్‌లో పొందుపర్చారు. బిఆర్ఎస్ తరపు న ఖైరతాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్‌లో చేరి పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్‌పైన ఇటీవల హైకోర్ట్ అనర్హ త వేటు తరువాయి 8లో

## 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక' ఏర్పాటు

- ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే పరిణామాలపై హెచ్చరిక, అప్రమత్తమే లక్ష్యం
- వేదిక' కన్వీనర్‌గా ప్రముఖ సంపాదకులు కె.రామచంద్రమూర్తి
- హక్కులు స్వేచ్ఛకోసం గళమెత్తాల్సిన అవసరం ఉందని వేదిక ప్రతినిధుల ఉద్ఘాటన

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే పరిణామాలపై హెచ్చరించడం, అప్రమత్తం చేయడం, అవసరమైనప్పుడు సలహా ఇవ్వడం సామాజిక బాధ్యత లక్ష్యంగా సమాలోచనలతో 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక' (ఫోరం ఫర్ కాన్స్‌టిట్యూషనల్ డెమెక్రసీ) ఏర్పడింది. 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక' కన్వీనర్‌గా ప్రముఖ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, సభ్యులుగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సామాజిక ఆలోచనపరులు డాక్టర్ గోపాల్ రెడ్డి గాదె, రిటైర్డ్ ఐఎఎస్ ఎం.వి.రెడ్డి, సీనియర్ న్యాయవాది జ్యోతి కిరణ్, పాలసీ రీసెర్చర్ బత్తిని దీప్తి ఉన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో సోమవారం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక' ఏర్పాటును ప్రకటించారు. దేశంలో మానవ హక్కులు, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు, స్వేచ్ఛ కోసం నిరంతరం ప్రశ్నించాల్సిన, గళమెత్తాల్సిన అవసరం ఉన్నదని వేదిక ప్రతినిధులు అన్నారు. ప్రతి రంగంలో విలువలు క్షీణిస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు చరిత్రను వక్రీకరిస్తూ సంకుచిత ప్రయోజనాలకు అనుగుణంగా తిరిగి రాస్తుండటం విచారకరమన్నారు. దేశంలో ఇటీవలికాలంలో ప్రజా జీవితంలో నిత్యం చోటుచేసుకొంటున్న పరిణామాలను గమనిస్తూ, తీవ్ర సమాలోచనలతో 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక'ను ఏర్పాటు చేసినట్లు వేదిక తరువాయి 8లో





## అతివేగంతో ఆటోను ఢీకొట్టిన లారీ

- మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- నలుగురు మహిళల దుర్మరణం, మరో నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం / నస్పూర్

జాతీయ రహదారి 63పై నస్పూర్ గేట్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంచిర్యాల వైపు నుంచి శ్రీరాంపూర్ వైపు వెళ్తున్న లారీ అతివేగంతో ఆటోను ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుడిపల్లి వెంకటాపూర్‌కు చెందిన అగ్గు సౌందర్య (38), సుమలత, దివ్యరాణి, నారమల్ల లక్ష్మి, సల్లూరి అనూష, తరువాయి 8లో

## నవంబర్ నుంచి రాజీవ్ యువ వికాసం

- బిసి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
- 1.30 లక్షల మంది విద్యార్థులకు రూ.450 కోట్ల స్కాలర్‌షిప్‌లు
- రూ.60 కోట్లతో 50 వేల మందికి కాటమయ్య రక్షణ కవచాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో బిసి సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజాభవన్‌లో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బిసి సంక్షేమ శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాలామాయదేవి, ఎంజెపి సెక్రటరీ తరువాయి 8లో

## ఇరాన్ ప్రతిపాదనకు ట్రంప్ తిరస్కారం
# మళ్లీ చమురు ధరలు పెంపు

**దుబాయ్:** హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు,యుద్ధ ముగింపు చర్చల పునఃప్రారంభానికి ఇరాన్ ప్రతిపాదించిన ఏడు రోజుల ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తిరస్కరించడంతో మళ్ళీ చమురు ధరలు భారీస్థాయిలో పెరిగాయి. సోమవారం ఉదయం ఏడు గంటల సమయానికి ప్రపంచ ప్రామాణిక బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 107.26 డాలర్లకు పెరిగిపోయింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర 2.8 శాతం పెరుగుదల సాధించగా, అమెరికావెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర 1.8 శాతం పెరుగుదల సాధించడంతో ఒక బ్యారెల్ ధర 97.07 డాలర్లకు పెరిగింది.ఇరాన్ ప్రతిపాదించిన ప్రణాళికను ట్రంప్ తిరస్కరించినప్పటికీ ఇరాన్ మాత్రం దానికే కట్టుబడి ఉంటానని ప్రకటించింది.చర్చల ద్వారా మాత్రమే యుద్ధ సమస్యకు పరిష్కారం సాధించగలమని,అమెరికా ఒక సానుకూల నిర్ణయం ప్రకటించేవరకూ ఎదురుచూస్తామని పేర్కొంది.శుక్రవారం తరువాయి 8లో




### 'బేర్ రన్'తో ఇన్వెస్టర్లు బేజారు

**ఒక్క రోజే రూ.7.52 లక్షల కోట్లు ఆవిరి**

**న్యూఢిల్లీ :** స్టాక్ మార్కెట్లలో 'బేర్ రన్' కొనసాగుతున్నది. బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ సోమవారం భారీ నష్టాలను ఎదుర్కొన్నారు. నెల రోజుల వ్యవధిలో సూచీలు ఏకంగా 5 శాతానికిపైగా పతనం కావడం ఇన్వెస్టర్లను దారుణంగా దెబ్బతీసింది. పె రుగుతున్న ముడి చమురు ధరలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, అధిక బాండ్ ఈల్డ్స్ కారణంగా మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతినడంతో ఇన్వెస్టర్ల సంపదలో రూ.17.17 లక్షల కోట్ల మేర క్షీణత నమోదైంది. సోమవారం ఈ నష్టం రూ.7.52 లక్షల కో ట్లుగా నమోదైంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరింత ద్రవ్య విధాన కఠినతర తరువాయి 8లో

## కెటిఆర్ నియోజకవర్గంలో తొలిసారి సిఎం రేవంత్ రెడ్డి పర్యటన

- రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- నేతన్నలు, మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి హోదాలో ఎనుముల రేవంత్ రెడ్డి తొలిసారిగా ఈ నెల 30న సిరిసిల్ల పట్టణంలో పర్యటించనున్నారు. ప్రతిపక్ష నేతగా మూడుసార్లు సిరిసిల్ల గడ్డపై అడుగుపెట్టిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సిరిసిల్ల నియోజక వర్గానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సిఎం పర్యటనపై ఆసక్తి నెలకొంది. ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రానున్న ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సిరిసిల్ల రగుడు బైపాస్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ పర్యటనలో రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం తరువాయి 8లో

# అక్టోబర్ 4న కీలకమైన బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలు

అక్టోబర్ 4న జరిగే బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. వర్కర్స్ పార్టీ నేత, ప్రస్తుత వామపక్ష అధ్యక్షుడు ఇనాసియో లులా డ సిల్వ తొలిరౌండ్‌లోనే తిరిగి ఎన్నికవుతారా, లేక 50 శాతంపైగా ఓట్లు పొందటంలో విఫలమైతే రెండవ రౌండ్ అనివార్యమవుతుందా అనేది పరిశీలకులను పీడిస్తున్న ప్రశ్న. జైల్లో ఉన్న మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సనారో పెద్దకుమారుడు ఫ్లాబియో బోల్సనారో ఆయన ప్రత్యర్థి. డి సిల్వాను ఓడించి అమెరికా అనుకూల మితవాద ప్రభుత్వం ఏర్పాటుకై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో జోక్యం చేసుకుంటున్నందున అవి ప్రతిష్టాత్మకంగా తయారైనాయి. అభ్యర్థులిరువురికీ 40–45 శాతం మధ్య ఓట్లు లభిస్తాయని, అందువల్ల అక్టోబర్ 25న రన్–ఆఫ్ తప్పదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే తమ ఎన్నికల్లో ట్రంప్ జోక్యాన్ని, బోల్సనారోను బలపరచటాన్ని వ్యతిరేకిస్తున్న మితవాద, మధ్యేమార్గ పార్టీల మద్దతును లులా కూడగట్టగలిగితే తొలి రౌండ్‌లోనే ఆయన విజయం సాధ్యమంటున్నారు. ఈ ప్రయత్నం ఫలించకపోయినా రన్–ఆఫ్ ఎన్నికల్లో ఆయన విజయం తథ్యమంటున్నారు. బ్రెజిల్ ఎన్నికలు ఆ దేశానికేగాక లాటిన్ అమెరికాలో వామపక్ష రాజకీయాల భవిష్యత్‌కు ఎంతో కీలకం.

లులా గతవారం న్యూయార్క్‌లో ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రసంగంలో ట్రంప్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరిక చేశారు : "మా ప్రజల అభీష్టంపై దాడి చేయటానికి ప్రజాస్వామ్య వ్యతిరేకులను – వారు అంతర్గతంగా ఉండనీ లేక విదేశీయులుగానీ మేము అనుమతించబోము. బ్రెజిలియన్ ప్రజాస్వామ్యం బ్రెజిల్ వాసులకే చెందుతుంది". లాటిన్ అమెరికాలో వామపక్ష ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ట్రంప్ కుట్రలు – కూహకాలు చేస్తూ, మితవాదుల్ని గెలిపిస్తేనే అమెరికా సహాయం, లేకుంటే లేదని ప్రజల్ని బెదిరించి ప్రభుత్వాలను మార్చే దుర్మార్గపు విధానం అనుసరిస్తున్నాడు. మత్తుపదార్థాల వ్యాపారం తప్పుడు ఆరోపణతో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను ఆయన భార్య గిలియా ఫ్లోరెస్‌ను ఈ సంవత్సరం జనవరి 3న ట్రంప్ ప్రభుత్వం అపహరించుకు వెళ్లిన దుర్మార్గం తెలిసిందే. అపారమైన వెనిజులా ఆయిలు సంపదను అమెరికా కంపెనీలపరం చేస్తున్నాడు. ఈ బందిపోటుతనాన్ని జాతీయ సార్వభౌమాధికారం ఉల్లంఘనగా అనేక దేశాలు ఖండించినా ట్రంప్‌కు చీమకుట్టినట్లు లేదు. ట్రంప్ తొలి పదవీకాలంనుంచీ బ్రెజిల్‌లో మితవాదుల అధికారం కోసం పనిచేశాడు. జైరో బోల్సనారో ఒక పర్యాయం ఎన్నిక కావటంలో ట్రంప్ హస్తం ఉంది. తన మిత్రుడు జైరో బోల్సనారోపై కేసులు ఎత్తివేయాలని ట్రంప్ నిస్సిగ్గుగా కోరారు. అందువల్ల వర్కర్స్ పార్టీ, ఇతర వామపక్షవాదులు లులాను తిరిగి గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు.

బ్రెజిల్ ఎన్నికల చరిత్రను ఒక్కసారి పరిశీలిస్తే, వామపక్ష వర్కర్స్ పార్టీ నేత లులా డ సిల్వా 1989, 1994, 1998 ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసి విఫలమైనారు. 2002, 2006 ఎన్నికల్లో విజయం సాధించారు. 2010, 2014 ఎన్నికల్లో ఆయన చీఫ్ ఆఫ్ స్టాఫ్ దిల్మా రౌసెఫ్ ఎన్నికైనారు. అయితే పరిపాలనా సంబంధ ఆరోపణలతో ఆమె తొలగించబడ్డారు. ఆమె ఉపాధ్యక్షుడు, సెంట్రిస్ట్ బ్రెజిలియన్ డెమొక్రటిక్ మూవ్‌మెంట్‌కు చెందిన మిచెల్ టెమర్ అధ్యక్ష స్థానంలోకి వచ్చారు. అధ్యక్ష పదవికి తిరిగి పోటీ చేసేందుకు లులా చేసిన ప్రయత్నం లీగల్‌గా నిరోధించబడింది. ఆపరేషన్ కార్ వాష్ పేరుతో ఆయనపై దురుద్దేశపూర్వకంగా అవినీతి కేసు బనాయించి 2018లో జైల్లో పెట్టారు. ఆ సంవత్సరం సోషల్ లిబరల్ పార్టీకి చెందిన మితవాది జైర్ బోల్సనారో అధ్యక్షునిగా ఎన్నికైనారు. ఆయన 2019లో సోషల్ లిబరల్ పార్టీని వీడి 2021లో లిబరల్ పార్టీలో చేరారు. లులా డ సిల్వపై కేసులకున్న చట్టబద్ధతను ప్రశ్నిస్తూ సుప్రీం ఫెడరల్ కోర్టు అనేక తీర్పులిచ్చిన పర్యవసానంగా ఆయన 2019లో జైలునుంచి విడుదలైనారు. 2022 అధ్యక్ష ఎన్నికల్లో లులా స్వల్ప మెజారిటీతో బోల్సనారోను ఓడించారు. లులా ప్రమాణస్వీకారం నిరోధించేందుకై బోల్సనారో మద్దతుదారుల్లో కొందరు సైనిక తిరుగుబాటుకు ప్రయత్నించి విఫలమైనారు. సుప్రీం కోర్టు విధించిన శిక్ష కారణంగా 2025లో జైర్ బోల్సనారోను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. 2030లోపు రెండవసారి అధ్యక్ష పదవికి పోటీ చేయకుండా సుప్రీంకోర్టు ఆయనపై ఆంక్ష విధించింది. పర్యవసానంగా ఆయన కుమారుడు సెనెటర్ ఫ్లావియో బోల్సనారో లిబరల్ పార్టీనుంచి అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నారు.

అక్టోబర్ 4న పోలింగ్‌లో ఓటర్లు అధ్యక్ష పదవితోపాటు, ఉపాధ్యక్ష పదవులకు, దిగువ సభ డిప్యూటీలందరి ఎన్నికకు, గవర్నర్‌ల ఎన్నికకు, సెనేట్‌లోని 81సీట్లలో మూడింటి రెండు వంతులకు ఓటు చేస్తారు. డిప్యూటీల ఛాంబర్‌లోని 513 మంది సభ్యులతో పాటు, రాష్ట్ర అసెంబ్లీలు, ఫెడరల్ జిల్లా శాసనసభ డిప్యూటీలు ఎన్నుకోబడతారు. అభ్యర్థుల మధ్య ప్రత్యక్ష పోటీ, పార్టీలకు లభించిన ఓట్ల దామాషాలో ప్రతినిధుల కేటాయింపు పద్ధతుల్లో ఎన్నుకోబడతారు.

నాల్గవసారి అధ్యక్ష పదవీకాలానికి పోటీ చేస్తున్న అధ్యక్షుడు లులా డ సిల్వ 2025 డిసెంబర్ ఆఖరు వారంలో తన ప్రచారం ప్రారంభించారు. 2024 డిసెంబర్‌లో జరిగిన ఆపరేషన్‌లనుబట్టి కొందరు ఆయన ఆరోగ్యంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయన తిరిగి ఎన్నికకు తన అభ్యర్థిత్వం ప్రకటించినాక, రాజధాని రియొ డి జనిరోలో పోలీసులు నిర్వహించిన ఆపరేషన్‌లో కనీసం 120మంది చనిపోయారు. నేరాలపై కఠినంగా వ్యవహరిస్తానన్న సందేశాన్ని ఆయన ఈ ఆపరేషన్ ద్వారా పంపారు. ఎన్నికల్లో ఇదొక నిర్ణయాత్మక అంశం కానుంది. ●



## సుప్రీంకోర్టులో అవినీతికర న్యాయమూర్తులు

**ఈ దేశంలో చాలా మంది న్యాయమూర్తులు అగ్రకులాలకు చెందినవారే. తనను తాను ఉదారవాద న్యాయమూర్తిగా చెప్పకునే జస్టిస్ డి.వై. చంద్రచూడ్ సుప్రీంకోర్టుకు 17 మంది న్యాయమూర్తులను నియమించారు. వారిలో ఒక్కరు కూడా మహిళ లేరు. మీరు సమాజంలోని అన్ని వర్గాల నుండి న్యాయమూర్తులను నియమించకపోతే, న్యాయం అందించడంలో ఉండే సున్నితత్వాన్ని వారు ఎప్పటికీ అర్థం చేసుకోలేరు.న్యాయవ్యవస్థలో 48 ఏళ్లుగా న్యాయవాదిగా ఉన్న నా అనుభవంతో చెబుతున్నా. న్యాయవ్యవస్థలో కొంతమంది అత్యుత్తమ న్యాయమూర్తులు ఉన్నారు, కానీ సుప్రీంకోర్టులో లెక్కలేనంత మంది అవినీతికర న్యాయమూర్తులు ఉన్నారు. వారు న్యాయానికి గొప్ప నష్టం కలిగించారు.**

– సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే (కేరళలో కె.ఎం.బషీర్ స్మారకోపన్యాసం సందర్భంగా)




## గుండె సంరక్షణే ఆరోగ్యకర జీవితానికి హామీ!

మనిషి మనుగడకు అత్యంత కీలకమైన శక్తి కేంద్రం గుండె. మన శరీరంలోని ప్రతీ అవయవమూ సక్రమంగా పనిచేయాలంటే నిరంతరం రక్తాన్ని పంప్ చేస్తూ ప్రాణవాయువును అందించే గుండె ఆరోగ్యంగా ఉండటం ప్రాథమిక అవసరం. మారుతున్న జీవనశైలి, విపరీతమైన ఒత్తిడి కారణంగా ఎందరో గుండె సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా గుండె సంరక్షణ, సంకేతాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరం. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబరు 29న ప్రపంచ గుండె దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమా న్ని నిర్వహిస్తాయి. గుండె వ్యాధుల పట్ల ప్రపంచ ప్రజల్లో అవగాహన పెంచి, నివారణోపాయాలను ప్రచారం చేయడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. కార్డియోవాస్క్యులర్ వ్యాధులను అరికట్టాలనే లక్ష్యంతో 1946లో జెనీవాలో వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంస్థ రూపుదిద్దుకుంది. ఆ తర్వాత 1999లో నాటి సంస్థ అధ్యక్షుడు ఆంటోనియో బాయెస్ డీ లూనా ఆలోచన మేరకు మొదటిసారిగా గుండె దినోత్సవాన్ని నిర్వహించారు. గుండె సంబంధిత వ్యాధులను తరచుగా 'సైలెంట్ కిల్లర్స్' అని పిలుస్తారు. నిశ్శబ్దంగా వ్యాపిస్తూ మానవాళిని కబళిస్తున్న ఈ వ్యాధుల వల్ల సంభవిస్తున్న మరణాలు క్యాన్సర్ మరణాల కంటే ఎక్కువగా ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**ఆరోగ్యకరమైన గుండె కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సంక్లిష్టమైన విషయమేమీ కాదు. మనం పాటించే దైనందిన జీవన విధానం, ఆహారపు అలవాట్లలో చిన్నచిన్న మార్పులు చేసుకోవడం ద్వారా గుండెపోటు ప్రమాదాన్ని అత్యంత ప్రభావవంతంగా నివారించవచ్చు. దినచర్యలో భాగంగా ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఉదయం తేలికపాటి వ్యాయామాలు, అలవాటు చేసుకోవాలి. ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండటం చాలా అవసరం. టీ, కాఫీలను పరిమితంగా తీసుకోవాలి. ఆహార విషయంలో ఆకుకూరలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పాలకూర, బచ్చలికూర, కొత్తిమీర, ముల్లంగి వంటి వాటిలో కొవ్వు శాతాలు తక్కువగా ఉండి ఫోలిక్ యాసిడ్ మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం సమృద్ధిగా లభిస్తాయి. మానసిక ప్రశాంతత కూడా గుండె ఆరోగ్యాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది. రోజుకు కనీసం 7 నుండి 8 గంటల సమగ్రమైన నిద్రపోవడం, సానుకూల దృక్పథంతో జీవించడం గుండె ఒత్తిడిని తగ్గిస్తాయి. నిరంతరం మనస్సును సంతృప్తిగా, సంతోషంగా ఉంచుకోవడం వల్ల గుండె లయబద్ధంగా పనిచేస్తుంది.

ఎండి. ఉస్మాన్ ఖాన్,
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

*(సెప్టెంబర్ 29 ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా)*

## ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు మినహాయింపు అంటే..

# జవాబుదారీతనం లేని స్వేచ్ఛ కాదు



కపిల్ సిబల్
సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు

భారత రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్లు వంటి ఉన్నత రాజ్యాంగ పదవులలో ఉండే వారికి, వారి పదవీకాలంలో క్రిమినల్ విచారణల నుంచి రక్షణ లభిస్తుంది(ఆర్టికల్ 361). భారత ప్రధాన న్యాయమూర్తి అనుమతి లేకుండా సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులపై ఎలాంటి క్రిమినల్ విచారణలు ప్రారంభించబడవు. అయితే, రాజ్యాంగంలోని 61, 124(4), 218 అధికరణలో పేర్కొన విధానంలో ఒక ప్రత్యేక ప్రక్రియ ద్వారా రాష్ట్రపతి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టుల న్యాయమూర్తులను పదవి నుండి తొలగించవచ్చు. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) విషయానికి వస్తే, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)ని తొలగించే విధానం ఉన్నత న్యాయవ్యవస్థ న్యాయమూర్తులకు వర్తించే విధానాన్ని పోలి ఉన్నప్పటికీ, ఇసిఐ సభ్యులకు క్రిమినల్ విచారణల నుండి రాజ్యాంగం ఎటువంటి రక్షణను కల్పించలేదు. అయితే, 1991 నాటి పాత చట్టం స్థానంలో తీసుకువచ్చిన 'ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సర్వీసు నిబంధనలు, పదవీకాలం) చట్టం – 2023' ద్వారా సిఇసి, ఎన్నికల కమిషనర్లకు వారి పదవీకాలానికే పరిమితం కాకుండా, క్రిమినల్ విచారణలు ప్రారంభించకుండా భారత ప్రభుత్వం మినహాయింపును కల్పించింది.

అలాంటి మినహాయింపుకు రెండు కారణాలు ఉండవచ్చు. ఒకటి, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలను నిర్వహించాలనే తమ రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించే సమయంలో వారు అన్ని బాహ్య ఒత్తిళ్ల నుంచి విముక్తి పొందాలి. ప్రస్తుత పరిస్థితులు సూచిస్తున్న రెండవ కారణం ఏమిటంటే, ఈ అధికార పార్టీ తమ పక్షపాత రాజకీయ ప్రయోజనాల కోసం ఆ పదవిని ఉపయోగించుకోవాలంటే అలాంటి మినహాయింపు అవసరమని గ్రహించింది. తద్వారా ఆ పదవిలో ఉన్నవారి చర్యలపై ఎలాంటి క్రిమినల్ విచారణ జరపబడదని వారికి హామీ ఇచ్చింది.

బహుశా ఇదే, ఇప్పుడు ప్రజాగ్రహానికి దారితీసే రీతిలో వ్యవహరించేలా సిఇసికి మరింత ధైర్యాన్ని ఇచ్చి ఉండవచ్చు.

భారతదేశంలోని మరే ఇతర రాజ్యాంగ అధికార సంస్థకు ఇలాంటి అపరిమితమైన రక్షణ అందుబాటులో లేనప్పుడు సిఇసి, ఇసిలకు సంపూర్ణ, జీవితకాల రక్షణ కల్పించడం రాజ్యాంగ ఉద్దేశ్యానికి అతీతమైనది. వాస్తవానికి, ఇది సుప్రీంకోర్టులో సవాలు చేయబడిన ఒక అంశం. 2023 చట్టం ప్రకారం, ఎన్నికల సంఘాలు ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకోవడానికి ప్రయత్నించాలి. ఏకగ్రీవమయ్యేందుకు కుదరని పక్షంలో, మెజారిటీ నిర్ణయాలే చెల్లుబాటు అవుతాయి. ఇటీవల ఒక పరిశోధనాత్మక జర్నలిస్ట్ కథనం ప్రకారం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, దీని ఫలితంగా లక్షలాది మంది ఓటర్లను అనధికారికంగా తొలగించడం, చేర్చడం జరుగుతోందని వెల్లడైంది. ఇద్దరు ఎన్నికల కమిషనర్(ఇసి)లు వ్యతిరేకించిన ఒక ప్రక్రియ ద్వారా ఇది జరిగిందని సమాచారం.

ఇద్దరు ఇసిలు లేవనెత్తిన అత్యంత తీవ్రమైన అభ్యంతరం ఏమిటంటే, ఎన్నికల సంఘం ఏకీకృత పోర్టల్ అయిన ECINET నియంత్రణను కేంద్రీకృతం చేయడం, ఓటర్ల తొలగింపును ERONET ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇఆర్ఒ), డిప్యూటీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (డిఇఆర్ఒలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల (ఎఇఆర్ఒలు) స్థాయిలో కాకుండా, స్పష్టంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే చేయడం. ECINETను కేంద్రీకృతం చేయడం క్షేత్రస్థాయిలో అందుబాటును పరిమితం చేసినట్లు కనిపిస్తోంది. గోవాలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. అక్కడ ఎఇఆర్ఒకు ECINETను ఉపయోగించే వెసులుబాటు లభించకపోవడంతో, అర్హులైన 97 మంది ఓటర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చలేకపోయారు.

ఫారం– 6ను సవరించే అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉన్నప్పటికీ, వాస్తవానికి ఓటర్లు తమ తల్లిదండ్రులు, వారి తల్లిదండ్రుల వివరాలు ఇవ్వాల్సిన అవసరం లేని ఫారం – 6ను సిఇసి ఏకపక్షంగా మార్చిందనేది ఇద్దరు ఇసిలు లేవనెత్తిన రెండవ అభ్యంతరం.

మూడవ అభ్యంతరం పశ్చిమ బెంగాల్‌లో ఓటర్లను మరింతగా తొలగించడం కోసం లక్షలాది అప్పీళ్లను దాఖలు చేయడానికి ఇచ్చిన అధికారానికి సంబంధించింది. ఈ అప్పీళ్ల వివరాలు ఇప్పటికీ బహిరంగం కాలేదు. పశ్చిమ బెంగాల్‌లోని ట్రిబ్యునల్స్ తొలగించిన పేర్లను పరిమితంగా పరిశీలించగా, దాదాపు 93 శాతం ఓటర్లను తప్పుగా తొలగించినట్లు స్పష్టమైంది. స్పష్టంగా, నిర్దిష్ట పేర్లను తొలగించడానికి సిఇసి స్థాయిలో ఆదేశాలు జారీ చేసి ఉండవచ్చు. సిఇసి తీసుకున్న ఇటువంటి ఏకపక్ష చర్యలు, ఆయన అనుసరిస్తున్న పద్ధతులు అధికార పార్టీ ఎన్నికల్లో గెలవడానికి స్పష్టంగా ఉద్దేశించినవేనని ప్రజల్లో అనుమానాలను రేకెత్తించాయి.

మరో సమస్య ఏమిటంటే, గతంలో ఓటు వేసి ఉండి, 2002 ఎన్నికల ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు, కేవలం కొత్త ఓటర్ల కోసం ఉద్దేశించిన ఫారం–6ను నింపాలని ఆదేశించడం. ఫారం–6లో ఒక నిబంధన ఏమిటంటే, నమోదు కోరుకునే వ్యక్తి తాను ఇంతకు ముందెన్నడూ ఓటు వేయలేదని ప్రకటించాలి. గతంలో ఓటు వేసి, ఇప్పుడు కొత్తగా నమోదు చేసుకోవాలనుకుంటున్న అలాంటి ఓటర్లను, తాము ఇంతకు ముందెన్నడూ ఓటు వేయలేదని తప్పుడు ప్రకటన చేసేలా ఆదేశించడం జరుగుతుంది.

ఈ సమస్యలు సిఇసి సమగ్రతపై తీవ్రమైన సందేహాలను రేకెత్తిస్తున్నాయి. ఈ కారణంగా, భారత యువత ఆయన తక్షణ రాజీనామాను కోరింది. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనంలో బహిర్గతమైన నేపథ్యంలో కమిషన్ పనితీరుపై తలెత్తిన సందేహాలను కమిషన్ తప్పక నివృత్తి చేయాలని భారతీయ జనతా పార్టీ మిత్రపక్షాలు సైతం బహిరంగ ప్రకటనలలో పేర్కొన్నాయి. అంతకంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 2026 సెప్టెంబర్ 26న కమిషన్ జారీ చేసిన ప్రకటన. అందులో, 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' చేసిన ఆరోపణలను, దాని పరిశోధనలను అంగీకరించినట్లుగా కనిపిస్తోంది. ఎందుకంటే, కమిషన్ ఇప్పుడు తన పనితీరును మార్చుకుంటుందని సూచిస్తున్నట్లుగా ఉంది. ఆరోపిత తేడాలను పరిష్కరించడానికి, నోటీసులు అందుకున్న వ్యక్తుల ఇళ్ల వద్దకు బూత్‌స్థాయి అధికారులు (బిఎల్ఒ) వెళ్లి, పత్రాలను సేకరించి, ఇఆర్ఒ నిర్ణయం కోసం వాటిని ECINETలో అప్‌లోడ్ చేస్తారు. అలాంటి వ్యక్తులను ఇఆర్ఒ లేదా ఎఇఆర్ఒ ముందు విచారణకు పిలవరు. అది కేవలం అసాధారణ సందర్భాలలో మాత్రమే జరుగుతుంది. ఆన్‌లైన్ విచారణకు సౌకర్యాన్ని బలోపేతం చేస్తారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయి అధికారులకు ECINET అందుబాటులో ఉంటుంది. ఇంతకుముందు అటువంటి వెసులుబాటు అందుబాటులో లేదనే వాస్తవాన్ని ఇది స్పష్టంగా అంగీకరించడమే. లేకపోతే, ఇద్దరు ఇసిలు నమోదు చేసిన ఆరోపణను కచ్చితంగా ఖండించి ఉండేవారు.

సిఇసి రాజీనామా అనే అవమానం నుంచి ఆయనను కాపాడటానికి, భారత ప్రభుత్వం ఇద్దరు ఇసిలను ఈ ప్రకటనలో చేరేలా ఒప్పించగలిగినట్లు కనిపిస్తోంది. ఇలాంటి కుతంత్రాలు సిఇసి ప్రవర్తనను సమర్థించలేవు. రాజీనామా కేవలం ఆమోదయోగ్యమైనదే కాదు, అవసరం కూడా. పశ్చిమ బెంగాల్, బిహార్ ,ఇతర ప్రాంతాలలో సిఇసి ఆదేశాల మేరకు ఎన్నికలు అక్రమాలు జరిగాయా అనే ప్రజల సందేహాలను తొలగించడానికి సెప్టెంబర్ 26 ప్రకటన సరిపోదు.

*(సౌజన్యం : ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్)*




> మరో సమస్య ఏమిటంటే, గతంలో ఓటు వేసి ఉండి, 2002 ఎన్నికల ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు, కేవలం కొత్త ఓటర్ల కోసం ఉద్దేశించిన ఫారం–6ను నింపాలని ఆదేశించడం. ఫారం–6లో ఒక నిబంధన ఏమిటంటే, నమోదు కోరుకునే వ్యక్తి తాను ఇంతకు ముందెన్నడూ ఓటు వేయలేదని ప్రకటించాలి. గతంలో ఓటు వేసి, ఇప్పుడు కొత్తగా నమోదు చేసుకోవాలనుకుంటున్న అలాంటి ఓటర్లను, తాము ఇంతకు ముందెన్నడూ ఓటు వేయలేదని తప్పుడు ప్రకటన చేసేలా ఆదేశించడం జరుగుతుంది.

# జిఎస్‌టి క్రమబద్ధీకరణ ప్రజలకు ధరలు తగ్గించిందా?

**సంజయ్ రాయ్**

2025 సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టిన రెండవతరం జిఎస్‌టి సంస్కరణలు సంవత్సరం పూర్తిచేసుకున్నాయి. సరళీకరించిన, తగ్గించబడిన పరోక్ష పన్ను వినియోగవస్తువుల ధరలు తగ్గిస్తాయన్నది ఆనాడు అతిగా ప్రచారంలో పెట్టిన అంశం. ప్రభుత్వాన్ని సమర్థిస్తూ మాట్లాడటాని కి ఎప్పటివలె ప్రధాన స్రవంతి మీడియాను సమీకరించా రు. ఇది ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, ముఖ్యంగా గిరాకీ తగ్గి మందకొడిగా ఉన్న పరిశ్రమలకు ఉపకారి అవుతుందన్నారు. వాదన బహు సరళం – పరోక్షపన్నులు తగ్గి స్తే వస్తు ధర తగ్గుతుంది. ధరలు తగ్గినందున ప్రజలు ఎక్కువ గా కొనుగోలు చేస్తారు కాబట్టి గిరాకీ పెరుగుతుంది. ప్రభుత్వం ప్రసంగాలు, మీడియా చర్చలు నిర్వహించింది. ఈ సంస్కరణను ద్రవ్యోల్బణంపై మరో 'సర్జికల్ స్ట్రైక్' అని ఆకాశానికెత్తింది. (అసలుకంటే కొసమెరుపు ఎక్కువన్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినిమయ వస్తువుల్లో ఏ వస్తువు ధర ఎంత తగ్గుతుందో, సాధారణ కుటుంబానికి నెలకు ఎంత ఖర్చు ఆదా అవుతుందో లెక్కలు వేసి, 12నెలలతో హెచ్చవేసి సంవత్సరానికి ఎన్‌డిఎ ప్రభుత్వం ఎంత ఆదా సమకూర్చిందోనంటూ పత్రికలకు పూర్తి పేజీలు ప్రకటనలిచ్చింది, కూటమి ప్రభుత్వం తరఫున బహిరంగసభలు నిర్వహించింది).

సంవత్సరం గడచినందున, వినిమయ వస్తువుల ధరలు తగ్గాయా, లేదా? దేశంలో గిరాకీపై దాని ప్రభావం ఏమిటి? పరిశీలించటం ముఖ్యం. వస్తువులు, సేవలపై పన్ను తగ్గించినట్లయితే, ఆ తగ్గుదల అంతిమ వినియోగదారు చెల్లించే ధరపై ప్రతిఫలిస్తుందో లేదో సులభంగా అర్థం చేసుకోవచ్చు. ధర తగ్గుదల ఆ దామాషాలో గిరాకీ పెరుగుదలకు దారితీయకపోతే, విక్రేత ఆదాయం తగ్గుతుంది, అందువల్ల తగ్గిన పన్నును అతడు వినియోగదారునికి బదిలీ చేయడు. ఉత్పత్తిదారు గుత్తాధిపత్యం కలిగి ఉన్నప్పుడు కూడా ధరలో స్వల్ప తేడాలు వస్తువు గిరాకీని ప్రభావితం చేయవు. అప్పుడు కూడా పన్ను తగ్గింపు వస్తువు ధరను ప్రభావితం చేయదు. ఎంఎన్‌సిల ఉత్పత్తుల ధరల్లో పెద్దగా మార్పులు లేకపోవడం, దేశీయ, స్థానిక ఉత్పత్తుల ధరల్లోనే మార్పులు మనం చూశాం. అందువల్ల, జిఎస్‌టి రేట్ల తగ్గింపు ఆటోమేటిక్‌గా ధరల తగ్గింపునకు దారితీస్తుందనే ప్రచారం, ఆ సంస్కరణకు న్యాయబద్ధతను, రాజకీయ మద్దతును కూడగట్టేందుకూ, 2017లో జిఎస్‌టి ప్రవేశపెట్టిన నాటి నుంచీ సామాన్య ప్రజలపై మోపిన పెనుభారాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఉద్దేశించింది.

భారతదేశంలో వినిమయం జరిగే సరుకులు, సేవలన్నీ జిఎస్‌టి కిందకు రావు అనే విషయాన్ని గమనించాలి. కొన్నింటికి పన్నులేదు. మరికొన్ని అమ్మకం పన్ను కిందకు వస్తాయి. దేశంలో నెలవారీ సగటు వినిమయంలో 24.5 శాతం జిఎస్‌టి కిందకు రావు. దానికి తోడు, 5 శాతంలోపు జిఎస్‌టి విధించే వినియోగవస్తువులను లెక్కలోకి తీసుకుంటే, సగటు భారతీయుని వినిమయంలో 57.6శాతం జిఎస్‌టిని ఆకర్షించవు. వినియోగించే సరుకులు, సేవల్లో 28 శాతం మాత్రమే జిఎస్‌టి రేట్ల మార్పు ప్రభావానికి గురవుతాయని ఒక రీసెర్చి తెలిపింది.

వేర్వేరు వినిమయ తరగతుల మధ్య వారు వినియోగించే సరుకులు, సేవల్లో వ్యత్యాసం ఉంటుంది. కాబట్టి పన్ను రేట్లలో మార్పులు వేర్వేరు తరగతులను వేర్వేరుగా ప్రభావితం చేస్తాయి. అందువల్ల పన్ను ఉపశమనం అన్ని తరగతులపై ఒకే రీతిలో ఉండదు. ధనికులతో పోల్చితే పేదలు, మధ్యతరగతులపై పన్నుతగ్గింపు ప్రభావం బహుతక్కువ. జిఎస్‌టి రేట్లు తగ్గినప్పటికీ, వినిమయ వస్తువుల్లో 27.1శాతంపై మాత్రమే ధరలు తగ్గినట్లు ఆ రీసెర్చి నిర్ధారించింది. ఉదాహరణకు, విద్యుచ్ఛక్తి, పెట్రోల్ ధరలు పెరిగాయి. వాటివల్ల ముఖ్యంగా ఆహారవస్తువుల ధరలు పెరిగాయి. అందువల్ల ఇటీవల కాలంలో ఆహార ద్రవ్యోల్బణం హెచ్చుగా కొనసాగుతున్నది. దిగువ, మధ్య ఆదాయ కుటుంబాలలో వారి మొత్తం వినిమయంలో ఆహార వస్తువులు ఎక్కువగా ఉంటా యి కాబట్టి ఆహార ధరల్లో పెరుగుదల వారిని ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. అందువల్ల జిఎస్‌టి రేటు క్రమబద్ధీకరణ వల్ల ఆర్థిక వ్యవస్థలో వస్తు గిరాకీ పెరుగుతుందనటం అతిశయోక్తి అవుతుంది. ఆర్థిక వ్యవస్థలో సగటు వినిమయ వ్యయం కొలమానాల్లో ఒకటి తలసరి ప్రైవేటు అంతిమ వినిమయ వ్యయం. ఈ తలసరి వృద్ధి 2024–25 నుంచి 2025–26 వరకు తగ్గింది. అసాధారణ ఒడిదుడుకులు సంభవించిన కరోనా కాలాన్ని మినహాయిస్తే 2015–16 నుంచి ఆ సగటు దాదాపు స్థిరంగా ఉంది. కాబట్టి జిఎస్‌టి రేట్ల క్రమబద్ధీకరణ వల్ల అన్ని వస్తువుల అంతిమ ధరలు తగ్గలేదు. సగటు వినిమయ వస్తు గిరాకీలో పెరుగుదల లేదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో సింహభాగం పరోక్ష పన్నుల నుంచే వస్తుంది. మన దేశంలో ప్రభుత్వాల ఆదాయంలో సుమారు 63శాతం పరోక్ష పన్నులనుంచే లభిస్తోంది. ప్రత్యక్ష పన్నుల వాటా 37 శాతం. జిఎస్‌టి విధింపు వల్ల ఆదాయం పెరిగినట్లు ప్రారంభంలో కనిపించినా, ఆ తర్వాత జిడిపిలో దామాషాగా జిఎస్‌టి ద్వారా ఆదాయం తగ్గుతున్నది. జిఎస్‌టివల్ల, రాష్ట్రాలకు పరిహారం నిలుపుదల వల్ల రాష్ట్రాలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వెచ్చించే సామర్థ్యం తగ్గింది. జిఎస్‌టి సంస్కరణల వల్ల తగ్గిన ఆదాయాన్ని సంపన్నులపై పన్నులు పెంచటం ద్వారా పరిహరించటం లేదు. ఆదాయ నష్టం అనేక విధాల వ్యయం తగ్గింపునకు దారితీస్తోంది. దీనివల్ల పేదలు నష్టపోతున్నారు. తాము సొంతంగా వనరులు సమీకరించుకుని, అభివృద్ధి కార్యక్రమాల ప్రాధాన్యతను నిర్ణయించుకునే రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కూడా తగ్గిపోయింది. గమనించాల్సిన మరో విషయం – జిఎస్‌టి వ్యవస్థ చాలా పెద్ద సంఖ్యలో రిజిష్టర్ కాని చిన్న పరిశ్రమలు, వ్యాపారులకు నష్టదాయకమవుతున్నది. ఎందుకంటే పెద్ద సంస్థలలాగా అవి ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ కోరలేవు. రెండోవైపున ఇంధనం, కరెంట్ ఛార్జీల పెంపుదలవల్ల ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఇది సామాన్య ప్రజల వినిమయ వ్యయం పెరుగుదలకు దారితీస్తోంది. ప్రధాన స్రవంతి మీడియా దీన్ని పూర్తిగా అలక్ష్యం చేస్తోంది.

## కార్లకు పెరిగిన డిమాండ్

సంవత్సరం క్రితం ప్రవేశపెట్టిన జిఎస్‌టి 2.0 కింద పన్ను రేట్ల తగ్గింపు ఆటో పరిశ్రమకు బాగా లాభించింది. ప్యాసింజర్ కార్లది టాప్ డిమాండ్ – ప్రతి నెలా పెరుగుతోంది. అనేక కంపెనీలు తమ పెట్టుబడులు పెంచుతున్నాయి. మారుతీ ప్యాసింజర్ కార్ల అమ్మకాలు ఏప్రిల్–ఆగస్టు మధ్య గత సంవత్సరం అదే కాలంతో పోల్చితే 36 శాతం పెరిగాయి. వాటిలో ప్రారంభ ధర కార్లకు డిమాండ్ 96 శాతంపైగా ఉంది. మహీంద్ర గ్రూపు ఉత్పత్తులు – ఎస్‌యువిలకు డిమాండ్ 17 శాతం, ఎల్‌సివిలు, ట్రాక్టర్లకు డిమాండ్ 20 శాతం పెరిగింది. హూండయ్ మోటారు ఇండియా– జిఎస్‌టి రేటు తగ్గింపు నాటినుంచీ నెలకు 4లక్షల కార్లు టోకు అమ్మకం చేస్తోం ది. ప్యాసిం జర్ కార్ల పరిశ్రమ 2025 సెప్టెంబర్ – 2026 మార్చి కాలంలో 15 శాతంపైగా వృద్ధిరేటు సాధించగా, ఏప్రిల్ – ఆగస్టు కాలంలో 29 శాతంపైగా వృద్ధి సాధించింది. జిఎస్‌టి 2.0 ప్రవేశపెట్టిన నాటినుంచి 11 మాసాల్లో (2025 అక్టోబర్ – 2026 ఆగస్టు) దేశంలో ఆటో రిటైల్ అమ్మకాలు 3 కోట్లు దాటాయి. సంవత్సరం క్రితంతో పోల్చితే ఇది 20 శాతం వృద్ధి. పన్ను సంస్కరణకు ముందు సంవత్సరంలో వృద్ధిరేటు 5 శాతంలోపే. ఒక్క కలం మార్క్‌తో పరిశ్రమ వృద్ధి నాలుగు రెట్లు పెరిగిందని అన్నారు ఎఫ్.ఎ.డి.ఎ. అధ్యక్షుడు సాయి గిరిధర్.

ఎన్నికల సంఘం స్వతంత్రత, విశ్వసనీయత పరిరక్షణకు

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- ప్రజల ఓటు హక్కుపై అనుమానాలు నివృత్తి చేయాలి : టిపిసిసి చీఫ్ బి.మహేష్‌కుమార్ గౌడ్
- రాహుల్ గాంధీ హెచ్చరించిన 'ఓట్ల చోరీ నిజమైంది' : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
- ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత ఎన్నికల సంఘం స్వతంత్రత, విశ్వసనీయత, సంస్థాగత సమగ్రతను పరిరక్షించాలని, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) చేసింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఈసి) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఎఐసిసి పిలుపు మేరకు టిపిసిసి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఉన్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (సిఈఓ) కార్యాలయం బిఆర్‌కెఆర్ భవన్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. తొలుత నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నుంచి సిఈఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశారు. ఈ సదర్భంగా టిపిసిసి అధ్యక్షులు బి.బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మహమ్మద్ అజహరుద్దీన్, జి.వివేక్ వెంకటస్వామి, ఎంపిలు అనిల్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులతో కలిసి తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్‌కుమార్ బాధ్యతలు నిర్వహిస్తున్న కాలంలో ఎన్నికల సంఘం పనితీరు, నిర్ణయాలు తీసుకునే విధానం, 'సర్' ప్రక్రియపై వెలువడుతున్న అంశాల పట్ల రాష్ట్ర సిఈఓతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, ప్రజా విశ్వాసానికి సంబంధించిన ప్రశ్నలకు బాధ్యత వహిస్తూ జ్ఞానేష్ కుమార్ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవికి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, నవీన్‌యాదవ్, శంకరయ్య, సీనియర్ నాయకులు ఎం.కోదండరెడ్డి, మాజీ ఎంపి అంజన్‌కుమార్, దానం నాగేందర్, టిపిసిసి ఎన్నికల వ్యవహారాల కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్, టిపిసిసి సర్ స్టేట్ కోఆర్డినేటర్ గంప వేణుగోపాల్ పాల్గొన్నారు.

**రాహుల్‌గాంధీ హెచ్చరించిన ఓట్ల చోరీ నిజమైంది' : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

దేశంలో గత కొన్నేళ్లుగా కుట్రపూరితంగా పౌరుల ఓటు హక్కును కాలరాస్తూ 'ఓట్ల చోరీ' జరుగుతోందని ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ పదే పదే చేసిన హెచ్చరికలు నేడు నిజమని తేలిపోయాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ పేరుతో పౌరుల ఓట్లను తొలగిస్తున్న తీరుపై ఇతర కమిషనర్లే స్వయంగా అంగీకరించడం దేశ ప్రజాస్వామ్యానికి పట్టిన దురదృష్టకర పరిణామమని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నిరసన కార్యక్రమంలో చేతిలో భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని పాల్గొన్న భట్టి విక్రమార్క, ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పునరంకితమై ఉందన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడటానికి రాహుల్ గాంధీ మొదటి నుంచీ పోరాడుతున్నారని గుర్తు చేశారు. ఓట్ల చోరీపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను నేడు స్వయంగా ఎన్నికల కమిషనర్లే ఒప్పుకోవాల్సి వచ్చిందన్నారు. భారత ప్రజాస్వామ్యంపై, పౌరుల హక్కులపై కాంగ్రెస్‌కు సంపూర్ణ విశ్వాసం ఉందని, ప్రతీ పౌరుడికీ వారి ఓటు హక్కు దక్కేంత వరకు పోరాటాన్ని ఆపేదిలేదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**ప్రజల ఓటు హక్కుపై స్పష్టత ఇవ్వాలి: మహేశ్ కుమార్ గౌడ్**

నిరసన కార్యక్రమంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన నివేదికలపై ఈసీ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్, ఎన్నికల సాఫ్ట్‌వేర్, ఫారం6 మార్పులకు సంబంధించి నిర్ణయాలు ఎలా తీసుకున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. సర్ సందర్భంగా రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా తొలగించిన ఓటర్ల సంఖ్య, తొలగింపులకు కారణాలు, అందిన అభ్యంతరాలు, తిరిగి చేర్చిన పేర్ల వివరాలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# 13 కోట్ల మంది ఓటర్లను ఎలా తొలగిస్తారు?

- జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కోట్లాది మంది ఓటర్ల హక్కులను హరించే విధంగా వ్యవహరించడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని, ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించడంతో పాటు అరెస్టు చేసి జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో కోట్లాది మంది పేర్లను తొలగించే అధికారం జ్ఞానేశ్ కుమారుకు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలపై దాడి చేయడమేనని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థను జ్ఞానేశ్ కుమార్ కేంద్రంలోని అధికార పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా మలిచే ప్రయత్నాలను కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందన్నారు. ఎన్నికల వ్యవస్థను అధికార పార్టీకి తాకట్టు పెట్టిన చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం బిఆర్‌కెఆర్ భవన్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి ఈ.టి. నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, పి.ప్రేమ్ పావని, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశ ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి తక్షణమే అరెస్టు చేయాలని సిపిఐ శ్రేణులు నినదించాయి. నిరసన ప్రదర్శన ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం చేరుకోగానే పోలీసులు గేట్లు మూసివేసి సిపిఐ నాయకులు, కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో గేటు ముందు రోడ్డుపై బైఠాయించి నిరసిన తెలిపిన వందలాది మంది సిపిఐ కార్యకర్తలు ఒక్కసారిగా గేట్లు తోసుకుని లోపలికి దూసుకువెళ్లారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సిపిఐ ప్రతినిధిబృందాన్ని లోపలికి అనుమతించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఈ.టి. నరసింహ నేతృత్వంలోని ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేసింది.

**అధికార పార్టీకి ఎన్నికల సంఘం తొత్తుగా మారితే ప్రజాస్వామ్యానికే విఘాతం**

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘం అధికారంలో ఉన్న వారికి తోత్తులుగా మారితే ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమని ఈ.టి.నరసింహ అన్నారు. ప్రజల ఓటును తొలగించి అధికారాన్ని మరోసారి చేజిక్కించుకేనేందుకు బిజెపి చేస్తున్న కుటిల రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అదే సమయంలో దాదాపు 13 కోట్ల మంది ఓటర్లను తొలగించినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వారిలో ఎంతమంది విదేశీయులు ఉన్నారో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం కేంద్రంలోని అధికార బిజెపికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఉన్నాయన్నారు. ప్రధానంగా బిజెపి, మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న నాయకులతో చివరికి ఆ ఇద్దరికి గిట్టని బిజెపి అగ్రనేత ఎల్.కె.అద్వానీ లాంటి వారికి నోటీసులు ఇవ్వడం వంటి చర్యలు కూడా అదే ప్రక్రియలో భాగమేనని పేర్కొన్నారు. పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, ఎన్నికల సంఘమే ఓటు హక్కు తొలగించాలని అప్పీల్‌కు ఎలా వెళుతుందని ఆయన ప్రశ్నించారు.

**జ్ఞానేష్‌కుమార్ చీఫ్ కమిషనర్ పదవికి అనర్హులు**

ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవికి జ్ఞానేష్ కుమార్ అనర్హుడని, ఆయన పదవిలో కొనసాగినంతకాలం దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుందని విమర్శించారు. ప్రభుత్వం ఈ అంశంపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, ఆందోళన ఉద్భవించే అవకాశం ఉందని హెచ్చరించారు. దేశంలో అర్హుడైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండటం, ఆ ఓటు హక్కును ఎన్నికల ప్రక్రియలో రక్షించడం ప్రజాస్వామ్యానికి కీలకమని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.ఏసురత్నం, హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులుకాంపల్లి శ్రీనివాస్, శంషుద్దీన్, సలీం ఖాన్, నేర్లకంటి శ్రీకాంత్, ఆర్.రాజ్‌కుమార్, ఎం.వెంకటయ్య, ఆర్.బాలకృష్ణ, బోద్దుపల్లి కిషన్, కొమురెల్లి బాబు, సబ్బు రాజమౌళి పాల్గొన్నారు.

## ఆసియా క్రీడల్లో ఈషా సింగ్‌కు రజతం

- తెలంగాణ ముద్దుబిడ్డ పోరాట స్ఫూర్తికి సిఎం రేవంత్ రెడ్డి ప్రశంసలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జపాన్‌లో జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో రజత పతకం సాధించిన తెలంగాణ షూటర్ ఈషా సింగ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఐదుసార్లు జరిగిన షూట్ ఆఫ్‌లలో తీవ్ర ఒత్తిడిని ధైర్యంగా ఎదుర్కొంటూ ఈషా సింగ్ కనబరిచిన ప్రదర్శన అద్భుతమని సిఎం ప్రశంసించారు. స్వల్ప తేడాతో స్వర్ణ పతకం చేజారినా చివరి వరకు పట్టుదలతో పోరాడిన తీరు అభినందనీయమని పేర్కొన్నారు. ఈషా సింగ్ పోరాట స్ఫూర్తి క్రీడాలోకానికి ఆదర్శమని రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ బిడ్డ అంతర్జాతీయ వేదికపై దేశానికి పతకం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో అద్భుత విజయాలు సాధించి, దేశ ప్రతిష్ఠతో పాటు తెలంగాణ కీర్తిని ప్రపంచ వేదికపై మరింత ఇనుమడింపజేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈషా సింగ్ క్రీడా ప్రయాణంలో మరిన్ని పతకాలు సాధించాలని అభిలషిస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు.

# త్వరితగతిన స్కూళ్ల నిర్మాణాలు పూర్తి

- ఇంజనీరింగ్ అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల' నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాభవన్‌లో పాఠశాలల భవన నిర్మాణ పురోగతిపై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. పేద విద్యార్థులకు కుల, మత భేదాలు లేకుండా ఒకే ప్రాంగణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య, అన్ని మౌలిక సదుపాయాలు అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులను ఒకే చోట చేర్చి సమీకృత విద్య అందించడం ద్వారా సామాజిక సమానత్వాన్ని బలోపేతం చేయవచ్చని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో చేపడుతున్న పాఠశాలల నిర్మాణానికి జిల్లా కలెక్టర్లతో సమన్వయంగా ప్రత్యేక వర్క్ క్యాలెండర్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వారానికోసారి పనుల పురోగతిని సమీక్షించి నివేదికలు సమర్పించాలని సూచించారు. నిర్మాణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనులు వేగం పుంజుకునేలా అధికారులు రాత్రింబవళ్లు కృషి చేయాలని డిప్యూటీ సీఎం కోరారు. వచ్చే నెల రెండో వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కూళ్లను తానే స్వయంగా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఇప్పటివరకు 87 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాఠశాలలు మంజూరు కాగా, 70 పాఠశాలల్లో నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు ఈఎంసి గణపతి రెడ్డి పాఠశాలల నిర్మాణ పురోగతిని డిప్యూటీ సీఎంకు వివరించారు. మరో 5 పాఠశాలలకు డిపిఆర్‌లు సిద్ధమవుతున్నాయని, 3 పాఠశాలల టెండర్ల ప్రక్రియ తుది దశలో ఉందని చెప్పారు. మిగిలిన 4 పాఠశాలలకు స్థల సమస్యలు ఉన్నట్లు వివరించారు. నిర్ణీత కాలపరిమితిలో పనులను పూర్తి చేసి భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు.

## సిఇసిని తొలగించాలి.. 'ఎస్ఐఆర్'ను నిలిపివేయాలి

30న సిఇఒ కార్యాలయం ముందు నిరసనను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం వద్ద నిర్వహించనున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని వామపక్షాలు, కాంగ్రెస్, బిఆర్ఎస్, టీజేఎస్, మేధావులు, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘంలోని మెజార్టీ సభ్యుల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తుండంతో ఎన్నికల వ్యవస్థపై విశ్వసనీయత దెబ్బతింటోందని వారు పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారాయని వారు విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30న హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో ఉన్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం ముందు నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ 1న అన్ని జిల్లా కేంద్రాల్లోనూ నిరసనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమాలలో కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారాక్వాట్ డైక్లోరైడ్ పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాన్ని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ స్వాగతిస్తుందని చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. మానవులు, జంతువులకు పారాక్వాట్ డైక్లోరైడ్ వినియోగం ప్రమాదకరమని పేర్కొంటూ కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చే అంశంగా ఆయన అభివర్ణించారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గెజిట్ ఉత్తర్వుల ప్రకారం పారాక్వాట్ డైక్లోరైడ్‌కు కొత్త రిజిస్ట్రేషన్లు ఇవ్వడంపై నిషేధం విధించింది. ఇప్పటికే మంజూరైన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు కూడా రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేయడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలోను కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో పారాక్వాట్ డైక్లోరైడ్‌కు సంబంధించి ప్రస్తుతం ఉన్న పరిస్థితి, అందుబాటులో ఉన్న నిల్వలు, కేంద్ర ఉత్తర్వుల అమలుకు తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

## ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం చేరకపోతే చర్యలు

- పనితీరు లేని కంపెనీలకు కేటాయించిన జిల్లాలు రద్దు
- గెలల సేకరణలో అక్రమాలపై దర్యాప్తు: మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఏడాదికి 2 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చేరుకోవాలని, రైతులకు మొక్కల సరఫరా నుంచి గెలల సేకరణ వరకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయిల్‌ఫెడ్ ప్రధాన కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి, విధులకు ఆలస్యంగా హాజరైన కొందరు సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. రైతులకు సంబంధించిన పనుల్లో నిర్లక్ష్యానికి తావులేదని హెచ్చరించారు. అనంతరం మంత్రి ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, మొక్కల సరఫరా, డ్రిప్, ప్రాసెసింగ్ మిల్లులు, గెలల సేకరణ, రైతులకు అందుతున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పనితీరు సరిగా లేని ఆయిల్‌పామ్ కంపెనీలకు కేటాయించిన జిల్లాలను రద్దు చేస్తామని, ఆఖరికి ఆయిల్‌ఫెడ్ అయినా పనితీరు బాగాలేకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గెలల సేకరణ కేంద్రాల్లో అవకతవకలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 45 నర్సరీల్లో 47 లక్షల మొక్కలు పెంచుతున్నామని అధికారులు తెలిపారు. ఇందులో 9.50 లక్షల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉండగా, వచ్చే మూడు నెలల్లో మరో 12 లక్షలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. అశ్వారావుపేట, అప్పారావుపేట, నర్మెట్ట ప్రాసెసింగ్ మిల్లులను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపడంతో పాటు నిర్మాణంలో ఉన్న మరో ఆరు మిల్లులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతు ప్రయోజనాలే కేంద్రంగా అధికారులు, సంస్థలు పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

మహిళలకు సమాన హక్కుల సాధనకు

# సమరశీల పోరాటాలకు సంసిద్ధం కావాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో సగభాగంగా ఉన్న మహిళలకు సమానమైన చట్టపరమైన, సామాజిక, రాజకీయ హక్కులను సాధించడానికి సమరశీల పోరాటాలను సంసిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు. మహిళలపై పెరుగుతున్న నేరాలను అరికట్టడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పుర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో సోమవారం భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ) రాష్ట్ర సమితి సమావేశం రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కూనంనేని సాంబశివ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మహిళలు తీవ్ర సవాళ్లను ఎదుర్కుంటున్నారని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం అని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదించిన తరువాత అమలు చేయకుండా బుట్ట దాఖలు చేసిన మోదీ ప్రభుత్వం మహిళలకు రాజకీయ సాధికారత దక్కకుండా చేసిందని విమర్శించారు.మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును, వివాదాస్పదమైన 'నియోజక వర్గాల పునర్విభజన' ప్రక్రియతో కేంద్ర ప్రభుత్వం ముడిపెట్టడం 'ప్రజాస్వామ్యంపై దాడి' అని అన్నారు. అసలు మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన' ప్రక్రియతో ఏమి సంబంధం అని అయన ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ మహిళలతోపాటు రైతు, యువజన, విద్యార్థుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా మోసం చేస్తుందని చెప్పారు. ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షురాలు డా.కె.రజిని, సీనియర్ నాయకురాలు ప్రేమ్ పావని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, ఏం.నళిని, సహాయ కార్యదర్శులు ఫైమీద బేగం, ఏ.లతాదేవి, కోశాధికారి జె. లక్ష్మి, నేతలు పడాల నళిని, కె.జ్యోతి, మాదవి, ఉజ్జిని హైమావతి, ప్రమీల, రొయ్యల గిరిజ కృష్ణమూర్తి, నీలమ్మ, సుగుణ మ్మ, సుగుణ, అమినా, దీన, పద్మావతి, కోటమ్మ పాల్గొన్నారు.

# చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- నేతన్న భరోసా, త్రిఫ్ట్ సహా హామీలు అమలులో తీవ్ర నిర్లక్ష్యం : సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ ఆర్థిక, సామాజిక నిర్మాణంలో కీలకమైన చేనేత రంగాన్ని కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ రంగం పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంవిమర్శించారు. చేనేత కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, సంక్షేమ పథకాలను పెండింగ్‌లో ఉంచుతూ నేత కార్మికుల జీవనోపాధిని సంక్షోభంలోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత రంగాన్ని, దానిపై ఆధారపడిన లక్షలాది కుటుంబాలను రక్షించేందుకు ఇతర వృత్తి, కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. కోటా రాజయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన నేతన్న భరోసా, త్రిఫ్ట్ పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని విమర్శించారు. చేనేత కార్మికుల సమస్యలను శాసనమండలి, శాసనసభతో పాటు సంబంధిత మంత్రుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో చర్యలు జరగలేదన్నారు. సంప్రదాయ చేనేత వృత్తి మరింత బలహీనపడితే లక్షలాది కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. కష్టించి పనిచేసి సమాజానికి అవసరమైన ఉత్పత్తులు, సేవలు అందిస్తున్న వర్గాలను ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**4 ఛైర్మన్ స్థానాలు గెలవడం అభినందనీయం**

ఇటీవల జరిగిన సహకార సంఘాల ఎన్నికల్లో వామపక్ష, చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాలుగు ఛైర్మన్ స్థానాలను గెలుచుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో డబ్బు, విందులు, వినోదాలు, రాజకీయ ప్రభావం కీలకంగా మారిన పరిస్థితుల్లో కూడా సిద్ధాంతబద్ధంగా, ప్రజల మద్దతుతో చేనేత కార్మిక సంఘాలు విజయం సాధించడం సాధారణ విషయం కాదన్నారు. ఒక్కో ఓటుకు వేలాది రూపాయలు వెచ్చించే స్థాయికి ఎన్నికల వ్యవస్థ దిగజారుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధోరణి కొనసాగితే డబ్బు ఉన్న వ్యాపారవేత్తలు, కోటీశ్వరులే ఎన్నికల్లో ఆధిపత్యం చెలాయించే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

**చేనేత కార్మికుల 11 డిమాండ్లను నేరవేర్చాలి**

తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు టి.వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మి నర్సయ్యలు మాట్లాడుతూ త్రిఫ్ట్ ఫండ్ పథకంలోని పెండింగ్‌లో ఉన్న 16 నెలల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. చేనేత భరోసా పెండింగ్ నిధులను విడుదల చేయడంతో పాటు చేనేత బీమాకు సంబంధించి ప్రిమియంను చెల్లించాలన్నారు. చనిపోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు ఫ్యామిలి సర్టిఫికెట్స్ త్వరగా ఇవ్వడంతో పాటు అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి జియోట్యాగింగ్‌తో సంబంధం లేకుండా రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని, టెస్కోకు సైత ఎన్నికలు నిర్వహించాలని, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్‌ను రద్దుచేసి కార్మికుల నిరంతరం పని కల్పించేందుకు వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం కార్యవర్గ సభ్యులు చేపూరి ధనంజయ, ఆర్.గణేశ్, కె.బాలమోహన్, ఎస్.సత్తయ్య, ఇ.గోపయ్య, సి.హెచ్.వెంకటేశం, జె.భాస్కర్ పాల్గొన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్

షార్ట్ టెండర్ నోటీసు నెం. 34/EE/Div-28/GHMC/2026-27, తేది: 22.09.2026

**Nit No.** షార్ట్ టెండర్ నోటీసు నెం. 34/EE/Div-28/GHMC/2026-27, తేది: 22.09.2026, పని వివరణ: నిర్వహణ పనులు (5) నెం.లు, **అంచనా విలువ:** రూ.24.20లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 28.09.2026 సా.5.00గం.లకు, స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 05.10.2026 సా.5.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీమతి ఆర్.ఇందిరా బాయి, సెల్ నెం. 9963025505. పనుల వివరాల కాపీ జతచేయబడినది.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-28, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 10789-PP/CL/ADVT/2026-27, Date: 28-09-2026

**పురపాలక సంఘ కార్యాలయం-వైరా, ఖమ్మం జిల్లా.**

NIT No. E/Wyra/174/2026 — ఇ-సేకరణ టెండర్ నోటీసు — తేది: 28.09.2026

వైరా పురపాలక సంఘం పరిధిలో రెండు సంవత్సరాలపాటు అభివృద్ధి పనులు నిర్వహించాలి. అందుకు వీలుగా నాణ్యతా నియంత్రణ పరీక్షలు, నివేదికల జారీలో తగిన పరికరాలు మరియు అనుభవంగల రిజిస్ట్రేషన్ పొందిన కన్సల్టెన్సీ సంస్థలు పరిమాణ నిర్ధారణ సేవలు (థర్డ్ పార్టీ క్వాంటిటీ ఎస్యూరెన్స్) అందించాలి. ఆసక్తిగల కన్సల్టెన్సీ సంస్థల నుండి వైరా పురపాలక సంఘం కమిషనర్ ఆసక్తి వ్యక్తీకరణ (ఇ.ఓ.ఐ)లను ఆహ్వానించడమైనది.

ఈ కన్సల్టెన్సీ / ప్రయోగశాల సేవలలో గత అనుభవం మరియు ఈ పనులు చేపట్టడానికి అవసరమైన ఆర్థిక సామర్థ్యంగల, ఆసక్తిగల రిజిస్టర్డ్ సంస్థలు, సదరు విభాగం నిర్ధారించిన ధరల ప్రాతిపదికపై మాత్ర సంస్థలకున్న అర్హతల ప్రాతిపదికపై నాణ్యతా నియంత్రణ పరీక్షలు నిర్వహించడానికి తమ ధరల ప్రతిపాదనలు (కోట్స్) సమర్పించవచ్చు.

టెండరు షెడ్యూలు

1. ఇ.ఓ.ఐ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ ఇఎండి @ రూ.5000/-తో పాటు ఇతర పత్రాలు : 30.09.2026 (ఉదయం 10.30 గంటల నుండి)
2. ఇ.ఓ.ఐల డౌన్‌లోడింగ్ ముగింపు తేదీ : 03.10.2026(3.00 గంటల వరకు)
3. సీల్డు కవర్లలో ఇ.ఓ.ఐలను సమర్పించే తేదీ : 03.10.2026(4.00 గంటల వరకు)

టెక్నికల్ బిడ్ మరియు ఫైనాన్సియల్ బిడ్‌లను సీల్‌చేసి కమిషనర్ ఛాంబర్‌లో ఉన్న ఇ.ఓ.ఐ బాక్సులో వేయాలి. ఈ బిడ్‌లను **03.10.2026** తేదీ **సాయంత్రం 4.00 గంటల** వరకు ఇ.ఓ.ఐ బాక్సులలో వేయడానికి గడువు ఉన్నది. ఈ విధంగా వేసిన బిడ్‌లను **05.10.2026 ఉదయం 10.30 గంటలకు** తెరచి చూడబడును.

- ఇతర ఎలాంటి సందేహాలు, ప్రశ్నలు ఉన్నాగానీ వైరా పురపాలకసంఘం కమిషనర్‌ను సెల్ నెం. 7396507165 ద్వారా మరియు 9515626861 సెల్ నెంబర్ ద్వారా అసిస్టెంట్ ఇంజనీర్ (ఎఇ)ను సంప్రదించాలి.

సం/- కమిషనర్
వైరా పురపాలక సంఘం

DIPR R.O. No. : 10767-PP/CL/ADVT/2026-27, Date: 28-09-2026

# సిఎం పర్యటనకు పటిష్ట భద్రత

**కలెక్టరేట్, హెలిప్యాడ్, పరిసరాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన**
**కలెక్టర్, సిపి, సిఎం భద్రతా అధికారుల సమీక్ష..**
**సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం**



**ప్రజాపక్షం/కరీంనగర్:** నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ నెల 30న కరీంనగర్‌కు రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సీఎం భద్రతా అధికారులు నూతన కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిప్యాడ్, తెలంగాణ తల్లి విగ్ర హం, నూతన కలెక్టరేట్ భవనం, సమావేశ మందిరం, జిల్లా కలెక్టర్ నూతన చాంబర్, పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ సిపి, సీఎం భద్రతా అధికారులు పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక, కార్యక్రమాల నిర్వహణ, కాన్వాయ్ రాకపోకలు, తిరు గు ప్రయాణం వరకు చేపట్టాల్సిన భద్రతా చర్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రత, ప్రోటోకాల్, ఇతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందు నిర్వహించే అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ సమీక్షలో భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు, హెలిప్యాడ్, సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ప్రోటోకాల్ తదితర అంశాలను సమీక్షించారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమన్వయంతో తూచా తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. నిర్దిష్ట సమయంలోగా ఏర్పాట్లను పూర్తి చేసి, ప్రతి అంశాన్ని పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు, నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేకంగా రోడ్లు–భవనాలు, అటవీ, విద్యుత్, ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెలిప్యాడ్ వద్ద సీఎం స్వాగతం నుంచి తిరిగి హెలికాప్టర్ బయలుదేరే వరకు ప్రతి దశలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సీఎం కాన్వాయ్, గౌరవ వందనం, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖల అధికారులు పోలీసు సిబ్బందికి సహకరిస్తూ సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, సీఎంవో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ అధికారులు ఎస్పీ రామచందర్‌రావు, డీఎస్పీలు దుర్శేటి రఘు చందర్, శ్యామ్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆశయ సాధనకు యువత ఉద్యమించాలి

ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాద, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అసమానతలు లేని సమాజ నిర్మాణానికి యువత ముందుకు సాగుతూ ఉద్యమించాలని, భగత్ సింగ్ ఆశయాలు నేటి యువతరం ముందుకు తీసుకెళ్లి ఉద్యమించాలని యుగంధర్ అన్నారు. భగత్ సింగ్ 119వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బోయవాడలోని భగత్ సింగ్ విగ్రహానికి ఏఐవైఎఫ్ నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేస్తూ బ్రిటిష్ ఉరికంబాన్ని ముద్దాడి అమరత్వం పొందిన విప్లవ ధ్రువతార షహీద్ భగత్ సింగ్ అని కొనియాడారు. వారి పోరాట స్ఫూర్తితో నేటి సమాజంలో అసమానతలపై, అందరికీ సమాన హక్కులకై, దోపిడి, పీడన, అణిచివేత, కులమత లేని సమ సమాజ స్థాపనకై పోరాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ముందుకు సాగుతూ యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కసిబోసుల సంతోష్ చారి, ఉపాధ్యక్షులు కాల్వ శ్రీనివాస్ యాదవ్, పినమల్ల విజయభాస్కర్, నగర సహాయ కార్యదర్శి జువ్వాజి తిరుపతి, జహీర్ ఖాన్,వర్ధన్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 1 నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి: కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** ఇటివల కురిసినవర్షాలతో జిల్లాలో డెంగ్యూ కేసులు పెరిగే అవకాశం ఉందని అన్ని గ్రామాల్లో, మున్సిపాలిటీలలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మధ్య కురిసిన వర్షాల వలన దోమలు వృద్ధి చెంది డెంగి కేసులు పెరిగే అవకాశం ఉన్నందున గ్రామాలు మున్సిపాలిటీలలో యాంటీ లార్వా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. చేయూత పింఛన్ల మంజూరు సంబంధించి ప్రతి మండలంలో 5 నుండి 10% అప్లికేషన్లను ఫీల్డ్ వెరిఫికేషన్ చేయాలని అన్నారు. ఈనెల 29వ తేదీ మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సభ్యులు జిల్లాలో సమావేశం నిర్వహించనున్న అందుకు సంబంధించిన పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలని అన్నారు. అక్టోబర్ 1వ తేదీ నుండి జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వారి ధాన్యాన్ని సేకరించినందుకు ముందస్తుగా అన్ని కొనుగోలు కేంద్రాలలో అవసరమైన తేమశాతం కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలు, తాలు తీసే యంత్రాలు సిద్ధం చేసుకోవాలని, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు, త్రాగునీరు, షెడ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ నాగ రాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ శాఖల జిల్లా అధికారుల తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించేందుకే గ్రీవెన్స్ డే



**ప్రజాపక్షం/జగిత్యాల :** సమస్యలను పరిష్కరించేందుకే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ సోమవారం ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పీ గారికి నేరుగా వివరించారు.ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను జిల్లా ఎస్పీ తెలుసుకొని సంబంధిత పత్రాలను పరిశీలించి ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.జిల్లా పోలీసు శాఖ ప్రజలకు పారదర్శకమైన, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ తెలిపారు. అనంతరం జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించిన గణేష్ నిమజ్జనోచవాలను విజయవంతం చేయడంలో కృషి చేసిన ట్రాన్స్జెండర్లు, ncc,nss వాలింతర్లకు ఎస్పీ చేతుల మీదుగా ప్రసంసా పత్రాలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్,ఉన్నారు.

## రాష్ట్రస్థాయి చెస్ పోటీలో ఆల్ఫోర్స్ విద్యార్థి ప్రతిభ



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** క్రీడలు సమాజంలో చాలా కీలకంగా వ్యవహరిస్తాయని విద్యార్థుల సమర్థతోముఖాభివృద్ధికి చాలా ఉపయోగపడుతాయని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డి అన్నా రు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించడం పట్ల ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. చెస్ ఆడడం ద్వారా విద్యార్థుల సృజనాత్మకతతోపాటు చక్కటి ఆలోచన విధానం పెరుగుతుందని తద్వారా ఇతరుల కంటే పై చేయి సాధించవచ్చని అన్నారు. తెలంగాణ స్టేట్‌సెస్ అసోసియేషన్ ఈనెల 18 నుంచి 20 వరకు వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన జి.శివాస్ అండర్ 15 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి ద్వితీయ స్థానంతోపాటు రజత పతకాన్ని గెలుచుకున్నాడని హర్షం వ్యక్తం చేస్తూ విజేతకు పుష్పగుచ్ఛం అందజేసి విజయపరంపర కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో యువత ఉద్యమించాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందే అశోక్



**ప్రజాపక్షం/సిద్దిపేట:** భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో యువత ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్ లు పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను పురస్కరించుకొని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో మహనీయుని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు భారతదేశానికి స్వాతంత్రం రావాలని 23 ఏళ్ల వయసులోనే స్వాతంత్రం నా జన్మ హక్కు అని చాటి చెప్పి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఉరితాడును ముద్దాడిన గొప్ప వీరులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బిచ్చాల శ్రీనివాస్, గొర్ల రాజు యాదవ్, వల్లెపు రాజు, బోడపట్ల రాజు, కొలమద్ది ఆనంద్, గుండెల్లి కార్తిక్, పీరీల లోకేష్, కిన్నెర మహేష్ తేజ, కాశబోయిన చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల చోరీని అరికట్టండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

**కలెక్టరేట్ ఎదుట సిఇసి జ్ఞానేష్ కుమార్, మోదీ, అమిత్ షా దిష్టిబొమ్మల దహనం**




**ప్రజాపక్షం/కరీంనగర్:** ఓట్ల చోరీని అరికట్టాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ ఎఐసిసి,పిసిసి పిలుపు మేరకు సోమవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి భారీ ర్యాలీ నిర్వహించడంతోపాటు కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షతన ఇందిరా చౌక్ నుండి కలెక్టరేట్ వరకు వందలాది మంది కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే, పిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితేల ప్రణవ్ బాబు, ఎమ్మెల్సీ పోటీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ధనిక, పేద తేడా లేకుండా డా. బి.ఆర్. అంబేద్కర్ మనకు ఓటు హక్కు కల్పించారని, 79 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఎన్నికల సంఘం ఎప్పుడూ ప్రజల విశ్వాసానికి నాంది పలికిందని, కానీ మోదీ సర్కార్ వచ్చాక సిబిఐ, ఈడీ,ఐటి లాగే ఎలక్షన్ కమిషన్‌ను కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మార్చారని ఆరోపించారు. ఇద్దరు కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 సార్లు ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకించారంటే ఆయన తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. జెన్–జీ ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించినట్లు, దేశంలోని ప్రతి పౌరుడు జ్ఞానేష్ కుమార్ బర్తరఫ్ అయ్యే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పుల అంజనీ ప్రసాద్ , సిరాజు హుస్సేన్, ఆకుల నరసయ్య, ఎండి తాజ్, మడుపు మోహన్, పులి ఆంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, గడ్డం విలాస్ రెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గోదావరి పరిరక్షణకై ఎన్‌టిపిసి శుభ్రత డ్రైవ్!

**ప్రజాపక్షం/అంతర్గాం:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ పుష్కరఘాట్ గోదావరినది వద్ద రామగుండం ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో భారీ పరిశుభ్రత డ్రైవ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పవిత్ర గోదావరినది పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఎన్‌టిపిసి ఈ.డి.(ఆర్అండ్‌టి) చందన్ కుమార్ సమంత ప్రారంభించారు.ఎన్‌టిపిసి హెచ్ఆర్ విభాగం నేతృత్వంలో సిఐఎస్ఎఫ్ బృందం, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంటు గ్రూప్ (ఈఎంజి) బృందం, గోలివాడ, విలేజి అంతర్గాం గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు, ప్రజలు సుమారు వంద మంది పాల్గొని నది తీరంలో ఉన్న చెత్త చెదారం, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎన్‌టిపిసి ఈ.డి. చందన్‌కుమార్ సమంత మాట్లాడుతూ, వినాయక నిమజ్జనం అనంతరం నదిలో పెద్ద విగ్రహాలు, చెత్త పేరుకుందని, వాటిని తొలగించి సేకరించిన వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రారెడ్డి, జ్యోతి పరమేశ్వరన్,రామ్మూర్తిగౌడ్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల:** కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలు, ఏకపక్ష విధానాన్ని నిరసిస్తూ జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మద్దతు తెలిపారు.సర్ ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్న అవకతవకలపై నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు.కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2002 లో సమగ్ర ఓటర్ నమోదు ప్రక్రియ కు అనుగుణంగా అప్పుడు నమోదు చేసుకున్న వారికి ఇప్పుడు 'సర్'ప్రక్రియలో ధ్రువ పత్రాలు అందజేసినా మళ్ళీ నోటీసులు రావడం అనేది చాలా విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ తీరు తో బీద, మధ్యతరగతి ప్రజలకు చాలా ఇబ్బందిగా మారిందన్నారు. ప్రజా స్వామ్యం లో ఓటు ప్రధాన ఆయుధమన్నారు. బిఎల్ఓలకు సరైన పత్రాలు అందజేసినా ఎలక్షన్ కమిషన్ మళ్లీ నోటీసులు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. దేశంలో ఓట్ల గల్లంతు,తొలగింపు వల్ల ఆయా రాష్ట్రాల్లో సీఎం లు కూడా ఓడిపోయిన ఘటనలు జరిగాయని ఉదహరించారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బంగారం వెండి ,గ్యాస్ ,పెట్రోల్ ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు. సర్ ప్రక్రియలో నాతో పాటు మాజీ మంత్రి రాజేశం గౌడ్ కు నోటీసులు వచ్చాయి అంటే సామాన్య ప్రజల పరిస్థితి పట్ల ఆలోచన చేయాలన్నారు.ఓటు చోరీ పై మళ్ళీ దేశంలో యువత ప్రజానీకం ఉద్యమం చేసే అవకాశం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో లైబ్రరీ చైర్మెన్ దినేష్,మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కృష్ణ రావు,తదితరులు ఉన్నారు.

## కార్పొరేషన్‌కు నష్టాన్ని కలిగించే ఎజెండాలు రద్దు చేయాలి

బిఆర్ఎస్, సిపిఐ ఫ్లోర్ లీడర్స్ సమ్మయ్య యాదవ్, మార్కపురి సూర్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రామగుండం నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగిన క్రమంలో అందులో తీసుకున్న కొన్ని ఎజెండాలు కార్పొరేషన్ నిధులకు ఆర్థికంగా నష్టం జరిగే అవకాశాలు ఉన్నందున నూతన మున్సిపల్ చట్టం 2019 సెక్షన్ 65 ను అనుసరించి జిల్లా కలెక్టర్ కొన్ని ఎజెండాలను రద్దు చేయాలని సోమవారం రోజున ప్రజావాణిలో కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్‌కు బిఆర్ఎస్ సిపిఐ ఫ్లోర్ లీడర్స్ మేకల సమ్మయ్య యాదవ్, మార్కపురి సూర్య వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎజెండాలో సద్దుల బతుకమ్మ పండుగ రోజున ఎల్ఈడి 120 వాట్స్ ఫ్లడ్ లైట్లఅద్దె ప్రతిపాదికన ఏర్పాటుకు 60 డివిజన్లకు గాను 22 లక్షల కేటాయించడం జరుగుతుంది. కానీ ప్రస్తుతం ఉన్న ఆన్లైన్ మార్కెట్లో గాని మేకింగ్ ఇండియా ఫ్లాట్ ఫార్మ్ లో గాని చూస్తే 22 లక్షల్లో సొంతంగా కార్పొరేషన్ వారే లైట్లు కొనుగోలు చేయవచ్చు తద్వారా 5 ఏళ్లలో సుమారు 80 లక్షల రూపాయల ప్రజాధనాన్ని మదుపు చేసే అవకాశం ఉన్నది కావున ఇట్టి ఎజెండాను పరిశీలించి రద్దు చేయగలరు. అర్బన్ చాలెంజ్ ఫండ్ కోసం డి పి ఆర్ తయారీ కోసం ప్రైవేట్ కన్సల్టెన్సీ లను ఆశ్రయిస్తున్నారు గతంలో కూడా ఇలాగే మన కార్పొరేషన్ వారు డిపిఆర్ సిద్ధం చేసిన అవి ఆమోదం పొందలేదు ఆ ప్రాజెక్టు రాకపోయినప్పటికీ సుమారు 26 లక్షల రూపాయలు మన కార్పొరేషన్ నిధుల నుండి డిపిఆర్ తయారుచేసిన సంస్థకు చెల్లించడం జరిగింది ఇప్పుడు కూడా ఈ మూడు డీపిఆర్లు సంబంధించిన ప్రాజెక్టు వ్యాల్యూ సుమారు 375 కోట్లు అంటే డిపిఆర్ తయారుచేసిన వారికి సుమారు కోటి 80 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది మన ఇంజనీరింగ్ అధికారులను ఉపయోగించి డిపిఆర్ తయారు చేయడం లేదా డిపిఆర్ ఆమోదం పొందితేనే కమిషన్ ఇచ్చే నిబంధనలతో ఈ ఎజెండాపై నిర్ణయం తీసుకోవాలని తమరికి విజ్ఞప్తి చేస్తున్నాను. నూతన మున్సిపల్ చట్టం 2019 సెక్షన్ 65ను అనుసరించి రామగుండం నగరపా టలక సంస్థను ఆర్థికంగా నష్టాన్ని చేకూర్చే పై ఎజెండాలను రద్దు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. వారితోపాటు సిపిఐ నాయకులు చంద్రశేఖర్, నాయకులు తోకల రమేష్ ఉన్నారు.

## ఏలోటూ ఉండొద్దు: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** ఈనెల 30వ తేదిన బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. ఈ సందర్భంగా రగుడు బైపాస్ రోడ్ వద్ద పబ్లిక్ మీటింగ్ స్థలాన్ని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితె, కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర, ఐఎస్‌డబ్ల్యూ ఎన్ సీ ఎస్పీ మాధవరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అంతకుముందు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో హెలిప్యాడ్ నిర్మాణ పనులు కొనసాగుతుండంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితె, కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర, ఐఎస్‌డబ్ల్యూ ఎన్ సీ ఎస్పీ మాధవరావు, అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని అలాగే సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్ వద్ద ఉన్న మైదానంలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నారని తెలిపారు. పోలీస్ అధికారులు హెలిప్యాడ్, పబ్లిక్ మీటింక్ స్థలంలో బందోబస్త్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు పకబ్బందీగా చేయాలని స్పష్టం చేశారు.

**అధికారులతో సమీక్ష:** సీఎం రేవంత్ రెడ్డి రాక నేపథ్యంలో వివిధ శాఖలఅధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితె, కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర, ఐఎస్‌డబ్ల్యూ ఎన్ సీ ఎస్పీ మాధవరావు, అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈఈ ఆర్ అండ్ బి హెలిప్యాడ్ సభ స్థలం వద్ద స్టేజ్, పార్కింగ్ ఏర్పాట్లు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్లు జిల్లా పంచాయతీ అధికారి పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా కోసం ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్‌పీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరా ఇతర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో శ్రీధర్ బాబు, కెఎస్‌బి కుమారి, భీమ్లానాయక్, ఏంజెలా ఆల్ఫ్రెడ్, శ్రీనివాస్, హిమశ్రీ, ప్రొబేషనరీ డిప్యూటి కలెక్టర్ నిఖిత, డిఎస్పీలు నాగేంద్రాచారి, నర్సిరెడ్డి, మున్సిపల్ కమీషనర్లు ఖదీర్ పాషా, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆకలి తీరుస్తున్నాం

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ప్రభుత్వ పాఠశాలలో చది వే విద్యార్థిని విద్యార్థులు ఆకలితో అలమటించకుండా ఉండేందుకు, ప్రభుత్వ విద్యాలయాల బలోపేతానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో హరే రామ హరే కృష్ణా ట్రస్టు భాగస్వామ్యంతో ప్రభు త్వ పాఠశాలల్లో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూపేద విద్యార్థులు ఆకలితో అలమటించద్దు అనే సంకల్పంతో రాష్ట్ర ప్రభు త్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హరే రామ హరే కృష్ణా ట్రస్టు భాగస్వామ్యంతో ఉదయం పూట అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి జిల్లా విద్యారంగంలో అగ్రగామిగా నిలిచిందని ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రూ. 70 కోట్లు వెచ్చించి ప్రభుత్వ బడులను ఆధునీకరిస్తున్నామని విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. రూ. 200 కోట్లతో పెద్దపల్లి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపడుతున్నామని అన్ని కుల మతానికి చెందిన వారందరూ ఒకే విధంగా సామాన్యంగా ఉండే దిశగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల రూపొందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సురేంద్ర ప్రసాద్, విద్యాధికారులు, తహసీల్దార్ రాజయ్య పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్,కమిషనర్, పట్టణ కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్పంచ్ భర్తపై ప్రజావాణిలో ఫిర్యాదు



ప్రజాపక్షం/నిజామాబాద్: భార్య సర్పంచ్‌గా గెలువగా భర్త అన్ని తానై గ్రామంలో అధికారం చలాయిస్తున్నారని బందారం సంతోష్ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి అధికార దుర్వినియోగం చేస్తున్నారంటూ ప్రజావాణిలో విన్నవించాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎడపల్లి మండలం పోచారం గ్రామానికి చెందిన సర్పంచ్ నీరడి జ్యోతి భర్త నీరడి రవి తానే సర్పంచ్ నంటూ అధికారం చలాయించటమే కాకుండా అధికార కార్యక్రమాల్లో పాల్గొంటు న్నాడని ప్రశ్నిస్తే తానే సర్పంచ్‌నని చెబుతున్నాడన్నారు. అడిగినందుకు టార్గెట్ చేసి షాపు వద్ద ఉన్న మంచినీటి నల్లాను మూసి వేయించటం జరిగిందన్నారు. తనకు నచ్చిన వారికి సపోర్ట్ చేస్తూనచ్చని వారిని ఇబ్బంది పెడుతున్నారని, ఎలాంటి అధికారం లేకున్నా సర్పంచ్‌గా చలామణి అవుతున్న రవిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

## దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దు

జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్



ప్రజాపక్షం/నిర్మల్: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు,భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను ఆయనకు సమర్పించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాకేష్,ఆర్‌డిఒ దేవీదాస్,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 100 ఫిర్యాదులు



ప్రజాపక్షం/నిజామాబాద్ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 100 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చినఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ భుజంగరావు, డిఆర్‌ఒ గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జడ్‌పి సిఇఒ సాయగౌడ్, డిఆర్‌డిఒ సాయన్న, డిపిఒ శ్రీనివాస్, ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి పేదలకు సంజీవని

నీలం మధు ముదిరాజ్



ప్రజాపక్షం/పటాన్‌చెరు : కష్టకాలంలో పేద ప్రజలకు సిఎం సహాయనిధి ఒకసంజీవనిలా మారిందని, పేదల ఆరోగ్యభద్రతకు ఈనిధి ఎంతో ధైర్యాన్ని ఇస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం చిట్కుల్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని కానుకుంటకి చెందిన కుమ్మరి రామదాసు, ఇస్నాపూర్ మున్సిపాలిటీకి చెందిన ఆడపా ఎల్లమ్మ్మకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నీలం మదు ముదిరాజ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు ఆసుపత్రుతల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిసుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అందాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాదపడుతున్న సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న భాదితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, రాఘవేంద్ర నారాయణదాసు, మణికంత, సర్పంచ్ సురేష్, మాజీ ఉప సర్పంచ్ శోభకృష్ణ రెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాస్ , వీరేష్, నర్సింహులు, రాము, వెంకటేష్, భిక్షపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న

ప్రజాపక్షం/మోర్తాడ్ : నేటి యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. పెద్దన్న అన్నారు. మోర్తాడ్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నశాముక్త్ అభియాన్‌లో భాగంగా ప్రిన్సిపాల్ పెద్దన్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ భవిష్యత్తుకు యువతనే పునాది యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వారు బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఉద్బోధించారు. యాంటీ డ్రగ్స్, ఎన్ఎస్ఎస్, ఐక్యూఎసి, సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్‌తో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు, సమాజం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ మర్రిపల్లి భూపతి, ఐక్యూసి కోఆర్డినేటర్ దశరథ్, యాంటి డ్రగ్స్ సెల్ రాజయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా మెదక్ అభివృద్ధికి కృషి

అన్ని వార్డుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



ప్రజాపక్షం / మెదక్ : రాజకీయాలకు అతీతంగా మెదక్ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని,అన్ని వార్డులలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి మరిన్ని నిధులతో మెదక్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే రోహిత్ రావు స్పష్టం చేశారు.మెదక్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజు అధ్యక్షతన, మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరయ్యారు.ఈ సమావేశంలో మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై కౌన్సిలర్లు విస్తృతంగా చర్చించి 33 అంశంపై తీర్మానం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ మెదక్ అభివృద్ధి కోసం అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా పని చేస్తున్నానని తెలిపారు. మెదక్ పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్య తీసుకుంటామని, భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని అన్నారు.ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో మెదక్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, రాబోయే రోజుల్లో కూడా అవసరమైన నిధులను సమీకరించి పట్టణంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సమావేశంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను వివరించారు. సమస్యలను పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గతంలో పలువురు ఎమ్మెల్యేలు మెదక్ అభివృద్ధికి కృషి చేసినప్పటికీ ప్ర స్తుత ఎమ్మెల్యే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో మెదక్‌ను మరింత అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులకు తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజాపక్షం/సంగారెడ్డి : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అదనపు కలెక్టర్లు సంగీత ,పాండు పాల్గొని ప్రజల నుంచి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్ సంబందిత శాఖల అధికారులకు దరఖాస్తులను పంపించి వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా ప్రతిఅర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 65 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్ కు 12, నారాయణఖేడ్ డివిజన్‌కు 5, జహీరాబాద్ డివిజన్‌కు 5, అందోల్ డివిజన్‌కు ఏలాంటి వినతులు అందలేదని కలెక్టరేట్‌కు 43 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ జానకిరెడ్డి, డిఆర్‌డిఒ, జ్యోతి సంగారెడ్డి, ఆర్‌డిఒ రాజేందర్, బిసి సంక్షేమాధికారి జగదీష్ , సాంఘిక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలి

సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : దోపిడీ లేని సమసమాజ స్థాపన కోసం షహీద్ భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య పిలుపునిచ్చారు.నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్ 119వ జయంతిని ఘనంగా నిర్వహించారు.తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం నంది రామయ్య మాట్లాడుతూ.. భగత్ సింగ్ గొప్ప మార్క్సిస్టు మేధావి అని కొనియాడారు. కార్పొరేట్ అనుకూల విధానాలు, పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆయన ఆశయ సాధనకు కార్మిక, కర్షక లోకం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె. రాజన్న, జిల్లా కమిటీ సభ్యులు రామ లక్ష్మణ్, బక్కన్న, కె. లక్ష్మి, ఎస్.గంగన్న, మహేందర్, ఎండి గఫూర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# సిఇసి జ్ఞానేష్‌కుమార్ బిజెపి తొత్తుగా మారి ఓటు చోరీ

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్: జ్ఞానేష్‌కుమార్ బిజెపి తొత్తుగా మారి ఓట్లు చోరీ చేస్తున్నారని, మోదీకి పెళ్లి అయి ఉంటే పెళ్లయిన మహిళల గూర్చి తెలిసేదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎఐసిసి పిలుపు టిపిసిసి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ కమిటీ, నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఓట్ల చోరీ వ్యవహారంలో సిఇసి జ్ఞానేష్ కుమార్ తీసుకున్న వ్యతిరేక నిర్ణయాలు నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి విచ్చేసి మాట్లాడారు. భారతీయులమని నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని, బిజెపి చేస్తున్న కుట్ర ఇది అన్నారు. ఎస్ఐఆర్ ద్వారా దేశంలో, రాష్ట్రంలో కోట్లాది కోట్లు గల్లంతయ్యాయన్నారు. తెలంగాణలో గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వచ్చిన వారందరి ఓట్లు తీసేయడం సరికాదన్నారు. బిజెపి వారికి అవసరమైన ఓట్లు ఉంచుకుని మిగతా వారి ఓట్లు తొలగిస్తున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, పెళ్లయిన మహిళల ఓట్లు సైతం అత్తగారింట్లో చిన్న తప్పిదాలతో తీసివేయటం ఏంటని ప్రశ్నించారు. ఎఐసిసి నాయకులు రాహుల్‌గాంధీ, టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు ప్రతి ఇంటింటికి తిరిగి ఇంటిలో అన్ని ఓట్లు వచ్చాయా లేదా తెలుసుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఈ నిరసనలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నగేష్‌రెడ్డి, రామకృష్ణ, ధర్మపురి సంజయ్, తాహెర్‌బిన్ హందాన్, ఈరవత్రి అనిల్, శేఖర్‌గౌడ్, అన్వేష్‌రెడ్డి, సునీల్‌కుమార్, రాంభూపాల్, రామకృష్ణ, ఉమారాణి, రమేష్‌రెడ్డి, జావిద్ అక్రమ్, గంగారెడ్డి, రత్నాకర్, సాయిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చిన్నబాల్‌రాజ్ పాల్గొన్నారు.

## బీడీ కార్మికులకు చేయూత పింఛన్ అందించాలి

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద టియుసిఐ ర్యాలీ



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, అర్హులైన బీడీ కార్మికులకు చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెన్షనర్స్ భవన్ నుండి జిల్లా కోర్టు మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. రాజన్న మాట్లాడుతూ... రాష్ట్రంలో అత్యల్ప వేతనాలతో జీవిస్తున్న బీడీ కార్మికుల పరిస్థితి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల వల్ల మరింత క్షీణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 2014 ఫిబ్రవరి 2వ తేదీ నాటికి ప్రావిడెంట్ ఫండ్ ఉన్నవారికే పింఛన్ అని పెట్టిన కటాఫ్ నిబంధన వల్ల అనేకమంది కార్మికులు నష్టపోయారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పింఛన్ దరఖాస్తుల మోడల్‌లో 7 కేటగిరీలకు మాత్రమే అవకాశమిచ్చి, బీడీ కార్మికులు, ప్యాకర్లు, నెలసరి ఉద్యోగులు, కమీషన్‌దారులకు ఆప్షన్ ఇవ్వకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పిఎఫ్ కటాఫ్ నిబంధనను ఎత్తివేసి, బీడీ పరిశ్రమపై ఆధారపడిన అన్ని కేటగిరీల కార్మికులకు పింఛన్ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టియుసియు జిల్లా అధ్యక్షుడు ఎం. బక్కన్న, టియుసిఐ జిల్లా కార్యదర్శి ఆర్.రామలక్ష్మణ్, సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి కె. లక్ష్మి ,కోశాధికారి ఎం.డి.గపూర్, నాయకులు గంగమణి, రేష్మ, దేవవ్వ, కమల, కవిత, తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ సిబ్బందికి ప్రొసీడింగ్ ఆర్డర్లు ఇవ్వాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ టీచర్లు, ఆయాలకు ప్రొసీడింగ్ ఆర్డర్లు ఇచ్చి, నాలుగు నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, ప్రీ ప్రైమరీ టీచర్లు, ఆయా యూనియన్ కన్వీనర్ టి. చక్రపాణిలు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించడానికి ప్రీ ప్రైమరీ వ్యవస్థను తీసుకురావడం జరిగిందని గత సంవత్సరం నుండి మెరిట్ ఆధారంగా వారిని తీసుకోవడం జరిగిందన్నారు. తెలంగాణలో నిజామాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా నియామకం చేసిన ఇన్‌స్ట్రక్టర్లు, టీచర్లు, ఆయాలకు ప్రొసీడింగ్ ఆర్డర్లు ఇవ్వడం జరిగిందన్నారు. కావున నిజామాబాద్‌లో పనిచేసే టీచర్లు ఆయాలకు వెంటనే ప్రొసిడింగ్ ఆర్డర్లు ఇచ్చి ప్రతినెల మొదటి వారంలో వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కోశాధికారి ఫిరోజ్ అలీ, సురేష్, గౌతమి, సవిత, లత, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.

## ముధోల్ మండల సాధారణ సర్వసభ్య సమావేశం

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ప్రజాపక్షం/ముధోల్ : శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ అధ్యక్షతన సోమవారం ముధోల్ మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి ఆయా శాఖల అధికారులు,గ్రామాల సర్పంచ్‌లు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా కొత్తగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు.సభలో భాగంగా ఒక్కొక్క శాఖ అధికారులు వారు గతంలో చేపట్టిన పనులు, రాబోయే కాలంలో చేపట్టబోయే పనులను గూర్చి వివరించారు. సమస్యలున్న ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధులు చరవాణి ద్వారా సంప్రదిస్తే గౌరవపూర్వకంగా మాట్లాడాలని ఎడ్ బిడ్ గ్రామ సర్పంచ్ సూచించారు. వ్యవసాయ శాఖ ఎఒ రచనను రైతుబీమాలు ఎన్ని అందాయి ఇంకా ఎన్ని పెండింగ్ లో ఉన్నాయని అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆమెపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పష్టమైన సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మణ్,ఎంపిడిఒ లవకుమార్, ఎంపిఒ శివకుమార్,ఆయా శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో జైపూర్ మండల పరిషత్ భవనం

రేకుల షెడ్డులోనే అధికారుల విధులు



ప్రజాపక్షం / జైపూర్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్రమైన జైపూర్ మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితికి వచ్చింది. సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిని ఎప్పుడు కూలిపోతుందో తెలియని ప్రమాదకర పరిస్థితుల్లో దర్శనమిస్తోంది. ప్రధాన భవనం శిథిలమవడంతో అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో కార్యాలయ ప్రాంగణంలోని చిన్న రేకుల షెడ్డులోనే తమ విధులను నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యాలయానికి తరలివస్తుంటారు. అయితే శిథిలావస్థలో ఉన్న భవనం, రేకుల షెడ్డులో విధులు నిర్వహిస్తున్న అధికారుల దీనస్థితిని చూసి స్థానికులు విస్మయం చెందుతున్నారు. అధికారులకే సరైన భవన వసతి లేకపోతే తమ సమస్యలు ఎలా తీరతాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో షెడ్డులోకి నీరు చేరుతూ పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి జైపూర్ మండల ప్రజా పరిషత్ కు నూతన భవన నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అవినీతికి కేరాఫ్ ఇందూరు బల్దియా!

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిజామాబాద్ కార్పొరేషన్ మారిందని, ప్రతి బడ్జెట్ మీటింగ్‌లో కోట్లు కేటాయిస్తారు కానీ పనుల కోసం రూపాయి ఖర్చు చేయడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్ ధర్నా చౌక్‌లో బల్దియాపై పోరు ఉద్యమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారితో బిజెపి పోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి కోసం ఒక ఎమ్మెల్యేగా ఉండి కూడా ధర్నా చేస్తున్నానంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. కార్పొరేషన్లు రూ.150 కోట్ల ఆదాయం, రూ.94 కోట్ల మిగులు బడ్జెట్ ఉన్నా ఒక్క రూపాయి ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నిజామాబాద్ అభివృద్ధి కొరకు రూ.200 కోట్లు మంజూరు చేస్తామని చెప్పి ఇప్పటివరకు విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వంలో ఉండి కూడా ఇక్కడి మేయర్ ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. నిజామాబాద్ ప్రజలకు నిధులు కాగితాలపై కనిపించడం అవసరం లేదు. ఆ నిధులతో వేసిన రోడ్డు కనిపించాలి, నిర్మించిన డ్రైనేజీలు కనిపించాలి, వెలిగే దీపాలు కనిపించాలన్నారు.

**కార్పొరేషన్ ముట్టడి.. ఉద్రిక్తత...**

బల్దియా సమస్యల పరిష్కారానికి, కమిషనర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ధర్నా చౌక్‌లో ధర్నా అనంతరం కార్పొరేషన్ కార్యాలయ ముట్టడికి బయల్దేరారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ఎమ్మెల్యే, బిజెపి కార్పొరేటర్ల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అడ్డుకోవడంతో ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ వచ్చే వరకు జరిగేది లేదని హెచ్చరించి బైఠాయించారు. అనంతరం కమిషనర్ దిలీప్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు 28 మంది, సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, ఆయా మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం / మెదక్ : ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో డి ఆర్వో అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా (91) అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారాలను వేగవంతం చేయాలని, పెండింగ్ లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కుంట భూముల ఆక్రమణపై ఫిర్యాదు



ప్రజాపక్షం / జన్నారం : మండలంలోని రేండ్లగూడ గ్రామంలో గల అల్లం వారి కుంట భూములు ఆక్రమణకు గురవుతున్నాయని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 160, 161లో ఉన్న 24 ఎకరాల కుంట భూమిని కొందరు కబ్జా చేశారని వారు పేర్కొన్నారు. ఈ భూములను కాపాడాలని కోరుతూ ఇప్పటికే ఆరు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో నేరుగా కలెక్టర్‌ను కలిసి అర్జీ సమర్పించారు. స్పందించిన కలెక్టర్ క్షేత్రస్థాయికి జాయింట్ కలెక్టర్‌ను పంపించి, సదరు భూములను సమగ్ర సర్వే చేసి నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తిరుపతి, సముద్రాల శంకర్, ఆకుల మధు, బాల్త సుధాకర్, అల్లం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండలంలోని కంటేగావ్ గ్రామానికి చెందిన ఆదే మనోజ్ కుమార్ కి మంజూరు అయిన రూ. 12వేల విలువ గల సిఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రూప్చంద్, మాజీ ఎంపిపి రాథోడ్ సజన్, సర్పంచ్ రవీందర్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి పండరీ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుజీల్, తదితరులు ఉన్నారు.



## ప్రజా వినతులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలు సమర్పించిన విన్నపాల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ఆయన పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో ప్రజావాణికి ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తుంటారని వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై కాల వ్యవధిలో సహేతుకమైన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మ్రీణాల్ శ్రేష్ట, ఐటిడిఏ కార్యాలయంలో డిడి చందన్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు విధులు నిర్వహించానలి సూచించారు. గిరిజన దర్బార్‌లో అందిన వినతులను పరిశీలించిన చందన ఆయా శాఖల అధికారులకు అందజేశారు. ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రాధాన్యత క్రమంలో అర్హులందరికీ అందిస్తామని తెలిపారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.




## హక్కుల సాధన కోసం పోరాడండి

ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు మహ్మద్ సలాం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ముస్లిం మైనార్టీలు హక్కుల సాధన కోసం అణిచివేతకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని తన్జీమ్ ఎ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం కోరారు. స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం ఎస్‌కె సైదా అధ్యక్షతన జరిగిన ఇన్సాఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలను ఓటు బ్యాంకు రాజకీయాలుగా చూస్తున్నాయి తప్ప సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. మైనార్టీ రిజర్వేషన్లను, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజా ప్రయోజనాల ద్వారా ఓట్లు పొందాల్సిన పాలకులు ఓటు చోరీ ద్వారా అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారన్నారు. సమావేశ అనంతరం ఇన్సాఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ఎన్నికల సంఘం వైఖరిని నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. జ్ఞానేష్‌కుమార్ తక్షణం రాజీనామా చేయాలని, మోడీ, అమిత్‌షాలను వెంటనే అరెస్టు చేసి విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. జ్ఞానేష్‌కుమార్ హయాంలో జరిగిన ఎన్నికలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని, ఎన్నికలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట యాకూబ్, ఎండి మజీద్, ఎండి రెహ్మాన్, ముజామిల్ ముజ్జు, అమీర్, సైదా బేగం, నజీయా, ఎస్‌కె బేగం, కరీం, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



## దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఏస్, అదనపు కలెక్టర్లు పి.శ్రీనివాసరెడ్డి, పి.శ్రీజలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సింగరేణి మండలం పేరుపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు బి.రమేష్ గ్రామంలో ఆరులక్షల అక్రమ బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతులు తమ గ్రామంలో అధికంగా పెసర పంట సాగు చేశామని మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసర కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేశారు. కల్లూరు మండలం పేరువంచ గ్రామానికి చెందిన సత్యం సర్వే నెం.92/1/2లో ఎకరం పట్టా భూమి ఆక్రమణకు గురైందని దీనిపై విచారణ చేసి తన భూమిని తనకు అప్పగించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కూసుమంచి మండలం తురకగూడెం గ్రామానికి చెందిన కొమ్ము భాగ్యలక్ష్మి తనకు పైలేరియా పెన్షన్ 2022లో మంజూరైందని ఈ మధ్య పెన్షన్ నిలిపివేశారని తన పింఛన్‌ను పునరుద్దరించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ కలల భారతం కోసం యువత పోరాడాలి

ఓటు హక్కు పరిరక్షణే నేటి యువత బాధ్యత : ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భగత్‌సింగ్ ఆశయాల స్ఫూర్తితో సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయంతో కూడిన సమాజ నిర్మాణానికి నేటి యువత, విద్యార్థులు కృషి చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. ఫహీమ్ దాదా పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫహీమ్ దాదా మాట్లాడుతూ భగత్‌సింగ్ కోరుకున్న స్వాతంత్ర్యం కేవలం బ్రిటిష్ పాలన నుంచి అధికార బదిలీ కాదని, దోపిడీ, అసమానతలకు ముగింపు పలికి ప్రజాస్వామ్య, సామాజిక న్యాయంతో కూడిన సమాజాన్ని నిర్మించడమేనని అన్నారు. నేడు ప్రజాస్వామ్య హక్కుల్లో ఓటుహక్కు అత్యంత కీలకమని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఒక్క అర్హుడి ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకుండా పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖయ్యుమ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్, ఉపాధ్యాకులు భూపేష్, జావీద్, కొయ్యడ రవి, బాబా, రామకృష్ణ, శివ, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో కాంగ్రెస్ మహాధర్నా

జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే

కాంగ్రెస్ నేతల డిమాండ్ - దిష్టిబొమ్మ దగ్ధం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఓటు చోరీ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ సోమవారం కలెక్టరేట్ వద్ద మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్బంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా, సమగ్ర సవరణ పేరుతో అర్హులైన అనేకమంది ఓట్లను తొలగిస్తున్నారని, దీనిపై పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణ పట్ల ఎన్నికల కమిషన్‌పై ప్రజలు విశ్వాసం కోల్పోయారన్నారు.

రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేసేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు. అమిత్‌షా, మోదీ మద్దతుతో జ్ఞానేష్ కుమార్ ఎన్నికల ఫలితాలను తారుమారు చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఓటర్ల సమగ్ర సవరణలో లోపాలు తదితర విషయాలపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ శాసనమండలి సభ్యుడు పోట్ల నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యుడు కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, బేబి స్వర్ణకుమారి, కట్ల రంగారావు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, మొక్కా శేఖర్ గౌడ్ తో పాటు నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, వెంకటేశ్వరరావు, సీతారాములు, పలువురు మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## చుంచుపల్లి హైస్కూల్, ఆరోగ్య కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

క్లాస్‌లో ఉపాధ్యాయుడు లేకపోవడంపై ఆగ్రహం

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక రోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యా ప్రమాణాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, ల్యాబోరేటరీ సేవలను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించి, రికార్డుల్లో నమోదైన వివరాల ప్రకారం ఉపాధ్యాయులు తరగతి గదుల్లో అందుబాటులో ఉన్నారా లేదా స్వయంగా పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. పదో తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంపై ఆరా తీసిన కలెక్టర్ సరైన సమాధానం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికి షోకాజ్ నోటీస జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం, గత ఫలితాలు, ప్రస్తుత విద్యా ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలన పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ రోజువారీ ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ సుమారు 50 నుంచి 60 మంది వరకు ఓపీకి వస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలోని ఇన్‌పేషెంట్ విభాగాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మందుల స్టోర్‌ను పరిశీలించారు.

ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో తహశీల్దార్ నాగరాజు, ఎంఈఓ నీరజ, పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, నర్సులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వేడుకలు

భగత్ సింగ్ జీవిత చరిత్ర ను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

ఏఐవైఎఫ్ రాష్ట సమితి సభ్యుడు ఎస్‌కె.చాంద్ పాషా

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** ఎఐవైఎఫ్ జూలూరుపాడు మండల సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట సమితి సభ్యులు ఎస్కె చాంద్ పాషా మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం భారతదేశ యువతకు స్ఫూర్తిదాయకమని అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలియజేసే బాధ్యత పాలకులదని భగత్ సింగ్ జయంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాల నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ దేశాన్ని దోచుకుంటున్నారని భారతదేశ స్వతంత్రం కోసం చేసిన పోరాటం ఆలోచనలు భగత్ సింగ్ చూపిన కార్యచరణ నేటి స్ఫూర్తికి ప్రతిరూపం గా విద్యార్థులు యువత ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చలగొండ్ల సతీష్, సురేష్ గోపి మోహన్ షేక్ యాకూబ్ పాషా, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టాస్ ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు

జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో అక్టోబర్ 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ దివాకర టిఏస్, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సంబంధిత అధికారులతో పరీక్ష నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ టాస్ పదవ తరగతి, ఇంటర్ పరీక్షల కోసం రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్ఎస్‌సి పరీక్షలకు గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, ఇంటర్మీడియట్ పరీక్షలకు జిహెచ్ఎస్ రిక్కాబజార్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 537 మంది ఎస్ఎస్‌సి, 411 మంది ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జవాబు పత్రాలను స్పీడ్ పోస్టు ద్వారా నిబంధనల మేరకు తరలించాలన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలను యువతలో విస్తృతంగా ప్రచారం చేయాలి

ఎఐవైఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి సాధనపల్లి సతీష్

**ప్రజాపక్షం/భద్రాచలం :** విప్లవ వీరుడు భగత్‌సింగ్ ఆశయాలను యువతలో విస్తృతంగా ప్రచారం చేయాలని ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంయుక్త కార్యదర్శి సాధనపల్లి సతీష్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా భద్రాచలం సిపిఐ కార్యాలయంలో సిపిఐ సీనియర్ నాయకులు మారెడ్డి శివాజీ, నాయుడు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరదాడి, సమసమాజ స్థాపనను లక్ష్యంగా చేసుకున్న భగత్‌సింగ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. సిపిఐ పట్టణ నాయకులు శోభన్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కొక్కిరేణి అశోక్‌కుమార్, పట్టణ నాయకులు కొండా కౌశిక్, పసుపులేటి సాయి, ఎస్‌కే. కాసిం తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో సమస్యల తీరు మారింది...?

జెన్ జీ ఆందోళనల నుంచి ప్రజా ఉద్యమం

ఐక్యత, ఐక్యకార్యాచరణ దిశగా అడుగులు

కమ్యూనిస్టు సిద్ధాంతమే బలమైనది

నక్సలిజం అంతం కాలేదు

మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జాతీయ నేత ప్రసాద్




**ప్రజాపక్షం/ఖమ్మం :** భారతదేశంలో సమస్యల తీరు మారిందని ఒకప్పుడు ఆకలి ప్రధాన సమస్యగా ఉండేదని ఇప్పుడు పలు రకాల సమస్యలు భారతీయ సమాజాన్ని ఇబ్బందికర పరిస్థితులకు నెట్టివేస్తున్నాయని ఐఎఫ్‌టియు జాతీయ నాయకులు పి.ప్రసాద్ తెలిపారు. దేశంలో ఫాసిస్టు పాలన సాగుతుందని దీని అంతం కోసం బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించబడాలని ప్రజలను సంసిద్ధులను చేయాలని ఆయన తెలిపారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు మోటివేటర్‌గా వ్యవహరించగా, సభా అధ్యక్షుడుగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నామ పురుషోత్తం వ్యవహరించగా, ముఖ్య అతిథిగా టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కె.రాంనారాయణ హాజరయ్యారు. భారతదేశంలో ప్రస్తుతం నెలకొన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులను వివరించడంతో పాటు జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు ప్రసాద్ సమాధానం ఇచ్చారు. ఉత్పత్తి కారకులైనటువంటి రైతులు, కార్మికులు ఆందోళన బాట పట్టారని రైతులు ఒక చారిత్రాత్మక ఉద్యమం చేశారని ఇప్పుడు ప్రజా స్వామిక శక్తులు సైతం సమీప భవిష్యత్తులో ఆందోళనకు సిద్ధం కావాలన్నారు. గత కొంత కాలంగా నేటి తరం తరగతి గదులకో, కార్యాలయాకో పరిమితం అవుతుందని ప్రచారం జరిగిందని సామాజిక స్పృహ లేని తరంగా ముద్ర పడుతున్న సమయంలో జన్ జీ ఉద్యమం ఇవాళ ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుందన్నారు. ఇది వర్తమాన రాజకీయాలలో గొప్ప మలుపు అని కేవలం నీట్ ప్రశ్నాపత్రం లీక్ ద్వారానే జన్‌జీ ఉద్యమం రాలేదని, దీనికి ఒక సామాజిక కోణం కూడా ఉందని ప్రసాద్ తెలిపారు. పెరిగిన నిరుద్యోగం, గాడితప్పిన ఆర్థిక పరిస్థితులు, కార్పొరేటీకరణ జన్ జీపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. జన్ జీ ఉద్యమాన్ని స్వాగతిస్తున్నామని, వామపక్షాలు సమన్వయం చేసుకుని ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఇది ఒక కీలక మలుపు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల కమిషనర్ విషయంలోనూ 48 గంటల తర్వాత ఆందోళనకు పూనుకుంటామని జన్ జీ ప్రకటించిందని ఇది ఆందోళన నుంచి ప్రజా ఉద్యమంగా మారాలని ప్రసాద్ ఆకాంక్షించారు. వామపక్ష సిద్ధాంతం బలమైనదని, దానికి మరో ప్రత్యామ్నాయం లేదన్నారు. బతుకు నేర్పిన ఉద్యమం వామపక్ష ఉద్యమం అని ఆయన తెలిపారు. ఉద్యమ చీలికలపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ ఏ చీలిక అయినా ఉద్యమాన్ని బలహీన పరుస్తుందని సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ భావస్వరూప కలిగిన పార్టీలను ఐక్యం చేసే పనిలో ఉందని ఇది సాధ్యం కాని పక్షంలో ఐక్య కార్యాచరణ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. భారతదేశంలో ఉత్పత్తి పెరిగి వినియోగం తగ్గుతుందని ఇది అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు.అమెరికా లాంటి దేశాలు తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని దేశంపై ఒత్తిడి తేస్తున్నాయని రానున్న కాలంలో ఈ దిగుమతులు వ్యవసాయ రంగంతో పాటు అన్ని రంగాల పైన తీవ్ర ప్రభావం చూపనున్నాయన్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ రంగంలో కార్పొరేట్లు ప్రవేశించిన ఇంకా కార్పొరేటీకరణ జరగలేదని భవిష్యత్తులో ఈ ప్రమాదం పొంచి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ఆర్థిక, ఎదుగుదల సుద్ధ అబద్ధమని ఇది కేవలం అంకెల గారడీ తప్ప మరొకటి కాదన్నారు. సంపద కలిగిన వారు మరింత సంపన్నులు అవుతుంటే పేదలు మరింత పేదలు అవుతున్నారని దీని సరాసరి లెక్కలే ఇప్పుడు ఆర్థిక ఎదుగుదలగా ప్రసాద్ అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్నట్లుగా మావోయిస్టు పార్టీ అంతం కాలేదని దానికి భవిష్యత్తు ఉందన్నారు. ప్రజలను భౌతికంగా పోరాటాలకు సిద్ధం చేయకుండా చేపట్టే ఏ పోరాటం విజయం సాధించదన్నారు. పాలకులు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంసిద్ధులను చేసేందుకు వామపక్షాలు కృషి చేస్తున్నాయని ఆయన తెలిపారు. గతంలో పెట్టుబడిదారుల మధ్య పోటీ లేదని టాటా బిర్లా లాంటి వారు వస్తు ఉత్పత్తిలో ఉంటే అంబానీ, అదానీ లాంటి వారు అఉత్పాదక రంగాలలో ఉండి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారన్నారు. పెట్టుబడిదారి వర్గాల మధ్య పోటీ నెలకొందని ఆయన తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం నుంచి ఉన్న ఆలోచనలకు గత కొన్ని నెలలుగా దేశ యువతంలో వచ్చిన ఆలోచనలకు మధ్య స్పష్టమైన తేడా ఉందని ఉదాసీన వైఖరి నుంచి ప్రశ్నించే తత్వం వైపు యువత అడుగులు వేస్తుందని దీనిని అన్ని పార్టీలు, సామాజిక శక్తులు స్వాగతించాలన్నారు.

# భగత్‌సింగ్‌కు 'భారతరత్న' ప్రకటించాలి

ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో

భగత్‌సింగ్‌కు నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారత విప్లవ యువ కిషోరం భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్ కోరారు. భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత పోరాడాలని పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 119వ జయంతి సందర్బంగా రఘునాథపాలెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతల రమేష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత పోరాడాలన్నారు. భగత్‌సింగ్ కలలు కన్న దోపిడీ రహిత, సమానత్వ సమాజ నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని, విద్యా, వైద్య రంగాలను వ్యాపారంగా కాకుండా ప్రజలకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలన్నారు. మత విద్వేషాలు, విభజన రాజకీయాలు దేశ ఐక్యతకు ప్రమాదకరమని తెలిపారు. నేటి యువత భగత్‌సింగ్ చూపిన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల అధ్యక్షులు గుండ్ల అశోక్, నాయకులు ఆర్. బాలకృష్ణ, షేక్ మహ్మద్, కె.కళ్యాణ్, ఎం. భగత్‌సింగ్, ఎం. కృష్ణ, జగన్, మోహిత్‌కుమార్, మజీద్ అలీఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మనో ధైర్యంతో ముందుకు సాగాలి

సిపిఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** అనుకోని ప్రమాదాలు జరిగి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినప్పుడు మనోధైర్యంతో ముందుకు సాగాలని మాజీ శాసన సభ్యుడు, సిపిఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు ఉద్బోధించారు. అనుకోని ప్రమాదాలు ప్రజల జీవన గతిని మార్చివేస్తాయని, అటువంటి సమయంలో గుండె నిబ్బరంతో భవిష్యత్తుపై ఆశతో మార్గాలనే అన్వేషించాలన్నారు. రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన ఆటో కార్మికుడు మహేష్‌కు సోమవారం కృత్రిమ కాలును పువ్వాడ ఫౌండేషన్ తరుపున పువ్వాడ నాగేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పులతో కృత్రిమ కాళ్లు సైతం సరిగ్గానే పనిచేస్తున్నాయని ఆయన అన్నారు. దివ్యాంగులకు చేయూతనందించేందుకు పువ్వాడ ఫౌండేషన్ కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మమత ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ పువ్వాడ నరేన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రతాపనేని ఉపేందర్, ఆముదాల వెంకన్న, చార్లెస్, యూసఫ్, వీరబాబు, వెంకటరమణ, సత్యనారాయణ, అక్రమ్ పాల్గొన్నారు.

# ప్రజల గొంతు అణచివేయలేరు

- మిడ్నాపూర్‌లో నిరసనపై ఆర్‌ఎస్‌ఎస్ దాడిని తీవ్రంగా ఖండించిన సిపిఐ

**న్యూఢిల్లీ:** ఆర్‌ఎస్‌ఎస్ హింస ప్రజల గొంతును అణచివేయలేదని, సిపిఐ, వామపక్షాలు బెదిరింపులకు లొంగవని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తుతూనే ఉంటాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు, పశ్చిమ బెంగాల్‌లోని సువేందు అధికారి ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా షహీద్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా మిడ్నాపూర్‌లో నిర్వహించిన సిపిఐ భారీ నిరసనపై ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు జరిపిన దాడిని సోమవారం ఒక ప్రకటనలో సిపిఐ తీవ్రంగా ఖండించింది. నిరసన ప్రదర్శనకు అనుమతి నిరాకరించి, ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి యంత్రాంగం శాయశక్తులా ప్రయత్నించిందని విమర్శించింది. నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరిగినప్పటికీ బిజెపి ప్రభుత్వ హయాంలో పెరుగుతున్న గూండాయిజం, రాజకీయ హింస, మతతత్వం, ప్రజల ప్రజాస్వామ్య హక్కులు హరించడాన్ని నిరసిస్తూ దఢ నిశ్చయంతో ఉన్న సిపిఐ కార్యకర్తలు, సాధారణ ప్రజలు మిడ్నాపూర్ కలెక్టరేట్ ముందు పెద్దసంఖ్యలో గుమిగూడారు. పెరుగుతున్న ప్రజాగ్రహాన్ని నివారించడానికి, అదుపు చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో సిపిఐ కార్యదర్శి రామకష్ణ పాండా సభను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు సమావేశాన్ని భగ్నం చేయడానికి కుట్ర చేశారు. ఆ తర్వాత సిపిఐ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి స్వపన్ బెనర్జీ మాట్లాడటం ప్రారంభించినప్పుడు ఆయనపై భౌతికంగా దాడి చేయడానికి ప్రయత్నించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు విప్లవ్ భట్ట, గౌతమ్ రే, తపన్ గంగూలీతో పాటు సిపిఐ ఇతర పశ్చిమ బెంగాల్, మిడ్నాపూర్ నాయకులు కూడా అక్కడ ఉన్నారు. అప్రమత్తంగా ఉన్న సిపిఐ కార్యకర్తలు ఆర్‌ఎస్‌ఎస్ గూండాలను ఎదుర్కొని తరిమివేశారు. ఈ ఘటన మొత్తం పోలీసుల సమక్షంలోనే జరగడం దీనిని మరింత హేయమైన చర్యగా మారుస్తోందని పార్టీ పేర్కొంది. ఈ దుస్సాహసమైన, అత్యంత అప్రజాస్వామిక దాడిని సిపిఐ తీవ్రంగా ఖండిస్తుంది. బాధ్యులపై తక్షణ చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తుంది. శాంతియుత రాజకీయ నిరసనలపై దాడులకు యంత్రాంగం సహకరించడానికి గానీ, వగ ప్రేక్షకునిగా ఉండటానికి గానీ అనుమతించరాదు. సిపిఐ నాయకులను భౌతికంగా లక్ష్యంగా చేసుకునేందుకు ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు చేసిన ప్రయత్నం, పశ్చిమ బెంగాల్‌లో అసమ్మతిని అణచివేయడానికి రాజకీయ బెదిరింపులు, హింసను ఏ స్థాయిలో ఉపయోగిస్తున్నారో స్పష్టం చేస్తుంది. బిజెపి సువేందు అధికారి ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి, దాని విధానాలను వ్యతిరేకించడానికి, జవాబుదారీతనం కోరడానికి ప్రజలకు పూర్తి హక్కు ఉంది. పరిపాలనాపరమైన అడ్డంకులు గానీ, ఆర్‌ఎస్‌ఎస్ హింస గానీ ప్రజల గొంతును అణచివేయలేవు. సిపిఐ, వామపక్షాలు బెదిరింపులకు లొంగవు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తుతూ పశ్చిమ బెంగాల్ ప్రజల ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతూనే ఉంటాయి' అని ఆ ప్రకటన స్పష్టంచేసింది.

# పాట్నాలో సిపిఐ లోక్‌భవన్ ముట్టడి

- అడ్డుకున్న పోలీసులు, సిపిఐ శ్రేణులు.. పోలీసులకు మధ్య ఘర్షణ
- నిరసనకారులను చెదరగొట్టేందుకు వాటర్ కెనాన్ల ప్రయోగం



**పాట్నా :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (ఇసిసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) రద్దుతో సహా పలు డిమాండ్లతో సిపిఐ సోమవారం బిహార్ రాజధాని పాట్నాలో లోక్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టింది. కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సిపిఐ శ్రేణులు, మద్దతుదారులు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ర్యాలీని అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఆందోళనకారులు తొలగించి ముందుకు వెళ్లడంతో, రాష్ట్ర రాజధానిలోని 'డాక్ బంగ్లా క్రాసింగ్' వద్ద గుమిగూడిన జనాలను చెదరగొట్టడానికి పోలీసులు వాటర్ కెనాన్లను ప్రయోగించారు. నిరసనకారుల మధ్య కొందరు అసాంఘిక శక్తులు ఉన్నాయని, వారు రాళ్లు రువ్వడం వల్ల కొందరికి గాయాలయ్యాయని పోలీసులు వాదిస్తున్నారు. అనేకమంది నిరసనకారులను పోలీసులు తమ వాహనాల్లో అక్కడి నుంచి తరలించారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐతో పాటు ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌ఎఫ్), ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఎఐవైఎఫ్), బిహార్ మహిళా సమాజ్, బిహార్ రాష్ట్ర కిసాన్ సభ, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), తంజీమ్–ఎ–ఇన్సాఫ్ సభ్యులు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. నిరసనకారులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గవర్నర్‌కు సమర్పించినట్లు సిపిఐ ఒక ప్రకటనలో తెలిపింది. జ్ఞానేష్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) రద్దు, వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి వెళ్లేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారని అధికారులు తెలిపారు. అలాగే, 200 రోజుల పని హామీ, కనీస వేతనాలతో ఎజి నరేగాను పునరుద్ధరించాలని, వ్యవసాయ కూలీల కోసం సమగ్ర కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని, 'షహీద్–ఎ–ఆజం భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం'ను ఆమోదించాలని, నాలుగు కార్మిక చట్టాల (లేబర్ కోడ్స్)ను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా, 'సి2+50 శాతం' సూత్రం ఆధారంగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) వద్ద పంటల సేకరణకు చట్టపరమైన హామీ కల్పించాలని, అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ద్వారా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని మరియు భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆ వినతిపత్రంలో వారు కోరారు. ఇదే సమయంలో, బిహార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ విద్యార్థులు కూడా విద్యాపరమైన సెషన్లు ఆలస్యం కావడం, సంస్థ నిర్వహణలో ఆర్థిక అవకతవకలపై నిరసన తెలిపారు. స్వతంత్ర ఎంపి పప్పు యాదవ్ విద్యార్థుల నిరసనలో పాల్గొన్నారు.

ఫారం-VII

(చట్టం 30/2013 లోని సెక్షన్ 19(1) మరియు నిబంధన 25 (1) అనుసరించి)

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖా
జిల్లా కలెక్టర్ గారి కార్యాలయం, కామారెడ్డి

డిక్లరేషన్

రెవిన్యూ డివిజనల్ అధికారి, బాన్సువాడ ఫైల్ సంఖ్య.ఎ/2315/2022 తేది: 18/09/2026
జిల్లా కలెక్టర్, కామారెడ్డి ఫైల్ సంఖ్య. జి1/5850/2022 తేది: 22/09/2026
గెజిట్ నెం. 179 తేది: 23/09/2026

కామారెడ్డి జిల్లా పిట్లం మండలములోని నాగంపల్లి గ్రామములో గల భూమి విస్తీర్ణము ఎ. 3.3575 **గుంటలు** ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువున మంజీరా నదిపై నిర్మించ తలపెట్టిన మంజీరా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిర్మాణంలో భాగంగా స్టేజ్-1 ప్రెజర్ మెయిన్ పైప్ లైన్ (Stage-1 Pressure Main Pipe Line) ను Ch. 5.100 Km నుండి Ch.6.300 Km వరకు వేయుట కొరకు అవసరము అయి ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, కామారెడ్డి భావించనైనది. అందువలన, పైన పేర్కొన్న ప్రాజెక్టు నిమిత్తం కామారెడ్డి జిల్లాలోని పిట్లం మండలములోని నాగంపల్లి గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణము ఎ. **3.3575 గుంటల** భూమికి కొంచెం ఎక్కువగా కాని, తక్కువగా కాని ప్రామాణిక కొలతల ప్రకారం) ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం డిక్లరేషన్ జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రామము : నాగంపల్లి | మండలం : పిట్లం | జిల్లా : కామారెడ్డి

| క్ర. సం. | సర్వే నం. | [illegible] | [illegible] | [illegible] | పట్టాదారు పేరు | సరిహద్దులు తూ | ప | ఉ | ద | చెట్లు సంఖ్య | రకము | నిర్మాణములు విస్తీర్ణం | రకము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | | 7 | 8 | 9 | 10 | 11 12 | 13 | 14 |
| 1 | 13అ | పట్టా | తరి | 0.0025 | మ్యాకల పోచయ్య తండ్రి లచ్మయ్య | 12 | 21 | 14 | 174 | - | - | - | - |
| 2 | 14అ | పట్టా | తరి | 0.0800 | మ్యాకల పోచయ్య తండ్రి చయ్య | 15 | 21 | 17 | 13 | 10 | 7-మోదుగ, 2-నెమలి నార, 1-జువ్వి | - | - |
| 3 | 16/1అ | పట్టా | తరి | 0.0100 | సునుగురి సాయిలు తండ్రి రాములు | 85 | 14 | 85 | 15 | - | - | - | - |
| 4 | 17/4 | | | 0.0100 | షేక్ శాదుల్ల తండ్రి మొగులన్ | 85 | 19 | 85 | 14 | - | - | - | - |
| 5 | 17అ | పట్టా | తరి | 0.0100 | శామిన బీ భర్త మొహమ్మద్ సాబ్ | 85 | 19 | 85 | 14 | - | - | - | - |
| 6 | 17/2 | | | 0.0100 | షేక్ అహ్మద్ సాబ్ తండ్రి మీరా సాబ్ | 85 | 19 | 85 | 14 | - | మోదుగ | - | - |
| 7 | 21/1అ | | | 0.0400 | మ్యాకల హన్మండ్లు తండ్రి రామయ్య | 13 | 22 | 20 | 173 | 1 | 1-జువ్వి | - | - |
| 8 | 21/3అ | పట్టా | తరి | 0.0375 | మేకల కాశిరామ్ తండ్రి విట్టల్ | 13 | 22 | 20 | 173 | 1 | మోదుగ | - | - |
| 9 | 21/అA | | | 0.0025 | మ్యాకల క్రిష్ణ తండ్రి అంజయ్య | 13 | 22 | 20 | 173 | - | - | - | - |
| 10 | 22/2 | పట్టా | తరి | 0.0100 | బోయిని కాశిరామ్ తండ్రి బాలయ్య | 21 | - | - | 23 | - | - | - | - |
| 11 | 22/1ఆ | | | 0.0100 | బోయిని విట్టల్ తండ్రి లింగయ్య | 22 | - | - | 24 | - | - | - | - |
| 12 | 25/1 | పట్టా | మెట్ట/ ఖుష్కీ | 0.2600 | మెగావత్ బాషు తండ్రి హరిచంద్ | 27 | 170 | 26 | 171 | 25 | 8-వేప, 5-మోదుగ, 3-నెమలి నార, 3-టేకు, 1-పాకోదిష్ & 5-ఈత | 15 మీ. | పైప్ లైన్ |
| 13 | 27/4/1 | లావుని | మెట్ట/ | 0.0400 | వడ్ల హన్మండ్లు తండ్రి మాణిక్యం | 22 | 25 | - | - | 7 | 1-ఈత, 6-మోదుగ | - | - |
| 14 | 27/4/2 | పట్టా | ఖుష్కీ | 0.0400 | వడ్ల పరమేశ్వర్ తండ్రి మాణిక్యం | 22 | 25 | - | - | - | - | - | - |
| 15 | 27/4/2 | | | 0.1600 | మెగావత్ దశరథ్ తండ్రి బశ్య | 22 | 25 | - | - | 14 | 30-మోదుగ, 8-వేప & 1-రావి | - | - |
| 16 | 52 | ప్రభుత్వ | మెట్ట/ | 0.1100 | రోడ్ | 108 | 53 | 51 | 130 | - | - | - | - |
| 17 | | పట్టా | ఖుష్కీ | 0.1900 | ప్రభుత్వ భూమి | 108 | 53 | 51 | 130 | - | - | - | - |
| 18 | 53/5 | | | 0.0200 | బోయిన పోచయ్య తండ్రి బీమయ్య | 52 | 57 | 50 | 58 | - | - | - | - |
| 19 | 53/2 | పట్టా | తరి | 0.0100 | బోయిని రాములు తండ్రి శివయ్య | 52 | 57 | 50 | 58 | 6 | 1-వేప, 1-ఈప్ప చెట్టు, 1-జువ్వి & 3-మోదుగ | 25 మీ. | పైప్ లైన్ |
| 20 | 53/4/1 | | | 0.0100 | బోయిని విట్టల్ తండ్రి బాలయ్య | 52 | 57 | 50 | 58 | - | - | - | - |
| 21 | 56/2/1 | పట్టా | తరి | 0.0050 | మ్యాకల క్రిష్ణ తండ్రి అంజయ్య | 57 | 73 | 55 | 65 | - | - | - | - |
| 22 | 56/2 | | | 0.0150 | మామిల్ల సత్యవ్వ భర్త రామయ్య | 57 | 73 | 55 | 65 | - | - | - | - |
| 23 | 57/3 | పట్టా | తరి | 0.0600 | మ్యాకల క్రిష్ణ తండ్రి అంజయ్య | 53 | 56 | 55 | 58 | - | - | 30 మీ. | పైప్ లైన్ |
| 24 | 57/2 | | | 0.0500 | మ్యాకల క్రిష్ణ తండ్రి అంజయ్య | 53 | 56 | 55 | 58 | - | - | - | - |
| 25 | 64/2 | పట్టా | తరి | 0.0050 | షేక్ ఇస్మాయిల్ తండ్రి మీరాసాబ్ | 63 | 65 | 57 | 90 | 4 | మోదుగ | - | - |
| 26 | 65/ఇ/3 | పట్టా | తరి | 0.0300 | మామిల్ల రమేష్ తండ్రి లక్ష్మ య్య | 64 | 67 | 66 | 90 | 1 | మోదుగ | - | - |
| 27 | 65A | | | 0.0200 | షేక్ ఇస్మాయిల్ తండ్రి మీ సాబ్ | 64 | 67 | 66 | 90 | - | - | - | - |
| 28 | 66 | పట్టా | తరి | 0.0200 | సలీం బీ భర్త మొహమ్మద్ షఫీ | 65 | 72 | 56 | 65 | 2 | మోదుగ | - | - |
| 29 | 67అA | పట్టా | తరి | 0.0400 | మ్యాకల క్రిష్ణ తండ్రి అంజయ్య | 65 | 88 | 72 | 90 | 9 | 6-మోదుగ, 2-ఉద్ద & 1-ఈత | 40 మీ. | పైప్ లైన్ |
| 30 | 85/అ | పట్టా | తరి | 0.0400 | మామిల్ల అంజవ్వ భర్త వెంకయ్య | 87 | 19 | 84 | 16 | - | - | - | - |
| 31 | 85/5అ | | | 0.0200 | రజియా బేగం భర్త షేక్ శాదుల్ల | 87 | 19 | 84 | 16 | - | - | - | - |
| 32 | 87 | పట్టా | తరి | 0.0350 | కల క్రిష్ణ తండ్రి అంజయ్య | 88 | 85 | 86 | 89 | - | - | - | - |
| 33 | 87/అ | | | 0.0750 | బోయిని గంగవ్వ భర్త శివరాం | 88 | 85 | 86 | 89 | - | - | - | - |
| 34 | 88/2/1 | | | 0.0350 | బోయిని మచెందర్ తండ్రి శివరాం | 67 | 87 | 68 | 89 | 2 | 1-రావి, 1-మోదుగ | - | - |
| 35 | 88/2/2 | పట్టా | తరి | 0.0050 | మంచి స్వప్న బాల భర్త శశిధర్ | 67 | 87 | 68 | 89 | - | - | - | - |
| 35 | 88/1 | | | 0.0400 | మ్యాకలరాంబాయి భర్త దశరథ్ | 67 | 87 | 68 | 89 | 2 | | - | - |
| | మొత్తం : | | | 3.3575 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసం మరియు పునరుపాధికల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారం పొందే హక్కు చట్టం, 2013 (చట్ట సంఖ్య 30/2013) యొక్క సెక్షన్ 15 క్రింద కల్పించిన విధంగా, ఆసక్తి గల వ్యక్తుల అభ్యంతరాలను విని, తగిన విధంగా విచారణ జరిపిన అనంతరం ఈ ప్రకటన (డిక్లరేషన్) చేయబడినది. ఈ భూసేకరణ కారణంగా పునరావాసం పొందవలసిన కుటుంబాలు ఏవీ లేవు అని తెలియజేయనైనది.

భూసేకరణకు గురైన భూభాగం క్రింద గల బొగ్గు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజాలు లభ్యమైనచో అ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణానికి ఉపయోగితం వున్న పక్షంలో వాటిని స్వీకరించబడును, లేనిచో స్వీకరించబడవు.

భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాను మరియు వివరములు ఏదేని పని దినములలో భూసేకరణ అధికారి & రెవిన్యూ డివిజనల్ అధికారి, బాన్సువాడ గారి కార్యాలయంలో పరిశీలించవచ్చును..

సం/- భూ సేకరణ అధికారి & రెవిన్యూ డివిజనల్ అధికారి, బాన్సువాడ.
సం/- అదనపు కలెక్టర్ (రెవిన్యూ), కామారెడ్డి.
సం/- జిల్లా కలెక్టర్, కామారెడ్డి.

DIPR RO NO. 920/LA/PP/Advt/Pub/2026-27

### రూ. 2,000 పైబడిన యుపిఐ చెల్లింపులపై

# ఎండిఆర్ అమలు నిలిపివేతకు 'సుప్రీం' నిరాకరణ

- కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ
- ఆర్‌బిఐ, ఎన్‌పిసిఐ నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం




**న్యూఢిల్లీ :** యుపిఐ చెల్లింపులపై కొత్త ఛార్జీల వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. రూ.2,000 కంటే ఎక్కువ యుపిఐ మర్చంట్ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) విధించాలన్న కేంద్రం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అయితే ఆ కొత్త విధానం అమలుపై మాత్రం స్టే ఇవ్వడానికి నిరాకరించింది. సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) తమ కౌంటర్ అఫిడవిట్ నాలుగు వారాల్లో దాఖలు చేయాలని ఆదేశించింది. పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది అంజన్ దత్తా తరపు న్యాయవాది, సమాధానాలు దాఖలు చేసే వరకు కొత్త ఛార్జీల అమలుపై స్టే ఇవ్వాలని కోర్టును కోరారు. అయితే ధర్మాసనం అందుకు అంగీకరించలేదు. ఈ అంశం న్యాయపరమైన దానికంటే సాంకేతిక అంశాలతో ఎక్కువగా ముడిపడి ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రం తీసుకొచ్చిన కొత్త విధానం ప్రకారం, అక్టోబర్ 15 నుంచి రూ.2,000 కంటే ఎక్కువ విలువైన కొన్ని యుపిఐ పర్సన్ టుమర్చంట్ (పి2ఎం) చెల్లింపులపై 0.4 శాతం ఎండిఆర్ వర్తిస్తుంది. దాదాపు ఆరు సంవత్సరాలుగా యుపిఐ చెల్లింపులు ఎలాంటి ఎండిఆర్ లేకుండా కొనసాగుతున్న నేపథ్యంలో ఆ మార్పు వస్తోంది. అయితే ప్రతి యుపిఐ చెల్లింపుపై కూడా ఆ ఛార్జీ ఉండదు. పర్సన్‌టుపర్సన్ లావాదేవీలు, చిన్న మొత్తాల చెల్లింపులు ఆ ఛార్జీ పరిధిలోకి రావు. కాగా, కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకటరామన్ మాట్లాడుతూ, గేట్‌వేను ఉపయోగించే వారిలో 96 శాతం మందికి మినహాయింపు ఉంటుందని కోర్టుకు తెలిపారు. రూ.75,000, అంతకంటే ఎక్కువ చెల్లింపులకు ఎండిఆర్ గరిష్ఠంగా రూ.300గా ఉంటుంది. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తుల వంటి తక్కువ లాభాలతో పనిచేసే కొన్ని రంగాలకు రూ.2,000 పైన లావాదేవీకి రూ.5 చొప్పున ఫ్లాట్ ఎండిఆర్ ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీలకు సంబంధించిన చెల్లింపులు, స్టాక్ బ్రోకర్లు, డీలర్ల ద్వారా జరిగే లావాదేవీలకు 0.02 శాతం ఎండీఆర్ ఉంటుంది. వీటికి కూడా గరిష్ఠ పరిమితి రూ.300గా నిర్ణయించారు. కొత్త ఎండిఆర్ విధానాన్ని సరైన చట్టపరమైన ప్రక్రియ, పారదర్శకత, ప్రజలతో సంప్రదింపులు లేకుండా తీసుకొచ్చారని పిటిషనర్ వాదించారు. చిన్న వ్యాపారులపై అదనపు భారం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే యుపిఐకి, రూపే డెబిట్ కార్డులకు వేర్వేరు నిబంధనలు ఎందుకు ఉన్నాయనే అంశాన్ని కూడా పిటిషన్‌లో ప్రశ్నించారు. భవిష్యత్తులో ఎండిఆర్ నిర్ణయించేటప్పుడు వ్యాపారి టర్నోవర్, ఎంఎస్ఎంఇ స్థాయి, లాభాల మార్జిన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇక పర్సన్‌టుపర్సన్ లావాదేవీలకు మాత్రం ఎలాంటి ఛార్జీ ఉండదు. ఇవి యుపిఐ లావాదేవీల పరిమాణంలో 37 శాతం, మొత్తం విలువలో 70 శాతం వాటా కలిగి ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసినప్పటికీ, అక్టోబర్ 15 నుంచి అమలుకానున్న ఎండిఆర్ విధానంపై స్టే ఇవ్వలేదు.

### 'సర్' పార్టీల అంశం కాదు...

# దేశ ప్రజాస్వామ్యానికి చెందినది

- సిఇసి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే : ఖర్గే
- నేడు సిడబ్ల్యుసి భేటీ : సిఇసి తొలగింపుపై కార్యాచరణ రూపకల్పన



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం మంగళవారం ఢిల్లీలో జరగనుంది. సమావేశంలో ఎన్నికల సంఘంలో తలెత్తిన అంతర్గత విభేదాల అంశంపై చర్చించడంతో పాటు, సిఇసి జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నారు. రాబోయే ఎన్నికల సన్నాహాలపై కూడా చర్చించే అవకాశం ఉందని వర్గాలు చెప్పారు. ఈ విషయాలను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడిస్తూ ఎన్నికల కమిషనర్లు ఎన్నికల సంఘం పనితీరుపై ఆందోళనలు వ్యక్తం చేయడం ద్వారా సంస్థ అంతర్గత వ్యవహారాలను బయటపెట్టారని పేర్కొన్నారు. ప్రత్యేక ముమ్మర సవరణ (సర్), కొత్త ఓటర్ల నమోదు కోసం 'ఫారం 6'లో మార్పులు, ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు–తొలగింపులు, ఓటర్ల జాబితా డేటాబేస్‌పై కేంద్రీకృత నియంత్రణ వంటి అంశాలపై వారు ఆందోళనలు లేవనెత్తారన్నారు. ఇది అత్యంత తీవ్రమైన అంశమని, సర్ ఏ ఒక్క పార్టీకి సంబంధించిన అంశం కాదు, దేశ ప్రజాస్వామ్య మనుగడకు సంబంధించినదని, దీనిని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని ఖర్గే అన్నారు. 'మంగళవారం వర్కింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశాను. అక్కడ మేము ఈ అంశంపై చర్చిస్తాము. వర్కింగ్ కమిటీ సభ్యులందరూ తమ సూచనలను తెలియజేస్తారు. దీనిపై తీవ్రంగా పోరాడబోతున్నాము. ఈ సమస్య మొత్తం దేశానికి, మన ప్రజాస్వామ్య ఉనికికి, దేశ మనుగడకు సంబంధించినది. అందుకే మేము ఈ విషయం పట్ల చాలా సీరియస్‌గా ఉన్నాము' అని ఖర్గే విలేకరులతో అన్నారు. ఎన్నికల సంఘంలోని వ్యక్తులే వారి వ్యవహారాలను బయటపెట్టారని, కేరళ మాజీ చీఫ్ సెక్రటరీ కూడా, ఎన్నికల్లో పోటీ చేయమని స్వయంగా సిఇసి తనకు చెప్పినట్లు ఖర్గే పేర్కొన్నారు. అంటే ఆయన బిజెపి సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నారని, బిజెపి కార్యకర్తగా మారిపోయారని అర్థం అని ఆయన ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి, ఆయన రాజీనామా చేసిన తర్వాత కూడా చర్య తీసుకోవాలి అని కాంగ్రెస్ అధినేత అన్నారు. ఖర్గే అధ్యక్షతన జరిగే సిడబ్ల్యుసి సమావేశానికి మాజీ పార్టీ అధినేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, జైరామ్ రమేష్, కెసి వేణుగోపాల్ తదితరులు హాజరయ్యే అవకాశం ఉంది. సిఇసి కుమార్ తొలగింపు డిమాండ్‌పై ఒత్తిడి పెంచడానికి, ఈ విషయంలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ వ్యూహరచన చేస్తుందని వర్గాలు తెలిపాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో జెన్ జీ తరాన్ని లక్ష్యంగా చేసుకుని మినహాయింపులు ఇస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. కుమార్ తక్షణమే రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను గట్టిగా వినిపించింది.

# బ్యాంకుల సమ్మె వాయిదా

- తమ డిమాండ్లపై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ నుంచి యూనియన్లకు లభించిన స్పష్టమైన హామీ
- సోమవారం సాధారణంగా కొనసాగిన కార్యకలాపాలు



**న్యూఢిల్లీ :** బ్యాంకుల సమ్మె వాయిదా పడింది. వారానికి ఐదు రోజుల పనిదినాలు, పెండింగ్‌లో ఉన్న డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు యూనియన్లు ఈనెల 28, 29, 30 మూడు రోజుల పాటు సమ్మెకు పిలుపునిచ్చాయి. అయితే బ్యాంక్ యూనియన్ల డిమాండ్ల విషయంలో 'ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్' (ఐబిఎ) నుండి హామీ లభించడంతో బ్యాంక్ సంఘాలు తమ మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెను విరమించాయి. దీంతో సోమవారం బ్యాంకింగ్ కార్యకలాపాలు సాధారణంగా కొనసాగాయి. 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యుఎఫ్‌బియు) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించాలనే డిమాండ్‌తో సహా తమ ఇతర డిమాండ్లను పరిశీలిస్తామని ఐబిఎ హామీ ఇచ్చిన తర్వాత, బ్యాంక్ సంఘాలు ఆదివారం అర్ధరాత్రి తమ సమ్మెను విరమించాయి. 'ఇప్పటికే ప్రతినెలా రెండవ, నాలుగవ శనివారాలు సెలువు కాగా, మిగిలిన శనివారాలను కూడా సెలవు దినాలుగా ప్రకటించే అంశంపై చర్చించడానికి ఐబిఎ, యుఎఫ్‌బియుల ప్రతినిధులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని తక్షణమే ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీ సాధ్యమయ్యే అన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తుంది, సంబంధిత వర్గాలన్నింటితో (స్టేక్‌హోల్డర్లతో) చర్చిస్తుంది. అందరికీ ముఖ్యంగా వినియోగదారులకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని రూపొందిస్తుంది' అని యుఎఫ్‌బియు ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం, బ్యాంకులు ఆదివారాలు, ప్రతి నెలా రెండవ, నాలుగవ శనివారాల్లో మూసి వేస్తున్నారు. స్కేల్–4, అంతకంటే పైస్థాయి అధికారులకు సంబంధించిన పిఎల్ఐ పథకం విషయంలో, యూనియన్లు/సంఘాల అభ్యంతరాలను పరిష్కరించడానికి వీలుగా పథకంలో మార్పులను ప్రతిపాదిస్తూ ఐబిఎతో చర్చలు జరపవచ్చని పేర్కొంది. మార్చి 8, 2024 నాటి సమావేశ వివరాలలో పేర్కొన్న మిగిలిన అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత వర్గాలు చర్చిస్తాయని తెలిపింది. మూడు రోజుల సమ్మె పిలుపు నేపథ్యంలో వినియోగదారులకు కలిగే అసౌకర్యాన్ని తగ్గించేందుకు, ఆదివారం నాడు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు తెరిచే ఉన్నాయి.

# అప్పుడే పుట్టిన పిల్లలకు బంగారు ఉంగరాల పథకం..

### హామీని నిలబెట్టుకున్న తమిళనాడు సిఎం విజయ్

**చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్నారు. ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్నట్టుగానే ప్రభుత్వ ఆస్పత్రులలో జన్మించిన ప్రతి చిన్నారికి ఒక గ్రాము బంగారు ఉంగరం అందజేసే పథకాన్ని సోమవారం ప్రారంభించారు. మధురైలోని రాజాజీ ప్రభుత్వ ఆసుపత్రిలో విజయ్ స్వయంగా పిల్లలకు బంగారు ఉంగరాలు తొడిగారు. తమిళంలో ఈ పథకం పేరు 'థాయ్‌మామన్ తంగ మొతిరమ్ థిట్టమ్'.

# రెబల్స్ అనర్హతపై సకాలంలో నిర్ణయం

### బెంగాల్ స్పీకర్‌కు గడువు గుర్తుచేసిన సుప్రీం

**న్యూఢిల్లీ:**పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ (టిఎంసి)లో తిరుగుబాటుచేసి అక్రమ ఫిరాయింపులకు పాల్పడిన పదిమంది శాసనసభ్యులపై అక్టోబరు ఎనిమిదో తేదీన నిర్ణీత గడువు ముగిసేలోపు ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తగిన నిర్ణయం తీసుకుంటారని సుప్రీంకోర్టు సోమవారం గట్టి విశ్వాసం వ్యక్తం చేసింది. తిరుగుబాటు శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ నాయకత్వంలో ఉన్న టిఎంసి వర్గం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. శాసనసభ్యుడు సోహన్‌దేవ్ ఛట్టోపాధ్యాయ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిర్ణీత గడువు దాటకముందే తగిన నిర్ణయం ప్రకటించేవిధంగా అసెంబ్లీ స్పీకర్‌కు మార్గదర్శకాలు జారీ చేయాలని ఛట్టోపాధ్యాయ సుప్రీంకోర్టును కోరారు.ప్రతిపక్ష నాయకుడు రితబ్రత బెనర్జీ సహా పదిమంది ఎంఎల్‌ఎలు మమతాబెనర్జీకి ద్రోహం చేసి ఫిరాయింపులకు పాల్పడటం ద్వారా అనర్హతవేటు ముంగిట నిలబడి ఉన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్,జస్టిస్ జోమాల్య బాగ్చి,జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ సందర్భంగా బెంగాల్ అసెంబ్లీ స్పీకర్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసింది. ఆయన గడువులోపే నిర్ణయం తీసుకోగలరని తాము పూర్తిగా విశ్వసిస్తున్నామని ధర్మాసనం ఆశాభావం వ్యక్తం చేసింది. ఛట్టోపాధ్యాయ తరపున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ ధర్మాసనం ఎదుట తన వాదనలు వినిపించారు. స్పీకర్ తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆయనపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

# పది రోజుల పాటు ఎల్‌పియు మూసివేత

### తమ ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు : విధ్వంసకారులపై చర్యలు తీసుకుంటామని డిజిపి హెచ్చరిక




**ఫగ్వారా :** పంజాబ్ కపుర్తలా జిల్లా ఫగ్వారాలో ఉన్న లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పియు) క్యాంపస్‌లో ప్రశాంతత నెలకొంది. యూనివర్సిటీ బయటి వ్యక్తి క్యాంపస్ ఆవరణలో విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడినట్లు వార్తలు రావడంతో ఆదివారం హింసాత్మక నిరసనలు చెలరేగాయి. దీంతో 10 రోజుల పాటు తరగతులను నిలిపివేయడంతో క్యాంపస్‌లో పరిస్థితి ప్రశాంతంగా ఉంది. చాలా మంది విద్యార్థులు తమ ఇళ్లకు బయలుదేరారు. అయితే, విధ్వంసకారులపై చర్యలు తీసుకుంటామని పంజాబ్ డిజిపి హెచ్చరించారు. లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎపియు)కి చెందిన నిరసనకారులైన విద్యార్థులు 15 గంటలకు పైగా దిగ్బంధించిన జాతీయ రహదారి44పై వాహనాల రాకపోకలను పునరుద్ధరించినట్లు పోలీసులు తెలిపారు. జలంధర్–ఫగ్వారా రహదారి పక్కన ఉన్న ఈ విశ్వవిద్యాలయం వద్ద భారీగా పోలీసు బందోబస్తు కొనసాగింది. విద్యార్థులు తమ బ్యాగులు, సూట్‌కేసులతో క్యాంపస్ నుండి బయలుదేరడం కనిపించింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లడానికి వచ్చారు. క్యాంపస్‌లో హింస జరిగిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి. పలుచోట్ల ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ విధ్వంసానికి బయటి వ్యక్తులే కారణమని చాలా మంది విద్యార్థులు ఆరోపించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఒక బయటి వ్యక్తి ఒక విద్యార్థినిపై అత్యాచారం చేశాడన్న ఆరోపణల నేపథ్యంలో, ఎల్‌పియు విద్యార్థులు ఆదివారం నాడు క్యాంపస్‌లో విధ్వంసం సృష్టించారని, ఆస్తులను ధ్వంసం చేశారని, తమ క్యాంపస్ వెలుపల ఉన్న న్యూఢిల్లీ–అమృత్‌సర్ జాతీయ రహదారిలోని కొంత భాగాన్ని దిగ్బంధించారని ఆరోపణలు ఉన్నాయి. వారు కొన్ని వస్తువులకు నిప్పుపెట్టినట్లు కూడా నిరసన దృశ్యాలలో కనిపించింది. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆదేశాల మేరకు, పరిస్థితిని సమీక్షించడానికి డిజిపి గౌరవ్ యాదవ్ ఎల్‌పియును సందర్శించారు. దీనికి సంబంధించి, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, చిత్కారా యూనివర్సిటీలలో జరిగిన రెండు నిరసన ఘటనలను పంజాబ్ రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ ఘటనలు వరుసగా ఒక బయటి వ్యక్తి విద్యార్థినిపై అత్యాచారం చేశాడన్న, ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారన్న ధృవీకరించని ఆరోపణలపై ఆధారపడి ఉన్నాయి. ఈ కమిషన్ సంబంధిత జిల్లా, పోలీసు యంత్రాంగాల నుండి ఎఫ్ఐఆర్‌ల కాపీలు, క్యాంపస్‌లలో విద్యార్థుల భద్రతా చర్యలతో సహా వివరణాత్మక నివేదికలను కోరింది.

**IN THE COURT OF THE HON'BLE IV ADDL. DISTRICT AND SESSIONS JUDGE, SANGA REDDY DISTRICT AT SANGA REDDY**
**G.W.O.P. No. 31 Of 2026**

BETWEEN:
**Smt. Vemuri Anuradha,** .....plaintiff
AND
**All Concerned.** ....Defendants

**NOTICE**

To,
1. To whomsoever it may concern.

The plaintiff herein filed above **G.W.O.P. No. 31 Of 2026** against above **All Concerned**. Hence, you are required to appear before Hon'ble Court through Legal counsel on **27.10.2026 at 10:30am.** Failing which the matter will be heard & decided in your absence.

Sd/-
**K. RAM MURTHY & K. UMA**
**Advocates,**
FCI Colony, Miyapur,
Hyderabad-49,
**Mobile: 9440412810**

## పాలస్తినాను సమర్థించిన స్పెయిన్

### ఇజ్రాయెల్ నుండి రాయబారి బహిష్కరణ

**జెరూసలెం:** పాలస్తినాకు పూర్తి మద్దతు ఇస్తూ స్పెయిన్ యువజనశాఖామంత్రి సిరా రెగో చేసిన వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇజ్రాయెల్‌లో ఉన్న స్పెయిన్ రాయబార కార్యాలయం ఛార్జి డీ అఫైర్స్‌ను పిలిపించి మందలించింది.అదే విధంగా వెస్ట్‌బ్యాంక్‌లోని రమల్లా నగరంలో ఉన్న డచ్ దౌత్యవేత్తను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. వారం రోజుల్లోగా వెళ్ళిపోవాలని ఆదేశించింది. ఈ పరిణామాలపై డచ్ విదేశాంగమంత్రి టామ్ బెరెండ్‌సెన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. స్పెయిన్ మంత్రి దాదాపు ఇజ్రాయెల్‌ను నిర్మూలిస్తామన్నట్టుగా ప్రకటన చేశారని స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంఛెజ్ ఇజ్రాయెల్ వ్యతిరేక వైఖరి అనుసరిస్తున్నారని ఆ దేశ విదేశీమంత్రిత్వశాఖ విమర్శించింది.

## సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా తెలంగాణ ఛీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్

### ఆయనతో సహా ముగ్గురి పదోన్నతికి సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌కు పదోన్నతి కల్పించేందుకు సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఈ మేరకు సోమవారం నాడు భేటీ అయిన కొలీజియం ముగ్గురు న్యాయమూర్తులకు పదోన్నతి కల్పించాలని నిర్ణయించింది. అందులో అపరేశ్ కుమార్‌తో పాటు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె. ఉపాధ్యాయ్ పేర్లు ఉన్నాయి. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్య 38 మంది కాగా, ప్రస్తుతం 34 మంది న్యాయమూర్తులు ఉన్నారు.

## అన్ని సీట్లు గెలిచినా... ఇవిఎంలను వ్యతిరేకిస్తాం

### సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్

**లక్నో :** ఎన్నికల్లో తమ పార్టీ అన్ని స్థానాలను గెలుచుకున్నప్పటికీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎం) వినియోగాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సోమవారం అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అనేక స్థాయిల సాంకేతికతను ఉపయోగించాల్సిన అవసరంపై ప్రశ్నలు లేవనెత్తిన ఆయన, జర్మనీ, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు బ్యాలెట్ పేపర్లనే ఉపయోగిస్తున్నాయని గుర్తుచేశారు. 'ఒక యంత్రం తర్వాత మరొక యంత్రం అవసరం ఎందుకు?' అని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రశ్నించారు. తాము అన్ని స్థానాలను గెలుచుకున్నా సరే, ఇవిఎంలకు వ్యతిరేకమేనని ఇప్పటికే చెప్పాము అని ఒక ప్రశ్నకు సమాధానంగా యాదవ్ అన్నారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ 'అమెరికాతో మీకు అంత మంచి సంబంధాలు ఉన్నప్పుడు, అమెరికా బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటు వేయడం లేదా? జర్మనీ ఉదాహరణను మీ ముందు చాలాసార్లు చెప్పాను. జర్మనీ ఎంతో సంపన్న దేశం, సాంకేతికత, పరిశోధనలో మనకంటే చాలా ముందుంది. అయినప్పటికీ ఆ దేశం ఇవిఎంలను అంగీకరించలేదు' అని అన్నారు.

## సీటు ఖాళీ

(మొదటి పేజీ తరువాయి)

వేసిన విషయం తెలిసిందే. దీనిపైన ఆయన సుప్రీం కోర్ట్‌ను ఆశ్రయించగా,ఆ పిటిషన్‌ను సుప్రీం కోర్ట్ తిరస్కరించింది. ఈ క్రమంలో పార్టీ మార్పిడి నిబంధనలు, సంబంధిత చట్టపరమైన ఆదేశాల మేరకు శాసనసభ సచివాలయం చర్యలు తీసుకుంది.దీంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యంగా మారింది.

# పరాధీనత నుండి ప్రముఖ స్థానానికి ఇరాన్

### • శత్రువు ఆశించే పూర్వ పెత్తనం ఎన్నటికీ తిరిగిరాదు మొజ్తాబా ఖమేనీ ప్రకటన

**టెహ్రాన్:** ఇస్లామిక్ ప్రపంచంలో ఇరాన్ ఒక ప్రముఖ స్థానానికి ఎదిగిందని,శత్రువు కోరుకున్నవిధంగా పాతకాలపు శకం ఇక శాశ్వతంగా ఎన్నటికీ తిరిగి రాదని ఇరాన్ సర్వాధినేత, ఇస్లామిక్ విప్లవ నాయకుడు ఆయెతొల్లా సయ్యద్ మొజ్తాబా హొస్సేనీ ఖమేనీ ప్రకటించారు. హెజ్బొల్లా మాజీ సెక్రటరీ జనరల్ సయ్యద్ హసన్ నస్రల్లా అమరత్వం పొంది రెండు సంవత్సరాలు పూర్తియిన సందర్భంగా సోమవారం నాడు మొజ్తాబా ఖమేనీ ఒక ప్రకటన విడుదల చేశారు.



ఎనిమిది సంవత్సరాల పవిత్ర రక్షణ చర్యలు ఇరాన్‌ను సంపూర్ణంగా మార్చివేశాయని, విదేశీ ఒత్తిడి,దురాక్రమణ చర్యల నేపథ్యంలో ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ ఎంతోశక్తిమంతంగా రూపుదిద్దుకుందని అన్నారు. ఇస్లామిక్ విప్లవాన్ని ఎన్నో త్యాగాలతో రక్షించుకున్నామని, ఆ అనుభవాలు, వారసత్వంతో దేశ భవిష్యత్తు ఇక తిరుగులేకుండా పురోగమిస్తుందన్నారు. హోర్ముజ్ జలసంధిలో పరిణామాలు,పశ్చిమాసియాలో ఉద్రిక్తలను కూడా ఆయన ప్రస్తావించారు. దైవసహాయంతో ఇరాన్ ప్రజలు ప్రతిఘటనను,విజయాలను,గౌరవాన్ని సాధిస్తూనే ఉంటారని,శత్రువులు అవమానాలను,అపజయాలను ఎదుర్కొంటూనే ఉంటారన్నారు.దేశరక్షణకు మద్దతు ఇవ్వడంలో వివిధ వర్గాల ప్రజలు భాగస్వాములుగా ఉన్నారని, ముఖ్యంగా మహిళలు ఇరాన్ రక్షణలో ప్రధానపాత్ర నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ అనుసరిస్తున్న చట్టబద్ధమైన వైఖరికి ప్రపంచవ్యాప్తంగా వివిధ వర్గాల నుండి మద్దతు లభించిందన్నారు. అలీ ఖమేనీ త్యాగం, అమరత్వం ప్రస్తుత విజయాలకు పునాదివేసిందని, ఆయన త్యాగం భవిష్యత్తుకు దోహదం చేస్తుందన్నారు. అదేవిధంగా లెబనాన్ ప్రజలకు ప్రతినిధిగా హసన్ నస్రల్లా సమర్థనాయకుడని నివాళులు అర్పించారు.

ఇరాన్ శత్రువు కోరుకున్న శకం ఇక ఎన్నటికీ తిరిగిరాదని, అది శాశ్వతంగా అంతమైందని పేర్కొన్నారు. ఒకరిమీద పరాన్నజీవిలా ఆధారపడటం, అవమానాలు, అవహేళనలు దగ్గర నుండి ఈనాడు స్వాతంత్ర్యం, బలం పుంజుకుని ఇస్లామిక్ ప్రపంచంలో ఒక ప్రముఖస్థానానికి ఎదిగిందని ఆయన పేర్కొన్నారు. ఇస్లామిక్ విప్లవానికి ముందుగా ఇరాన్ దేశం విదేశీపెత్తనం, పాశ్చాత్య ఆధిపత్యం, పరాధీనశక్తుల పెత్తనం, వారిజోక్యంతో నిండిపోయి ఉందని అమరుడైన విప్లవ నాయకుడు అయెతొల్లా అలీ ఖమేనీ నాయకత్వంలో వచ్చిన విప్లవం ఆ పరిస్థితిని అంతం చేసి ఇస్లామిక్ రిపబ్లిక్‌ను స్థాపించిందని ఇక ఎన్నటికీ ఆ పాతశకం తిరిగి రాదన్నారు. ఇరాన్‌లో వచ్చిన ఇస్లామిక్ విప్లవాన్ని తిప్పికొట్టడానికి,అంతం చేయడానికి ఇరాక్‌లో బాత్ ప్రభుత్వాన్ని తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఇరాక్‌తో జరిగిన యుద్ధంతో ఇరాన్ మరింత బలంగా, ధృఢంగా ఆవిర్భవించిందని, ఆ తర్వాత నుండి ఇప్పటివరకూ అదే ధోరణిలో పరిణామాలు సంభవిస్తున్నాయని, వాటన్నింటినీ ఇరాన్ సమర్థవంతంగా ప్రతిఘటిస్తోందని పేర్కొన్నారు. 1979లో ఇస్లామిక్ రిపబ్లిక్ తనను తాను రక్షించుకోవడానికి శత్రువులను ప్రతిఘటించడానికి పరిమితమైన మార్గాలను మాత్రమే ఎంచుకుందని, ఆనాటి నుండి శత్రువులను ఎలా ప్రతిఘటించాలో ఇరాన్ నేర్చుకుందని,శత్రువులను ఎదుర్కొనే శక్తిసామర్థ్యాలను అభివృద్ధి చేసుకుందని, ఈనాడు ఇరాన్ ఇస్లామిక్ ప్రపంచంలో ఒక ప్రముఖస్థానానికి ఎదిగిందని, ఉన్నతస్థానాన్ని, పురోగతిని అనుభవిస్తోందని మొజ్తాబా ఖమేనీ తన ప్రకటనలో పేర్కొన్నారు.పశ్చిమాసియాలో ఒకప్పుడు శత్రువులు ఇరాన్‌పై పెత్తనం చేయాలని చూశారని, ఈనాడు ఇరాన్ సైనిక దాడులను వారు చవిచూడాల్సివస్తోందని, గడచిన దశాబ్దంతో పోలిస్తే ఇరాన్ రక్షణ సామర్థ్యాలు గణనీయంగా పెరిగాయన్నారు.

## సెర్బియా అధ్యక్షుడి రాజీనామా

### వచ్చేనెల 25న ఎన్నికలు



**బెల్‌గ్రేడ్:** సెర్బియా దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ వుచిక్ (56) తన పదవికి రాజీనామా చేశారు. మధ్య, ఆగ్నేయ యూరప్‌లో బాల్కన్ ద్వీపకల్ప దేశం సెర్బియా పార్లమెంటు సెప్టెంబరు తొమ్మిదో తేదీన రద్దయింది.అక్టోబరు 25వ తేదీన దేశంలో ముందస్తు ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్నాయి. అలెగ్జాండర్ వుచిక్ ఈసారి ప్రధానమంత్రి పదవికి పోటీ పడబోతున్నారు. ఆయన లిఖితపూర్వకంగా పార్లమెంటుకు రాజీనామా పత్రం సమర్పించారు. ఈ రాజీనామా పార్లమెంటు అందుకున్న వెంటనే ఆయన పదవీకాలం ముగిసిపోతుంది. ప్రత్యేకించి పార్లమెంటు ఆయన రాజీనామా ఆమోదించాల్సిన అవసరం ఉండదు. పార్లమెంటు స్పీకర్ అనా బర్నాబిక్ మూడునెలపాటు ఆయన తరపున దేశాధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తారు.రాజ్యాంగం ప్రకారం ఈ గడువులోపే దేశ పార్లమెంటుకు ఎన్నికల ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఒక సాధారణ పౌరుడుగా తాను పాల్గొంటానని వుచిక్ ఈ సందర్భంగా చెప్పారు. ఐతే సెర్బియన్ ప్రోగ్రెసివ్‌పార్టీ సెప్టెంబరు ఐదో తేదీన ప్రకటించిన ఎన్నికల జాబితాలో అలెగ్జాండర్ వుచిక్‌ను ప్రధానమంత్రి పదవికి అభ్యర్థిగా ఎంపిక చేసింది. 1970లో బెల్‌గ్రేడ్‌లో జన్మించిన అలెగ్జాండర్ వుచిక్ గతంలో దేశ రక్షణమంత్రిగా, ప్రధానమంత్రిగా పనిచేశారు. 2017లో మొదటిసారి, 2022లో రెండోసారి దేశాధ్యక్ష పదవికి ఆయన ఎన్నికయ్యారు. ఈసారి ప్రధానిగా పోటీ చేస్తున్నారు. సెర్బియా రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లు మాత్రమే దేశాధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు నిర్వహించాలి.

# అమెరికా జలాంతర్గ డ్రోన్లు ఇరాన్ వశం

### ఇది మా విజయచిహ్నం: ఐఆర్‌జిసి

**టెహ్రాన్:** వరుస వరుసగా అమెరికాకు చెందిన రెండు జలాంతర్గ డ్రోన్‌లను ఇరాన్ ఐఆర్‌జిసి సైనిక దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ రిమోట్ ఆపరేటెడ్ యుఆర్‌ఓవిలను హోర్ముజ్ జలసంధిలోనే పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో గూఢచారి కార్యకలాపాలు నిర్వహిస్తున్న అమెరికాకు చెందిన అత్యాధునిక రిమోట్ ఆపరేటెడ్ డ్రోన్ల జాడ తెలుసుకోవడానికి ఇరాన్ దళాలు ఎంతో సమన్వయంతో,అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉపయోగించి ఎంతో కష్టపడి స్వాధీనం చేసుకున్నట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. సముద్ర జలాల అడుగున ఎంతో సంక్లిష్టమైన ఆపరేషన్ ద్వారా "రెమస్ 600"అను నిఘాకోసం అమెరికా ఉపయోగిస్తున్న విషయాన్ని కనుగొన్నట్లు తెలియజేసింది. ఈ అత్యాధునిక జలాంతర్గ డ్రోన్లను స్వాధీనం చేసుకోవడం ఇరాన్ విజయానికి ఒక గొప్ప బహుమతి అని, ప్రస్తుతం ఈ డ్రోన్లు తమ నిపుణుల అధీనంలో ఉన్నాయని,వీటి ద్వారా ఎలాంటి సమాచారాన్ని సేకరిస్తున్నారనే విషయాన్ని తెలుసుకోవడానికి నిపుణులు ప్రయత్నం చేస్తున్నారని



పేర్కొంది.

హోర్ముజ్ జలసంధిని మూసివేశామని, పూర్తిగా తమ అధీనంలో ఉందని, ఈ జలసంధిలో ప్రమాదకరమైన కార్యకలాపాలను, అనధికార మార్గాలలో రవాణాలను నిరంతరం కనిపెట్టుకుని ఉన్నామని, సెప్టెంబరు 8న ఒక మానవరహిత జలాంతర్గామిని, సెప్టెంబరు 27న మరో మానవరహిత జలాంతర్గామిని స్వాధీనం చేసుకున్నాట్లు తెలియజేసింది.5.8 మీటర్ల పొడవుగల ఈ మానవరహిత డ్రోన్ నిఘా, పర్యవేక్షణ, సముద్రగర్భ మ్యాపింగ్, మౌలిక సదుపాయాల తనిఖీ, మందుపాతరల నిరోధక కార్యకలాపాలు వంటి వాటికోసం ఈ మానవ రహిత డ్రోన్‌ను అమెరికా రక్షణ సాంకేతిక సంస్థ ఆండూరిల్ ఇండస్ట్రీస్ తయారుచేసిందని ఐఆర్‌జిసి ప్రకటించింది.

## యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు నెతన్యాహూ రహస్య పర్యటన

**జెరూసలెం:** ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ రహస్యంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ)దేశానికి వెళ్ళారు. యుఎఇ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో గడచిన ఆదివారం నాడు సమావేశం జరిపారు. దక్షిణ ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఉగ్రవాదులు సామూహిక దాడి చేయడానికి ముందుగా ఈ దాడి ప్రమాదం గురించి ముందుగానే నెతన్యాహూను హెచ్చరించారంటూ వచ్చిన వార్తలను ఖండించాల్సిందిగా నెతన్యాహూ ఈ సమావేశంలో యుఎఇ అధ్యక్షుడు నహ్యాన్‌కు విజ్ఞప్తి చేశారన్నది కీలక సమాచారం. ఐతే ఈ పర్యటనను యుఎఇ విదేశాంగమంత్రిత్వశాఖ అధికారికంగా ధృవీకరించడానికి నిరాకరించింది. నెతన్యాహూ పర్యటన గురించి ఇజ్రాయెల్ ఛానల్ 12 టీవీ ప్రకటించింది. హమాస్ ఉగ్రవాదులు దాడి చేస్తారన్న విషయంపై ముందుగానే నెతన్యాహూకు హెచ్చరికలు వెళ్ళాయన్న విషయంపై ఇజ్రాయెల్ పత్రిక "హారెట్జ్" ఒక కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని నెతన్యాహూ ప్రభుత్వం ఇప్పటికే ఖండించింది. ఐతే ఈ రహస్య పర్యటన గురించి నెతన్యాహూ కార్యాలయం నుండి ఎలాంటి సమాచారం విడుదల కాలేదు.

## చమురు ధరలు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

నాడు ఇరాన్ చేసిన ప్రతిపాదనతో చమురు ధరలు రెండూశాతం మేరకు తగ్గాయి. కానీ ట్రంప్ చర్యతో ఇంకా హెచ్చుస్థాయికి పెరిగాయి. ''ధరలు పెరిగాయి,ఆసియా ఈక్విటీలు బలహీనపడ్డాయి,ప్రపంచ స్థిర ఆదాయంలో శుక్రవారం కలిగిన ఉపశమనం ఒక ఆకస్మిక ముగింపులా కాకుండా ఒక విరామంలా ఉంది'' అని క్వింటెస్ ఇంటెల్‌కు చెందిన స్టీఫెన్ ఇన్నెస్ వ్యాఖ్యానించారు.ముడి చమురు ధర పెరుగుదలతో పెట్టుబడిదారులు ద్రవ్యోల్బణం,వడ్డీరేట్ల అంచనాలవైపు మళ్ళీ దృష్టి మళ్ళించారు.ఆసియా మార్కెట్లు మిశ్రమ స్పందన చూపించాయి. సియోల్,ముంబై,టోక్యో,షాంఘై,మనీలా,బ్యాంకాక్ మార్కెట్లు కూడా క్షీణించాయి.

**అమెరికాతో సంప్రదింపులు లేవు తోసిపుచ్చిన ఇరాన్**

అమెరికాతో సంప్రదింపుల ఆలోచన ఏదీ లేదని ఇరాన్ పాలకులు ప్రకటించారు.ఏడు రోజుల ప్రణాళికను టంప్ తిరస్కరించిన తర్వాత మళ్ళీ మాట మార్చి చర్చలకు అవకాశం ఉందని ఆక్సియోస్ సంస్థ ఒక నివేదిక ప్రచురించిన తర్వాత ఇరాన్ అధికారిక మీడియా సోమవారం ప్రకటించింది.జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఇరాన్ ప్రతినిధి బృందం ఇప్పటికీ న్యూయార్క్‌లోనే ఉంది. ఐతే ఈ బృందం యుద్ధం–శాంతిపై అమెరికాతో ఎలాంటి చర్చల్లో పాల్గొనబోదని ఇరాన్ మీడియా పేర్కొంది.మధ్యవర్తిదేశం ఖతార్ ద్వారా ఇరాన్ వైఖరిని అమెరికాకు స్పష్టంగా తెలియజేశామని అబ్బాస్ అరాఘ్చి(విదేశాంగమంత్రి) న్యూయార్క్ నుండి టెహ్రాన్‌కు బయలుదేరేముందు చెప్పారు.సెప్టెంబరు ఒకటో తేదీ నుండి ఇరాన్‌పై అమెరికా ఎలాంటి దాడులూ చేయలేదు.దీంతో పోరాటం మందగించింది.ఐతే హోర్ముజ్ జలసంధిలో మాత్రం క్రమం తప్పకుండా నౌకలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి.

## మోదీ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా పోరాడాల్సిన సమయం వచ్చింది' అని పిలుపునిచ్చారు. 'ఢిల్లీలో కూర్చున్న ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌కు సర్వాధికారాలు కట్టబెట్టారన్నారు.తాము పేదల పక్షాన నిలబడితే, బిజెపి మాత్రం కేవలం సంపన్నుల కోసమే పనిచేస్తోందన్నారు.

**గుజరాత్ వర్సెస్ దేశం...**

మోదీ హయాంలో ప్రస్తుతం జరుగుతున్నది ఉత్తరాది, దక్షిణాది సమస్య కాదని, గుజరాత్ వర్సెస్ మిగతా దేశం అన్నట్టుగా మారిందన్నారు. మోదీ యుపి నుంచి ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ దేశంలోని ప్రాజెక్టులు, కంపెనీలు, నిధులను మాత్రం గుజరాత్‌కే తీసుకెళ్తున్నారని, చివరి నిమిషంలో సెమీకండక్టర్ ప్రాజెక్టును కూడా అక్కడికే తరలించారని మండిపడ్డారు. మోదీ గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఎంతో హుందాగా వ్యవహరించారని, గుజరాత్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరించారని గుర్తు చేశారు. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన మద్దతులో 10 శాతం కూడా ప్రస్తుత ప్రధాని మోదీ తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వడం లేదని, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) టెండర్ల ప్రక్రియ పూర్తయి రెండేళ్లవుతున్నప్పటికీ పిఎంఒలోనే ఆదస్త్రం తొక్కిపెట్టారని సిఎం ఆరోపించారు.

**డీలిమిటేషన్‌తో దక్షిణాదికి తీరని అన్యాయం**

నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని సిఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని దక్షిణాది రాష్ట్రాలు క్రమశిక్షణతో అమలు చేస్తే, ఉత్తరాదిలో అలా జరగలేదని గుర్తుచేశారు. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, రాజస్థాన్ వంటి పెద్ద రాష్ట్రాలకే లబ్ధి చేకూరుతుందని, చిన్న రాష్ట్రాల ప్రాతినిధ్యం కనుమరుగవుతుందని సిఎం అన్నారు. 1976లో నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం లోక్‌సభ స్థానాలను 543 వద్ద 25 ఏళ్లపాటు ఫ్రీజ్ చేశారని, ఆ తర్వాత వాజ్‌పేయ్ ప్రభుత్వం మరో 25 ఏళ్లు పొడిగించారని, దీనిని ప్రధాని మోదీ మరో పాతికేళ్లు సీట్ల సంఖ్యను యథాతథంగా కొనసాగిస్తే ఎవరికీ నష్టం ఉండబోదని చెప్పారు.

**విద్య , నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత..**

తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధికే తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఏటా 1.80 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తుంటే, కేవలం 20 వేల మందికే ఉద్యోగాలు వస్తున్నాయని, అందుకే మార్కెట్ అవసరాలకు తగినట్టుగా నైపుణ్యాలు నేర్పినందుకే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేశామన్నారు.

**తెలంగాణ రాష్ట్రంలో లెఫ్ట్,రైట్ సంఘాలే..**

తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి సంఘాలు చాలా తక్కువ అని, లెఫ్ట్, రైట్ సంఘాలు ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎన్‌ఎస్‌ఐయూ ప్రభావం పెద్దగా లేదని, ఉత్తర భారతదేశంలో, దక్షిణ భారతదేశంలో రాజకీయాల శైలి వేరుగా ఉన్నదన్నారు. తమ వద్ద యూనివర్సిటీ లా కాలేజ్, ఆర్ట్స్ కాలేజీ నాయకునిగా ఎబివిపిలో గెలిచిన వారు ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని, యూనివర్సిటీలో విద్యార్థి సంఘంలో ఉన్నా, గ్రామానికి వెళ్లిన ఆ తర్వాత ఆ కుటుంబం కాంగ్రెస్‌లోనే ఉంటుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి పెద్దగా ప్రాధాన్యత లేదని, స్టూడెంట్ రాజకీయాల్లో ఎబివిపి ప్రభావం ఉంటే.. రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉందని సిఎం తెలిపారు.

## రేవంత్ రెడ్డి పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

చేయనున్నారు. వస్త్ర ఉత్పత్తి నిలయంగా పేరొందిన సిరిసిల్లలో నేతన్నల సంక్షేమం, అభివృద్ధి, మహిళల సాధికారతతో పాటు విద్య, మౌలిక వసతుల అభివృద్ధి పనులకు సిఎం ఈ సందర్భంగా శ్రీకారం చుట్టనున్నారు. చేనేత, పవర్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు ఈ నేతన్న బజార్ ఉపయోగపడనుంది. ప్రధానంగా సిరిసిల్లలో సాంచాలపై ఉత్పత్తి చేసే పెట్టికోట్, పాలియెస్టర్ వస్త్రాల మార్కెటింగ్కు వీలుగా ఈ నేతన్న బజార్‌ను ఏర్పాటు చేయాలని సిఎం ఇప్పటికే అధికారులను ఆదేశించారు. సిరిసిల్లతో పాటు వేములవాడలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. పెద్దూరులో 18 ఎకరాల్లో ప్రతిపాదించిన ఈ విద్యా సముదాయంలో 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా 64 తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్ బ్లాక్, క్రీడా మైదానాలు తదితర సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు తరగతి గదులు, ల్యాబ్లు, డైనింగ్ హాళ్లు, క్రీడా సదుపాయాలు, ఐటీ మౌలిక వసతులతో వీటిని అభివృద్ధి చేయనున్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మండపాలు, గోపురాలు, ప్రాకారాలు, సైట్ డెవలప్మెంట్, నీటి సరఫరాముగునీటి వ్యవస్థ, విద్యుత్ పనులు, షాపింగ్ కాంప్లెక్సులు, ఉత్తర వైపు సీసీ రోడ్డు సహా 26 పనులు ఇందులో ఉన్నాయి. జిల్లాలో పరిపాలనా మౌలిక వసతుల విస్తరణలో భాగంగా ఏడు కొత్త ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మించనున్నారు. సిరిసిల్ల, వేములవాడలో రెండు ఆర్డీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగిలో నాలుగు తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు ఈ గోదాములు ఉపయోగపడనున్నాయి. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన్ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, శిక్షణ, జీవనోపాధి కార్యక్రమాలతో పాటు మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి ఈ భవనం వేదిక కానుంది. సిరిసిల్లలో కొత్త నేతన్న బజార్ ఏర్పాటు కూడా పర్యటనలో కీలక అంశంగా ఉండనుంది. చేనేత, పవర్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు దీన్ని ప్రతిపాదించారు. దీనికి అవసరమైన మౌలిక వసతులు, ఆర్థిక సహాయం కోసం చేనేతజౌళి శాఖ కమిషనర్కు ప్రతిపాదనలు పంపారు. ఈ పనికి ఇంకా తుది మంజూరు, వ్యయం ఖరారు కాలేదు. వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడసిరిసిల్లలో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.

## రాజీవ్ యువ వికాసం

(మొదటి పేజీ తరువాయి)

సైదులు, బిసి సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను డిబిటి విధానంలో నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1.30 లక్షల మంది విద్యార్థులకు రూ.450 కోట్లను జమ చేసినట్లు చెప్పారు. హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను ప్రతి నెలా వారి ఖాతాల్లోనే జమ చేయాలని అధికారులను ఆదేశించారు. గీత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కాటమయ్య రక్షణ కవచాల పథకానికి రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 50 వేల మందికి కిట్లు మంజూరు కాగా, ఇప్పటికే 40 వేల కిట్లు పంపిణీ చేశామని చెప్పారు. శిక్షణలో ఉన్న మరో 10 వేల మందికి శిక్షణ పూర్తయిన వెంటనే కిట్లు అందించాలని సూచించారు.

**నవంబర్ నుంచి రాజీవ్ యువ వికాసం..**

బిసి నిరుద్యోగ యువతకు ఉపాధి, ఆర్థిక ఉన్నతి కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని నవంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు భట్టి వెల్లడించారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో పారదర్శకంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద ఈ ఏడాది 180 మంది విద్యార్థులకు రూ.18.40 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులకు అవకాశం కల్పించేందుకు దరఖాస్తుల గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించినట్లు ప్రకటించారు.

**త్వరలో గురుకులాల పెండింగ్ బిల్లులు విడుదల..**

మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరలోనే క్లియర్ చేస్తామని భట్టి హామీ ఇచ్చారు. గురుకులాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరగా, ఆ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. బిసి కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి కూడా త్వరలో నిధులు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

## ప్రజాస్వామ్య వేదిక'

(మొదటి పేజీ తరువాయి)

కన్వీనర్ కె.రామచంద్రమూర్తి చెప్పారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలకు సంబంధించిన అంశాలపై స్వేచ్ఛాయుత చర్చలకు ఈ వేదిక ఒక విశాలమైన స్థలంగా ఉండనుందన్నారు. ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే పరిణామాలపై హెచ్చరించడం, అప్రమత్తం చేయడం, అవసరమైనప్పుడు సలహా ఇవ్వడం ద్వారా తన సామాజిక బాధ్యతను ఈ వేదిక నిర్వర్తించనున్నట్లు తెలిపారు. నేటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్య విలువలకు పడిపోతున్నాయని, వాటికి భంగం వాటిల్లకుండా ప్రశ్నించే సమయం ఆసన్నమైందన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే స్వయంప్రతిపత్తి సంస్థలపై కూడా నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరిలో ప్రశ్నించేతత్వం అలవడాలని, వేదికలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు రాజకీయ నేతల మధ్య ఆత్మగౌరవం, పరస్పర గౌరవం కూడిన భాష స్థానంలో ఇప్పుడు పరస్పరం దూషణలు, అసత్యాలు, వ్యక్తిగత విమర్శలు చోటుచేసుకోవడం విచారకరమన్నారు. ఫలితంగా ప్రజాస్వామ్య సంస్థలు, రాజ్యాంగ విలువలు బలహీనపడుతున్నాయని అభిప్రాయపడ్డారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే మౌలిక విలువల పరిరక్షణకు ఈ వేదిక కృషి చేస్తున్నదన్నారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం పట్ల ఆందోళనలు, నిబద్ధతలను పంచుకునే పౌరులందరూ ఈ వేదికతో పంచుకోవాలని కోరారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థ కూడా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, ఓటు నమోదు చేసుకొన్నా ఓటు ఉందా? లేదా అనే సందేహం కలుగుతుందన్నారు. ఓట్లను ఇష్టానుసారంగా తొలగించారని, దీనిపై ప్రశించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఎన్నికల సంఘంలో విభేదాలు రావడం చూస్తే ఇదే చివరి ప్రజాస్వామ్యంగా కనపడుతుందన్నారు. మౌనం వహిస్తే వచ్చే తరాలు క్షమించబోరని, పౌర సమాజంలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా భయానక వాతావరణం సృష్టించబడిందని, దానిని జెన్ జీ ఉద్యమం కొంత మేర మార్చేసిందని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం పౌర సమాజం మాట్లాడే స్వేచ్ఛ దేశంలో ఏ రాష్ట్రాల్లో లేదన్నారు. ప్రొఫెసర్ కోదండ రామ్ మాట్లాడుతూ ప్రజాస్వామిక విలువల పరిరక్షణకు నిరంతరం కృషి చేయటానికి ఈ వేదిక ప్రయత్నం చేస్తుందన్నారు. సమాజం పట్ల స్పృహ కలిగిన పెద్దవాళ్లు సమాజహితం కోరి, మంచిని కోరి ఒకటిగా నిలబడాలన్నారు. అప్పుడో ఇప్పుడో పిలిస్తే వెళ్లి మాట్లాడటం కాదు కొన్ని సందర్భాల్లో జోక్యం చేసుకుని కార్యాచరణ కొనసాగించేందుకు ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నవారికి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేకుండా పోతుందన్నారు. రాజ్యాంగం సమాన హక్కులు ఇస్తే అవి రానురాను లేకుండా పోతున్నాయన్నారు. ప్రజలు ఓటు హక్కు ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకొంటారని, కానీ ప్రభుత్వాలే ఓటర్లను ఎన్నుకొంటాయనే ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎం.వి.రెడ్డి మాట్లాడుతూ ఆలోచనలు, ఆవేదన, సమాలోచనలు చేసిన అనంతరమే ఈ వేదిక ఏర్పడిందన్నారు. రాజ్యాంగపరంగా ఏర్పడిన వ్యవస్థలు వారికి నిర్దేశించిన ప్రకారం పనిచేయడంలేవని అభిప్రాయపడ్డారు. ఇలాంటి వేదికలు విధివిధానాలు రూపొందించుకుని, కార్యాచరణతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉన్నదన్నారు. జ్యోతి కిరణ్ మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు అనే ఆయుధాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. అనేక రాష్ట్రాల్లో మహిళల ఓట్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు మహిళా ఓట్లలో ఒక ఓటు మాత్రమే ఉంటుందని, ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇలాంటి వేదిక అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. సమావేశంలో టిముడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ మాట్లాడారు.

## ఢీకొట్టిన లారీ

(మొదటి పేజీ తరువాయి)

పొన్నారం గ్రామానికి చెందిన చింతకుంట్ల లక్ష్మి, తోటపల్లి సోనియా పనుల నిమిత్తం శకం ప్రశాంత్ నడుపుతున్న ఆటో లో మంచిర్యాలకు బయలుదేరారు. ఉదయం 9.45 గంటల ప్రాంతంలో నస్పూర్ గేట్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సౌందర్య, చింతకుంట్ల లక్ష్మి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సుమలత, సోనియా మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ ప్రశాంత్ సహా మిగతా ముగ్గురు ప్రయాణికులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలు సౌందర్య సోదరుడు అగ్గు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నస్పూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సమీక్షించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

## 'బేర్ రన్'తో ఇన్వెస్టర్లు బేజారు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు చేపట్టవచ్చన్న సంకేతాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్ఇ) 30 షేర్ల సెన్సెక్స్ గత నెల ఆగస్టు 27 నుంచి 4,161.87 పాయింట్లు, అంటే 5.40 శాతం పడిపోయింది. స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్ఇ) 50 షేర్ల నిఫ్టీ కూడా 1,310.6 పాయింట్లు, అంటే 5.44 శాతం క్షీణించింది. గత నెల 27 నుంచి ఈనెల 28వ తేదీ, సోమవారం వరకూ పరిశీలిస్తే ఇన్వెస్టర్ల సంపద రూ.17,17,487.02 కోట్ల మేర ఆవిరై, రూ.4,74,36,620.19 కోట్లకు (4.94 ట్రిలియన్ డాలర్లు) చేరింది. సోమవారం ఒక్కరోజే బిఎస్ఇ బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 1,124.02 పాయింట్లు, అంటే 1.52 శాతం పతనమై 72,771.72 వద్ద ముగిసింది. ఇది 2026 మార్చి 30 తర్వాత నమోదైన కనిష్ఠం. నిఫ్టీ 360.25 పాయింట్లు, అంటే 1.56 శాతం పడిపోయి 22,780.25 వద్ద ముగిసింది. ఇది దాదాపు ఆరు నెలల కనిష్ఠం. మొత్తం మీద స్టాక్ మార్కెట్ లావాదేవీల్లో 'బేర్స్' (మార్కెట్లో ధరలు పడిపోతాయని అంచనా వేసే వర్గం) పూర్తిగా ఆధిపత్యం కొనసాగించారు.

# ఆసియా క్రీడల్లో భారత్ పతకాల వేట

## జావెలిన్లో 'డబుల్' జోష్.. లాంగ్ జంప్లో శ్రీశంకర్ వెండి వెలుగులు

పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పసిడి వేటలో తడబడినా.. వెండి, కాంస్యాలతో మెరుస్తున్నారు. లాంగ్ జంప్‌లో మురళీ శ్రీశంకర్ అదరగొడుతూ వెండి సాధించాడు. జావెలిన్ త్రోలో ఏకంగా రెండు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. యశ్వీర్ సింగ్ సిల్వర్, రోహిత్ యాదవ్ కాంస్యం కొల్లగొట్టగా.. బాక్సర్లు సూపర్ పంచ్తో మరో మూడు పతకాలు ఖరారు చేశారు. మహిళల విభాగంలో లొవ్లీనా బర్గోహైన్(75 కిలోలు), ప్రియా గంఘాస్, కపిల్ పొఖారియా(90 ప్లస్ కిలోలు)లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. మొత్తంగా.. బాక్సింగ్‌లో ఆరు పతకాలు ఖాయమమ్మాయి.
ఐచీ నగోయ ఆతిథ్యమిస్తున్న 18వ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ మురళీ శ్రీశంకర్ రజతం సాధించాడు. పురుషుల లాంగ్ జంప్ ఫైనల్లో గాయపడిన అతడు చివరి రెండు ప్రయత్నాల్లో దూకలేదు. మోకాలి గాయం వేధించడంతో 8.07 మీటర్లతో రెండో స్థానంలో నిలిచిన అతడు.. చివరకు వెండిని అందుకున్నాడు. ఇదే విభాగంలో భారత అథ్లెట్ దేవిడ్ సొలొమాన్ 7.70 మీటర్ల దూరం దూకి ఏడో స్థానంతో నిరాశపరిచాడు.
కాసేపటికే జావెలిన్ త్రోలో భారత అథ్లెట్లు యశ్వీర్ సింగ్, రోహిత్ యాదవ్‌లు అదరగొట్టారు. ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా గైర్హాజరీలో పతక బాధ్యత తీసుకున్న ఈ ఇద్దరూ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో రుమేశ్ పతిరంగ(శ్రీలంక) 88.55మీటర్లతో పసిడి సాధించగా.. యశ్వీర్ చివరిప్రయత్నంలో అత్యుత్తమంగా 85.72మీ, రోహిత్ 84.68మీ దూరం ఈటెను విసిరి వరసగా వెండి, కాంస్యాలు ఒడిసిపట్టారు.
కామన్వెల్త్ క్రీడల్లో తేలిపోయిన బాక్సర్ లొవ్లీనా బొర్గోహైన్ ఆసియాడ్‌లో మెరిసింది. క్వార్టర్ ఫైనల్లో దక్షిణ కొరియా బాక్సర్పై పంచ్ల వర్షం కురిపించింది. ఏకపక్ష పోరులో 5-0తో గెలుపొందిన లొవ్లీనా దర్జాగా సెమీస్లో అడుగుపెట్టింది. పురుషుల 90 ప్లస్ కిలోల ఫైట్లో కపిల్ పొఖారియా ధాటికి దక్షిణ కొరియా బాక్సర్ కిమ్ గిచాయే చేతులెత్తేశాడు.







### గుల్వీర్ సూపర్ షో.. 1500మీ ఈవెంట్లో సిల్వర్ మెడల్

నగోయా: గుల్వీర్ సిం మళ్లీ మెరిశాడు. ఏషియన్ గేమ్స్లో రెండో పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇవాళ జరిగిన 1500 మీటర్ల ఫైనల్లో అతను రెండో స్థానంలో నిలిచి సిల్వర్ పతకాన్ని గెలుచుకున్నాడు. ఇదే గేమ్స్లో అతను 10000 మీటర్ల ఈవెంట్‌లోనూ రజత పతకాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇవాళ 1500 మీటర్స్ ఈవెంట్ను అతను కేవలం 3:36.72 నిమిషాల్లో ఫినిష్ చేశాడు. చివరి నిమిషం వరకు టాప్లో ఉన్న గుల్వీర్కు.. అనూహ్య రీతిలో జపనీస్ స్ప్రింటర్ కజుటో ఇజావా షాక్ ఇచ్చాడు. ఫినిష్ లైన్ సమీపిస్తున్న తరుణంలో కజుటో ఇజావా పుంజుకుని గోల్డ్‌మెడల్ గెలుచుకున్నాడు. అతను కేవలం 0.37 సెకన్ల తేడాతో ఇండియన్ స్ప్రింటర్ను వెనక్కి నెట్టేశాడు. ఇక 3:37.92 టైంతో జపాన్‌కు చెందిన నగియా మోరీ బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు.

### పారుల్‌కు కాంస్యం

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పసిడి పతకానికి దూరమవుతున్నారు. మెరుగైన ప్రదర్శన చేస్తున్నా సరే వెండితో లేదా కాంస్యంతోనో సరిపెట్టుకుంటున్నారు. నగోయలో సీనియర్ స్ప్రింటర్ పారుల్ చౌదరీ పతక వేట కొనసాగుతోంది. మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్లో కాంస్యం సాధించిన తను.. రోజు వ్యవధిలోనే దేశానికి మరో పతకం అందించింది. సోమవారం మహిళల 5వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్ ఫైనల్లో సత్తా చాటిన పారుల్ మూడో స్థానంలో నిలిచింది.
పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో పారుల్ చౌదరీ మరో పతకం కొల్లగొట్టింది. ఇప్పటికే మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్లో కాంస్యంతో మెరిసిన ఈ వెటరన్ ఈసారి 5వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్లోనూ తళుక్కుమంది. సోమవారం జరిగిన ఫైనల్లో మూడో స్థానంతో కాంస్యంను ఒడిసిపట్టింది తను. పసిడి పోరులో ఆమె 15:14.61 సెకన్లలో పరుగు పూర్తి చేసింది. అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన కంటే 10 సెకన్లు ఆలస్యంగా పరుగెత్తింది పారుల్. గత ఎడిషన్ ఆసియాడ్లో స్వర్ణ పతకం పట్టేసిన పారుల్ ఈసారి కంచుమోతతోనే సరిపెట్టుకుంది. ఈ విభాగంలో కెన్యా అథ్లెట్ విన్ఫ్రెడ్ యవి ప్రథమ స్థానంలో నిలిచి పసిడిని ఎగరేసుకుపోయింది.

### కాంస్యం ముద్దాడిన విద్య

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ విద్యా రామరాజ్ అదరగొడుతోంది. మిక్స్డ్ రీలేలో వెండి పతకం గెలుపొందిన తను వ్యక్తిగత విభాగంలోనూ పతకంతో మెరిసింది. సోమవారం 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో సత్తా చాటిన విద్య కంచు మోత మోగించింది. ఇదివరకే భారత అథ్లెటిక్స్ దిగ్గజం పీటీ ఉష జాతీయ రికార్డు సమం చేసిన విద్య.. ఈసారి ఆ రికార్డును బ్రేక్ చేసింది. దాంతో.. ఒకే ఎడిషన్లో రెండుసార్లు పోడియం మీద మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిందీ పరుగుల చిరుత.
పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ విద్యా రామరాజన్ పతకాల పంట పండిస్తోంది. ఇప్పటికే మిక్స్డ్ 4x400 మీటర్ల రీలేలో సిల్వర్ మెడల్ సాధించిన తను ఈసారి వ్యక్తిగత విభాగంలోనూ కాంస్యం పట్టేసింది. సోమవారం జరిగిన మహిళల 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో విద్య అద్భుత ప్రదర్శన చేసింది.



---

యువతరంగం

## విద్య నుంచి ఉపాధి వరకు
# తెగిపోతున్న గొలుసు

విద్య నుంచి ఉపాధి వరకు తెగిపోతున్న గొలుసు భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశంగా, ఈ జనాభాను 'డెమోగ్రాఫిక్ డివిడెండ్'గా తరచూ అభివర్ణిస్తుంటారు. అయితే తాజా 'నీతి ఆయోగ్' అంచనా ప్రకారం 15-29 ఏళ్ల మధ్య వయసున్న దాదాపు 8.7 కోట్ల మంది యువత చదువుకోవడం లేదు, ఉద్యోగం చేయడం లేదు, ఎలాంటి శిక్షణ పొందడం లేదు. ఇది జర్మనీ జనాభాకు దాదాపు సమానం. ప్రతి ఏడాది సుమారు కోటి మంది భారతీయులు ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. సమస్య యువత సంఖ్య కాదు... వారి విద్య, నైపుణ్యాలకు సరిపోయే ఉత్పాదక ఉపాధి అవకాశాలు తగినంతగా లేకపోవడమే. విద్య నుంచి ఉద్యోగానికి వెళ్లే మార్గం కూడా తీవ్రంగా బలహీనపడింది. డిగ్రీ చదివిన వారిలో కేవలం 8 శాతం మందికే తమ విద్యార్హతలకు అనుగుణమైన ఉద్యోగాలు లభిస్తున్నాయని వ్యాసం పేర్కొంటోంది. తక్కువ ఆదాయ కుటుంబాలకు ఈ పరిస్థితి మరింత భారంగా మారుతోంది. కాలేజీ ఫీజులు, ప్రైవేట్ ట్యూషన్లు, పుస్తకాలు, రవాణా, వసతి కోసం ఇప్పటికే కుటుంబాలు అప్పులు లేదా అదనపు ఖర్చులు భరిస్తున్నాయి. ఉద్యోగం పొందేందుకు మళ్లీ ప్రత్యేక నైపుణ్య కోర్సులు చేయాలని చెప్పడం వారికి మరో ఆర్థిక భారాన్ని మోపుతోంది. యువతకు సంప్రదాయంగా అందుబాటులో ఉన్న మూడు ప్రధాన మార్గాలు ఇప్పుడు అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ తీవ్రంగా పెరిగింది. పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల వాయిదాలు, పరిమిత ఖాళీలు ఆ మార్గాన్ని మరింత కష్టతరం చేస్తున్నాయి. ప్రైవేటు రంగంలోనూ, ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగంలో, ఎంట్రీలెవల్ నియామకాలు కొన్ని సంవత్సరాల్లో భారీగా తగ్గాయని వ్యాసం చెబుతోంది. ఆటోమేషన్, కృత్రిమ మేధ వంటి సాంకేతిక పరిణామాలు కంపెనీల నియామక విధానాలను మారుస్తున్నాయి. మూడో మార్గమైన వృత్తి నైపుణ్య శిక్షణ కూడా ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. కాలేజీల్లో బోధించే అంశాలకు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలకు మధ్య అంతరం కొనసాగుతోంది. అంటే విద్యార్థి డిగ్రీ సంపాదించినా, ఉద్యోగానికి అవసరమైన సామర్థ్యాలు పూర్తిగా పొందకపోవచ్చు. ఈసమస్యకు మూలాలు పాఠశాల స్థాయి నుంచే కనిపిస్తున్నాయి. గత 'నీతి ఆయోగ్' అధ్యయనాలు విద్యుత్ సౌకర్యం లేని లక్షకు పైగా పాఠశాలలను, బాలికలకు పనిచేసే మరుగుదొడ్లు లేని పెద్ద సంఖ్యలో పాఠశాలలను, ఒకే ఉపాధ్యాయుడు అనేక తరగతులు, అన్ని సబ్జెక్టులు నిర్వహించే పాఠశాలలను గుర్తించాయి. విద్యపై జీడీపీలో 6 శాతం ఖర్చు చేయాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని భారత్ ఇప్పటికీ సాధించలేదు. అనేక ఉన్నత విద్యా సంస్థల పాఠ్యాంశాలు కూడా మారుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా మారలేదు.



**ఉద్యోగాలు వస్తున్నాయి.. కానీ సరిపోవడం లేదు...** దేశంలో ఉద్యోగాలే సృష్టించడం లేదనే వాదనను ఆర్థికవేత్తలు అంగీకరించరు. సిమెంట్, ఉక్కు వినియోగం పెరగడం, నిర్మాణ రంగం విస్తరించడం, రియల్ ఎస్టేట్ విక్రయాలు, ఆటో మొబైల్ డిమాండ్ వంటి సూచికలు ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని చూపిస్తున్నాయి. అయితే ఆర్థిక వ్యవస్థలో అందుబాటులో ఉన్న శ్రామిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించలేకపోతున్నాం. కొవిడ్ తర్వాత ఆర్థిక పునరుద్ధరణ కూడా పూర్తిగా జరగలేదని, ఆర్థిక వ్యవస్థ మహమ్మారికి ముందు కొనసాగిన వృద్ధి ధోరణితో పోలిస్తే ఇంకా సుమారు 10 శాతం దిగువన ఉందని వ్యాసం పేర్కొంటోంది. ప్రతి సంవత్సరం ఉద్యోగ మార్కెట్లోకి వచ్చే కోటి మంది కొత్తవారితో పాటు వ్యవసాయ రంగంలో దాగి ఉన్న నిరుద్యోగం, ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్నా తమ సామర్థ్యానికి తగిన పని లేదా ఆదాయం పొందని అర్ధనిరుద్యోగులు కూడా ఉన్నారు. ఉద్యోగం చేయాలనే ఆసక్తి, సమయం, చలనం పెరిగినప్పటికీ తగిన అవకాశాలు దొరకని మహిళల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ మొత్తం శ్రామిక శక్తికి ఉత్పాదక ఉపాధి కల్పించాలంటే దీర్ఘకాలం 9.5-10 శాతం స్థాయిలో వాస్తవ ఆర్థిక వృద్ధి సాధించాల్సి ఉంటుందని వ్యాసం అంచనా వేస్తోంది. భారత్ వంటి విస్తారమైన, సంక్లిష్టమైన ఆర్థిక వ్యవస్థకు ఇది చాలా కఠినమైన లక్ష్యం.

## విద్యార్థులే రచయితలు

ఇటీవల హైదరాబాద్ రాయదుర్గంలో జరిగిన కార్యక్రమంలో ఐదు పుస్తకాలను ఆవిష్కరించారు. అయితే, ఈ రచనలు చేసింది విద్యార్థులు కావడంతో, పుస్తకాల పట్ల ఆసక్తి పెరుగుతున్నది. వీరంతా 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఈ విద్యార్థులే. రచయితలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, వ్యాపార రంగ ప్రముఖుల సమక్షంలో తమ రచనలకు స్ఫూర్తి, రచనా ప్రక్రియ, పాఠకులుగా మొదలై రచయితలు గా ఎదిగిన తమ ప్రయాణాన్ని వివరించడం ఎంతో మంది యువ రచయితలకు స్ఫూర్తిదాయకంగా ఉంది. ఈ కార్యక్రమంలో అక్షయ కీర్తి, రాయ్ సూరత్, సీన్ జాన్ సేన్, మైరా జెమిని సేన్, వీక్షా వెల్కూరి తమ పుస్తకాలను పరిచయం చేశారు. 10వ తరగతి విద్యార్థిని అక్షయ కీర్తి కల్పిత ప్రపంచాలు, పాత్రలు, కథాంశాలతో కథలు రాస్తోంది. ఆమె ఇప్పటికే పలు పుస్తకాలు రాసింది. 7వ తరగతి విద్యార్థిని రాయ్ సూరత్ తన కుటుంబం, రోజువారీ జీవిత అనుభవాల ను 'మై డే'లో కథనంగా మలిచింది. 5వ తరగతి విద్యార్థి సీన్ జాన్ సేన్ ప్రయాణాలు, జంతువులు, ఊహాశక్తి, తన ఆసక్తుల ను రచనలో ప్రతిబింబించాడు. 2వ తరగతి విద్యార్థిని మైరా జెమిని సేన్ 'వే డౌన్ డీప్ ఇన్ మై బ్లూ బుక్'లో సముద్రం, దాని అడుగున ఉన్న ఊహాజగత్తును ఆవిష్కరించింది. 3వ తరగతి విద్యార్థిని వీక్షా వెల్కూరి కుటుంబం, భావోద్వేగాలు, వాస్తవ జీవిత అనుభవాలను ఆధారంగా చేసుకుని కథలు రాసింది. ఈ విద్యార్థుల రచనలు కల్పిత కథలు, కుటుంబ అనుభవాలు, జంతువులు, ప్రయాణాలు, ప్రకృతి వంటి విభిన్న అంశాలను స్పృశిస్తున్నాయి.



---

# సర్దార్ భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

## స్వాత్వంత్రం, సమానత్వం కోసం యువత ముందుకు రావాలి : ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ధర్మేంద్ర


మేడ్చల్ మల్కాజిగిరి...

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** సర్దార్ భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని, ఆయన కోరుకొన్న స్వాత్వంత్రం, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక, ప్రజాస్వామ్య న్యాయంపై ఆధారపడిన సమాజ నిర్మాణం కోసం నేటి యుపత, విద్యార్థులు పాటు పడాలని ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.ధర్మేంద్ర పిలుపునిచ్చారు. షహీద్ భగత్‌సింగ్ 119వ జయంతి సందర్భంగా ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎంఎంసి కాప్రా సర్కిల్ కార్యాలయం నుండి అంబేడ్కర్ కూడలి వరకు భగత్‌సింగ్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. సర్ ప్రక్రియలో తప్పిదాలపై సమగ్ర విచారణ జరిపి సిఈసి జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయటం ద్వారా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలంటూ ఈ ర్యాలీలో నినాదాలు చేసారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సల్మాన్‌బేగ్, సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, గిరిబాబు, చంద్రశేఖర్, ప్రతాప్, సుదర్శన్, సచిన్, ఉదీప్, రాహుల్, ప్రదీప్, రవళి, కీర్తన, హష్మి, మృణాళిని, రమ్య, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.
**నాగర్‌కర్నూల్ :** సర్దార్ భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరుడు షహీద్ భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మ, జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి.ఫయాజ్ డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ జయంతి వేడుకలను అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మధుగౌడ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, లక్ష్మి నారాయణ, కొత్త రామస్వామి, వంకేశ్వరం శ్రీనివాసులు, ఈర్ల భూపేష్, శివకృష్ణ, బాలపీర్, శేఖర్ హుస్సేన్, విష్ణు, సాయిలు, ఉషమ్మ, రాములు తదితరులు పాల్గొన్నారు.
**హనుమకొండ :** భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో విద్య, ఉపాధి, యువజన రంగ సమస్యలపై యువత ఉద్యమించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మర్రి శ్రీమాన్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు, జెట్టి కృష్ణ, అల్లం శివ, ఓరుగంటి విజయ్, మురళి, కనకం కావ్యశ్రీ, సాంబరాజు శ్వేత పాల్గొన్నారు.
**భద్రాద్రి కొత్తగూడెం :** భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతి వేడుకలు సోమవారం పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొరిమి రాజ్‌కుమార్, సలిగంటి శ్రీనివాస్, మేయర్ మూడ్ గణేష్, కంచర్ల జమలయ్య, జి.వీరస్వామి, ఎస్‌కె. ఫహీం, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి, నేరెళ్ల రమేష్, మండల రాజు, లక్ష్మి నారాయణ, రవికిరణ్ పాల్గొన్నారు.
**మావల:** ఆదిలాబాద్ సిపిఐ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉండాల రాములు, షేక్ బాషా, బత్తుల రామన్న తదితరులు పాల్గొన్నారు.
**కుత్బుల్లాపూర్ :** భగత్‌సింగ్ జయంతిని జగద్గిరిగుట్ట, ముక్దుంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు ఏసురత్నం, కె.స్వామి, ప్రవీణ్, కీర్తి, హైమావతి, శ్రీనివాస్, రాములు, బాబు, వెంకటేష్, సహదేవరెడ్డి, నరసయ్య, సురేష్, విజయ్, మహేందర్, శ్రీనివాస్, తెలంగాణ సోమన్న పాల్గొన్నారు.
**ఆత్మకూర్ (ఎం) :** మండలంలోని సిపిఐ మండల కార్యాలయంలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, నాయకులు ఉప్పల ముత్యాలు, మారుపాక వెంకటేష్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి నయీమ్, యాస బుచ్చిరెడ్డి, జల్ది రాములు, జక్క దయాకర్ రెడ్డి, బొబ్బల లాల్ రెడ్డి, మారుపాక అంజయ్య, మజ్జిగ నరసయ్య, అంబోజి రాములు,కొమ్ము కిష్టయ్య, అల్లంశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.
**వికారాబాద్ :** జిల్లా కేంద్రంలో భాగత్‌సింగ్‌జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ , సిపిఐ నాయకులు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్...


భద్రాచలం...


మేడ్చల్, కుత్బుల్లాపూర్...


యాద్రాద్రి...


హనుమకొండ...


వికారాబాద్..


ఆదిలాబాద్..

---

# నాలుగు లేబర్ కోడ్‌లు తేవటం దురదృష్టకరం

## సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషు మియా



**ప్రజాపక్షం/వరంగల్ :** కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తేవటం దురదృష్టకరమని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషు మియా అన్నారు. వరంగల్ శివనగర్ తమ్మెర భవన్‌లో ఎఐటియుసి వరంగల్ జిల్లా సమావేశం కందిక చెన్నకేశవులు అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా షేక్ బాషుమియా హాజరై మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం 1930 నుండి 1950 వరకు కార్మిక సంఘాలు అనేక పోరాటాలు చేసి కార్మిక చట్టాలను సాధించుకుంటే నేడు బిజెపి ప్రభుత్వం కార్మిక సంక్షేమ చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నూతన నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. అదాని, అంబానీలకు ఊడిగం చేస్తూ పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చే విధంగా కార్మిక శక్తిని బలహీనపరిచేందుకు నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమం, హక్కుల కోసం కార్మిక వర్గం రానున్న రోజులలో ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, గుండె బద్రి, తాళ్లపల్లి జాన్ పాల్, బొట్ల శ్రీనివాస్, ముప్పుల రవి, మియాపురం గోవర్ధన్, ఎండి.యాకోబ్ పాల్గొన్నారు.

# అధికార పార్టీకి ఎన్నికల సంఘం తాకట్టు

## సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
## సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ డిమాండ్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఎన్నికల వ్యవస్థను అధికార పార్టీకి తాకట్టు పెట్టిన చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ పేరుతో కోట్లాది మంది పేర్లను తొలగించే అధికారం జ్ఞానేష్ కుమార్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలపై దాడి చేయడమేనని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థను జ్ఞానేశ్ కుమార్ కేంద్రంలోని అధికార పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా మలిచే ప్రయత్నాలను కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందన్నారు. ఎన్నికల వ్యవస్థను అధికార పార్టీకి తాకట్టు పెట్టిన చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను రాజీనామా చేయాలన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, నిష్పక్షపాతత్వంపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టేందుకు ఓటర్ల తొలగింపునకు సంబంధించిన పూర్తివివరాలను బహిర్గతం చేయాలని విజయలక్ష్మి పండిత్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయ కులు అనంతయ్య, వెంకటేష్, అబ్దుల్లా, సురేష్ కుమార్, బాబు, యేసురత్నం, సావిత్రి, లక్ష్మి , మంగమ్మ, ఇలియాస్, అతిఖ్, నర్సిం, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.




## హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : రాష్ట్రంలో సివిల్ సప్లై హామీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సూర్యాపేట జిల్లా సివిల్ సప్లై హమాలీల పెండింగ్ బిల్లులను, గన్ని బ్యాగుల దిగుమతి బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 డిసెంబర్, 2026 జనవరి నుండి అనేక బిల్లులు పెండింగ్ ఉన్నప్పటికి పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. తక్షణమే వారి పెండింగ్ బిల్లులను చెల్లించడంతోపాటు వారికి ఈఎస్ఐ సౌకర్యంతోపాటు రూ.20లక్షల ప్రమాద భీమాను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజారామ్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, హమాలీ నాయకులు కొండలు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, లింగయ్య, గౌరీ నాయుడు, గోపి, మల్లయ్య పాల్గొన్నారు.

## భారత ఎన్నికల సంఘాన్ని రద్దు చేయాలి

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన తీర్పరి వెంకటేశ్వర్లు డిమాండ్




**ప్రజాపక్షం/నల్లగొండ** : ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు ప్రక్రియను బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్న కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో భగత్‌సింగ్ 119వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన ఎన్నికల సంఘాన్ని నిర్వీర్యం చేసి రాజకీయ కేంద్రంగా మార్చిందని ఆరోపించారు. ఎస్.ఐ.ఆర్. పేరుతో లక్షల ఓట్ల తొలగింపు వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని, దీన్ని యువత గమనించి పోరాడాలని కోరారు.ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏనమల నవీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని, భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నవీన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు గోపగోని ఉదయ్, గీత పనివారాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పబ్బు వీరస్వామి,అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు

మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : పట్టభద్రులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సతీసమేతంగా ఓటు హక్కు నమోదు చేసుకొని మాట్లాడారు. గతంలో ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్ లిస్టు పూర్తిగా రద్దు అయినందున ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం పాత, కొత్త ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎట్లుందో, ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పోరాటపటిమ ఎట్లా కొనసాగుతుందో పట్టభద్రులు తీర్పు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్ పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



**ప్రజాపక్షం/త్రిపురారం** : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ రాహుల్ వైద్య సిబ్బందికి సూచించారు.సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం గ్రంథాలయ భవనంలో వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. అక్కడికి వెళ్లి రికార్డులు, అందుబాటులో ఉన్న మందుల నిల్వలను పరిశీలించారు.నూతన గ్రంథాలయంలో వైద్య సేవలు నిర్వహించేందుకు వసతులు సరిగా లేవని,ఒకే గది కేటాయించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిబ్బంది డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందిస్తూ జిల్లా గ్రంథాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రెండు గదులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీ రంజిత్,మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వనిత,సీహెచ్‌వో వాసుదేవరెడ్డి,శారద కుమారి,కమల, గోపాల్ రెడ్డి,హైమావతి పాల్గొన్నారు.

## రైతులకు సకాలంలో రుణాలు

**ప్రజాపక్షం/బీబీనగర్** : పంటలు పండించే రైతులకు సకాలంలో రుణాలు అందిస్తామని పిఎసిఎస్ చైర్మన్ పొట్టోల శ్యామ్ గౌడ్ అన్నారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే యాసంగి పంటకు రైతులకు ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు సకాలంలో అందిస్తామని ఆయన తెలియజేశారు. అదేవిధంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ నివేదికను డైరెక్టర్ల ఆమోదంతో తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు ఉప్పలంచి శ్రీకాంత్, కట్ట పెంటమ్మ, రంగోల్ల శ్రీనివాస్, వంగూరు శివకుమార్, మైలారం నరసింహ, గండు బసవ యాదవ్, చెట్టి బాలమణి, అంబెపు బాలరాజ్, సురకంటి ధనపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఆయకట్టు రైతులను కాపాడేందుకు సాగర్ జలాల పొదుపు

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు.. 2028 జూన్ నాటికి పూర్తి

రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని మంత్రి ఉత్తమ్ వ్యాఖ్య



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేదల కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజాపాలనలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పౌరసరఫరాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎస్వీ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందచేసి నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్ నాయక్‌లతో కలిసి పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క సంక్షేమ పథకం కూడా సక్రమంగా అమలు కాలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన పేదలకు రేషన్ కార్డులు అందించడంతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.6 కోట్ల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని, మొత్తం 3.48 కోట్ల మంది రేషన్ కార్డుదారులకు నెలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. మరో సందర్భంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి ఒక్కొక్కరికి నెలకు ఆరు కిలోల సన్న బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో నీటి నిల్వ తక్కువగా ఉన్నప్పటికి భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చెరువులను నింపుతూ ప్రతి చుక్క నీటిని పొదుపుగా వినియోగిస్తున్నామని చెప్పారు. ఒకవైపు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని నిల్వ చేసుకుంటూనే మరోవైపు ఆయకట్టు రైతుల పంటలను కాపాడేందుకు సాగునీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నాగార్జున సాగర్ ఆయకట్టు కింద పంటలను కాపాడుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సాగర్ జలాశయంలో సరిపడా నీరు అందుబాటులో ఉండి కూడా పంటలకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం ఎందుకు ఉంటుందని మంత్రి ప్రశ్నించారు. ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయలేని పరిస్థితి ఏర్పడిందని, ప్రస్తుతం తాగునీటి అవసరాలతో పాటు పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. నాగార్జునసాగర్, మిర్యాలగూడ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాల పనులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం రూ.878 కోట్లతో శంకుస్థాపన చేసిన లిఫ్టులకు ఆ తరువాత ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.175 కోట్లను కేటాయించి పనులను వేగవంతం చేసిందన్నారు. ఎత్తిపోతల పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను 2028 జూన్ నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలనలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దేశ రాజకీయాలపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ దేశ ప్రధానమంత్రి అవుతారని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఓటు చోరీ జరుగుతోందని రాహుల్ గాంధీ బహిర్గతం చేశారని, దానికి వ్యతిరేకంగా ఆయన పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమణారెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సర్పంచులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాలంటే జ్ఞానేశ్ కుమార్ రాజీనామా

**ప్రజాపక్షం/రామన్నపేట** : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని సోమవారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. ఇతర ఎన్నికల కమిషనర్ల భిన్నాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకుంటున్న నిర్ణయాలు అధికార పక్షానికి అనుకూలంగా ఉన్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాలంటే జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలన్నారు. ఆయన రాజీనామా కోరుతూ జరుగుతున్న ప్రజా ఆందోళనలకు ఐలు సంఘీభావం ప్రకటిస్తుందని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన సార్వత్రిక వయోజన ఓటు హక్కును, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడటం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో ఐలు జిల్లాకమిటీ సభ్యులు ఎండి ఖయ్యూం, గడ్డం నరసింహ, శ్రీకాంత్,శ్రీశైలం ,కిరణ్ పాల్గొన్నారు.

# సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలి




మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట** : సిఈసి జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలని తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఏకపక్ష నిర్ణయాలు, అక్రమ మార్పులకు పాల్పడ్డారంటూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర నిరసన వ్యక్తమవుతుందని తెలిపారు. ఓట్ల చోరీకి సంబంధించిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం మరింత బలోపేతం అయ్యేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల హక్కులను కాపాడేందుకు ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌లు మాట్లాడుతూ ఓట్ల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టప్రకారం సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు తేలిన అనంతరం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, నాయకులు పోతు భాస్కర్, మొరిశెట్టి లక్షాది, చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

### భారత ప్రజాస్వామ్య వ్యవస్థను మోదీ, అమిత్ షా ఖూనీ చేస్తున్నారు

ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : భారత ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించి తక్షణమే అరెస్టు చేయాలని దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలు నాయక్ డిమాండ్ చేశారు.ఏఐసీసీ,టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి మహాధర్నా చేపట్టారు.అనంతరం జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి డీఆర్ఓకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ నేతలు మోదీ, అమిత్ షా ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్లను తొలగించారని, ఈ చర్య అనైతికమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు చామల శ్రీనివాస్,ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జిల్లపల్లి పరమేష్,ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి,ఎండి ముంతాజ్ అలీ, లింగాల వెంకన్న,దొండ రమేష్,గుడిపాటి లక్ష్మీనారాయణ,వేమన్ రెడ్డి,వెంకటేష్ గౌడ్,వెంకటయ్య యాదవ్ పాల్గొన్నారు.



# కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ఉత్తర్వులు జారీ చేసిన పట్టించుకోని పోలీసులు

ఇసుక అక్రమ రవాణాలో పోలీసుల తీరుపై అనుమానాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట** : అక్రమ ఇసుక రవాణాపై ప్రజాపక్షంలో వచ్చిన వార్తా కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ దానిని అడ్డుకునేందుకు తక్షణమే తనిఖీలు నిర్వహించాలని ఈనెల 26వ తేదీన జిల్లా మైనింగ్, పెన్‌పహాడ్, సూర్యాపేట, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల తహశీల్దార్లతోపాటు, మండల పోలీసు అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. అదేరోజు సాయంత్రం 5 గంటల లోపు నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను సూర్యాపేట రూరల్ పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకుండా బేఖాతర్ చేశారు. ఇతర ప్రాంతాల్లో కలెక్టర్ ఉత్తర్వుల ఆధారంగా జిల్లా మైనింగ్, రెవెన్యూ, ఆయా మండలాల పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేయగా సూర్యాపేట రూరల్ పోలీసులు ఎక్కడ కూడా కనపడలేదు. ఈ మండలంలో మూసీ పరివాహక ప్రాంతం ఎక్కువగా ఉండడంతో అక్రమ ఇసుక రవాణాకు అడ్డాగా మారింది. ఇక్కడ గతంలో పనిచేసిన అనేక మంది పోలీసు అధికారులపై ఈ అక్రమ ఇసుక రవాణా ఆరోపణలు పైనే ఉన్నతాధికారులు వేటు వేశారు. అయినా ఈ అక్రమ ఇసుక రవాణా ఏ మాత్రం ఆగడంలేదు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు అక్రమార్కులకు అంటకాగుతూ వారు ఇచ్చే నెలవారీ మామూళ్ళతో జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు ఇప్పటికి కూడా వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసి తక్షణమే తనిఖీలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిన సూర్యాపేట రూరల్ పోలీసుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనింగ్, రెవెన్యూ అధికారులు చేసిన తనిఖీల్లో మూసీ నుండి అక్రమంగా ఇసుకను తొవ్వి మాఫీయా డంప్‌లు చేయగా వాటిని సీజ్ చేశారు.

దీనిని బట్టి చూస్తే సూర్యాపేట మండలం మూసీ పరివాహక ప్రాంతంలో ఎంత పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతుందో ఇట్టే స్పష్టమవుతుంది. ఈ అక్రమ ఇసుక రవాణాదారులకు అండగా పోలీసులు నిలుస్తున్నారన్నది కూడా తేటతెల్లమవుతుంది. మైనింగ్, రెవెన్యూ అధికారులు నిర్వహించిన సంయుక్త తనిఖీల్లో సూర్యాపేట పోలీసులు పాల్గొనకపోవడంపై ఎస్ఐ యం. అనిల్ రెడ్డిని వివరణ కోరగా తమకు కలెక్టర్ నుండి ఎటువంటి ఆదేశాలు రాలేదంటూ చెప్పడం గమనార్హం.

## రూ.15 వేల లంచంతో ఎసిబి వలలో ఆర్ఐ

పంచనామా నివేదిక తహసీల్దార్‌కు సమర్పించేందుకు లంచం డిమాండ్

**ప్రజాపక్షం/నాంపల్లి** : వ్యవసాయ భూమికి సంబంధించిన పంచనామా నివేదికను తహసీల్దార్‌కు సమర్పించేందుకు లంచం డిమాండ్ చేసి,ప్రైవేట్ వ్యక్తి ద్వారా రూ.15 వేల నగదును స్వీకరిస్తున్న నాంపల్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)ను ఎసిబి అధికారులు పట్టుకున్నారు.ఆర్ఐకు సహకరిస్తున్న ప్రైవేట్ వ్యక్తిని కూడా ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎసిబి డి.ఎస్.పి జగదీష్ చందర్ వెల్లడించిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా నాంపల్లి మండల తహసీల్దార్ కమ్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాళ్లబండి గోపరాజు (ఏ1), ప్రైవేట్ వ్యక్తిగా పనిచేస్తున్న అద్దుల యాదగిరి (ఏ2) పై ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారుడికి చెందిన వ్యవసాయ భూమికి సంబంధించి తయారు చేసిన పంచనామా నివేదికను తహసీల్దార్‌కు సమర్పించేందుకు అధికారికంగా సహకరించడానికి లంచం డిమాండ్ చేసినట్లు ఎసిబి పేర్కొంది. లంచం వ్యవహారానికి సంబంధించి వారిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.అనంతరం నాంపల్లిలోని ఎస్‌పీఈఎసిబి కేసుల ప్రధాన ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగి లేదా ప్రజా సేవకుడు లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు ఎసిబి టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా తెలంగాణ ఎసిబిని సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల పేరు, వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.





## సమగ్ర అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నిడమనూరు:** నియోజకవర్గంలోని అన్ని గ్రామాల లో మౌలిక సౌకర్యాలు కల్పించి సమగ్ర అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని నాగార్జునసాగర్ శాసనసభ్యుడు కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు.సోమవారం మండల పరిధి గుంటుపల్లి గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని, కోటి 96 లక్షలతో గుంటుపల్లి నుండి సోమవారం గూడెం వరకు నిర్మించిన బిటి రోడ్డును ఆయన ప్రారంభించారు.ప్రారంభించడంతోపాటు శాన్విరా ఫౌండేషన్ సహకారంతో నిర్మించనున్న అదనపు తరగతి గదికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలిపాలని ఆయన కోరారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు తోడు స్వచ్ఛంద సంస్థలు తమ తమ గ్రామాల అభివృద్ధికి ముందుకు వచ్చి సహకార అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జంగాల కృష్ణయ్య, సీనియర్ నాయకులు మేరెడ్డి వెంకట రాహుల్,మేరెడ్డి కేశవరెడ్డి, ఎడవెల్లి వల్లభ రెడ్డి, మార్కెట్ చైర్మన్ సత్యం,మాజీ జెడ్పిటిసి నందికొండ రామేశ్వరి మట్టారెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింగ్ విజయకుమార్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనియెడల వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి, రెవెన్యూకి సంబంధించి 52 దరఖాస్తులు, డిపిఓ 5, డిఎంఅండ్‌హెచ్ఓ 4, డిడబ్ల్యుఓ 3, మిగిలిన 26 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవి మొత్తం 90 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, జిల్లా పరిషత్ సిఈఓ శిరీష, డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిఇఓ అశోక పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్ రావు

**ప్రజాపక్షం/యాదాద్రి** : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 83 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చినదరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 53, సర్వే ల్యాండ్స్ 9, డిఆర్‌డిఎ 5, మున్సిపాలిటీ 5 సివిల్ సప్లై 2, వ్యవసాయ, ఇరిగేషన్, ఉపాధి కల్పన, వైద్య ఆరోగ్య, ఎక్సైజ్, మత్య, యంపిడిఓ, హౌసింగ్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, డిప్యూటీ కలెక్టర్ కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి: ఎఐటియుసి



ప్రజాపక్షం/ములుగు: పెండింగ్‌లో ఉన్న వంట బిల్లులు, అల్పాహార బిల్లులను వెంటనే విడుదల చేయాలని, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ములుగు జిల్లా కమిటీ నాయకులు మంత్రి సీతక్కను ములుగు క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వంట కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ వంట బిల్లులు, అల్పాహార బిల్లులు విడుదల చేయడంతో పాటు సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంట కార్మికులు గున్నాల రాజకుమారి, మాలగాని కమలక్క, గుండెడ్డి శ్రీనివాస్, కొత్త పూలక్క, అంకం పద్మ, పాల్గొన్నారు.

## సమ్మె వాయిదా.. ఆదివారం డ్యూటీ సంగతేంటి?

ప్రజాపక్షం/నెక్కొండ: బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా పడటం ఖాతాదారులకు కొంత ఊరట కలిగించింది. అయితే సమ్మెకు ముందుగా సెలవు రోజైన ఆదివారం సైతం బ్యాంక్ ఉద్యోగులతో విధులు నిర్వహింపజేసిన నేపథ్యంలో మరో ప్రశ్న తెరపైకి వచ్చింది. ఆదివారం సెలవును ఉద్యోగులకు ఏ రోజున భర్తీ చేస్తారన్న విషయంపై మాత్రం యూనియన్లు, బ్యాంక్ ఉన్నతాధికారులు ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. సెలవు రోజున విధులు నిర్వహించిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ సెలవు ఎప్పుడు ఇస్తారన్న విషయాన్ని ముందుగానే ప్రకటించాల్సిన బాధ్యత యాజమాన్యంతో పాటు ఉద్యోగ సంఘాలపైనా ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సమ్మె వాయిదా అంశంపై ప్రకటనలు చేసిన యూనియన్లు, ఉద్యోగుల సెలవు విషయంపై మాత్రం ఎందుకు స్పష్టత ఇవ్వలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

## వేస్ట్ టు ఆర్ట్ ప్రదర్శన



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: స్వచ్ఛతా హి సేవా..2026 కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సోమవారం నిర్వహించిన వేస్ట్ టు ఆర్ట్ పోటీల్లో విద్యార్థులు రూపొందించిన సృజనాత్మక కళాకృతులు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వ్యర్థ పదార్థాలను వినియోగించి పునర్వినియోగ్యం రూపొందించిన అలంకరణ వస్తువులు, బొమ్మలు, మొక్కల కుండీలు తదితర కళాఖండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసి కమిషనర్ టి వెంకన్న, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ తదితరులు విద్యార్థులు ఏర్పాటుచేసిన కళాకృతుల ప్రదర్శనను పరిశీలించి, వారి సృజనాత్మకతను అభినందించారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు, ఉపాధ్యాయులు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్లు పసునూరి భాస్కర్, గోల్కొండ శ్రీను సురేందర్‌లతో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్లు భీమయ్య, భాస్కర్ నాయక్, రాజు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములకు హద్దుల ఏర్పాటు: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



ప్రజాపక్షం/కాజీపేట: ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు.కాజీపేట మండలం మడికొండ గ్రామంలో క్రైస్తవ, ముస్లిం మతస్తులకు స్మశాన వాటికల కేటాయింపునకు ప్రతిపాదించిన స్థలాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలు, భూమి విస్తీర్ణం, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి తదితర అంశాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.స్మశాన వాటిక కేటాయింపునకు సంబంధించి అవసరమైన స్థల పరిశీలన, రికార్డుల పరిశీలన పూర్తి చేసి, అవసరమైన ప్రతిపాదనలను నిబంధనల ప్రకారం సమర్పించాలని ఆర్డీఓ వెంకటేష్, కాజీపేట తహసీల్దార్ రాజులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూములకు సంబంధించిన ఖాళీ ప్రదేశాలను గుర్తించి, వాటి చుట్టూ స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో ఆర్‌డిఒవెంకటేష్, కాజీపేట తహసీల్దార్ రాజు, రెవెన్యూ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలుకలు కరిచిన ఆనవాళ్లు లేవు... వదంతులను నమ్మవద్దు : కలెక్టర్



ప్రజాపక్షం/పాలకుర్తి: పాలకుర్తి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచినట్లు వచ్చిన వదంతులను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల చేతులు, కాళ్లను పరిశీలించగా ఎలుకలు కరిచిన ఆనవాళ్లు, గీతలు కనిపించలేదన్నారు. పాఠశాలలోని వంటశాల, భోజనగది, సరుకుల నిల్వగది, మరుగుదొడ్లు, విద్యార్థుల గదులను కలెక్టర్ పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా బయటి వ్యక్తులను పాఠశాలలోకి అనుమతించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ సరస్వతి, ఎంపీడీవో వేదవతి, వైస్ ప్రిన్సిపల్ వరలక్ష్మి , ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు..

# 'తొలిముద్ద'తో పోషక భరోసా

బాల్యంలోనే పౌష్టికాహారంతో ఆరోగ్యకర భవిష్యత్తుకు బాటలు: మంత్రి సీతక్క




ప్రజాపక్షం/ములుగు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు బాల్యంలోనే సంపూర్ణ పౌష్టికాహారం అందించి ఆరోగ్యకర భవిష్యత్తుకు బాటలు వేయడమే 'తొలి ముద్ద' కార్యక్రమం లక్ష్యమని మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. సోమవారం ములుగు ఐడిఓసిలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తొలిముద్ద' అల్పాహార కార్యక్రమాన్ని కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావుతో కలిసి ప్రారంభించారు. 3 నుండి 6 ఏళ్ల చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన పోషకాహారం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ములుగుతో పాటు ఎంపిక చేసిన ఆరు జిల్లాల్లో అమలు చేస్తున్నామని చెప్పారు. అక్టోంబర్ 1 నుండి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గుడ్డుతో పాటు ఒక రోజు ఉప్మా, మరో రోజు కిచిడీ అందిస్తామని వెల్లడించారు. పిల్లలను ఆటలాడిస్తూ, పాటలు పాడిస్తూ ఉత్సాహపరిచేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లను కోరారు.

**అంగన్‌వాడీలకు సొంత భవనాలు**

సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సీతక్క ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన భవనాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కేంద్రాలకు బీరువాలు, బల్లలు, తాగునీరు, తదితర మౌళిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా ఉన్నతీకరించామని, అర్హులకు పదోన్నతులు కల్పించామని తెలిపారు. ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు. కలెక్టర్ హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ములుగు జిల్లాను 'తొలిముద్ద' కార్యక్రమానికి ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. అనంతరం మంత్రి, కలెక్టర్ కలిసి అంగన్‌వాడీ టీచర్లకు 'తొలిముద్ద' అల్పాహార సామాగ్రిని అందజేశారు. చిన్నారులకు మంత్రి, కలెక్టర్ స్వయంగా అల్పాహారం తినిపించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, అధికారులు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వ తోడ్పాటు**

మహిళలను ఆర్థికంగా స్వావలంబనలను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు మండలం జగ్గన్నపేటలో సోమవారం కలెక్టర్ హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ప్లాంట్లను ప్రారంభించారు. జగ్గన్నపేటలో 82 ఇళ్లకు సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అర్హత గుర్తించినట్లు మంత్రి తెలిపారు. అనంతరం రూ.10లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మహిళా గ్రామ సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. మహిళా సంఘాలకు కుట్టుమిషన్లు, శిక్షణ అందించి పాఠశాల, అంగన్‌వాడీ దుస్తుల తయారీ పనులు అప్పగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఢిల్లీ వేదికగా జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మూడవ స్థానం సాధించిన జగ్గన్నపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను మంత్రి అభినందించి పతకాలు అందజేశారు. వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు అజ్మీరా రాజునాయక్‌ను సన్మానించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మండ అనసూయ నేటి తరానికి ఆదర్శప్రాయురాలు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/హసన్ పర్తి : స్వాతంత్ర సమరయోధురాలు కమ్యూనిస్టు పార్టీ క్రియాశీల సభ్యురాలు మండ అనసూయ నేటి తరానికి ఆదర్శప్రాయురాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో మండ అనసూయ మృతి చెందగా ఆమె భౌతిక దేహంపై ఎర్రగుడ్డ కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తున్న క్రమంలో అనసూయ కుటుంబం పార్టీ అగ్రనాయకత్వానికి, కార్యకర్తలకు అండగా నిలిచింది అన్నారు. పేద ప్రజల హక్కుల కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న సమరశీల పోరాటాలలో ధైర్య సాహసాలతో, త్యాగనిరతితో నిలిచినందుకు అనసూయ హోటల్‌ను దుండగులు తగులబెట్టడం జరిగినా, మడమ తిప్పని విప్లవ నారి అమరజీవి మండ అనసూయ అని తెలిపారు.పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ప్రతిఘటన పోరాటాలలో ప్రజలు పాల్గొనడం ద్వారానే అనసూయకు ఘనమైన నివాళులు అర్పించినట్లు అని తెలిపారు.అనసూయ భౌతిక దేహంపై పుష్పగుచ్చాలు సమర్పించి జోహార్లు తెలిపిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి,గోలి రాజిరెడ్డి, నేదునూరి రాజమౌళి, మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, ముజ్జిగ పరూష రాములు, గోపు బుచ్చిరెడ్డి, మెట్టు జక్కిరెడ్డి, గోపరాజు భద్రయ్య, నాంపల్లి లక్ష్మయ్య, కొత్తగట్టు శ్యాంసుందర్ కల్వచర్ల సుదర్శన్,గోలి సురేందర్ రెడ్డి రవీందర్ రెడ్డి, నేదునూరి సాంబయ్య, రేణికుంట్ల చిరంజీవి, వీరమల్లు,ముజ్జిగ అజయ్, శ్యాంసుందర్ రెడ్డి రాజి రెడ్డి, కుటుంబ సభ్యులు మండ సారంగపాణి, సదాలక్ష్మి , మండ చంటయ్య,మండ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# 'ఓటు చోరీ'పై కాంగ్రెస్ పోరాటం ఇప్పటితో ఆగదు

భారీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి కావ్య, ఎమ్మెల్యేలు,




ప్రజాపక్షం/హనుమకొండ :ఎఐసిసి ఆదేశాల్ల మేరకు, కేంద్ర ఎన్నికల సంఘంలో ఎస్ఐఆర్ లో జరిగిన ఓటు చోరీ అక్రమాలకు వ్యతిరేకంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య,ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి,డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులకు పాల్పడిన సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి వరంగల్ ఎంపి డా క్టర్ కడియం కావ్య భారీ ర్యాలీతో హనుమకొండ కలెక్టరేట్ వరకు తరలివచ్చారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఇసిజ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు .ఈ సందర్భంగా ఎంపి కడియం కావ్య మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓటు హక్కును దెబ్బ తీసే ప్రయత్నాలను సహించేది లేదని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. 'ఓటు చోరీ'పై కాంగ్రెస్ పోరాటం ఇప్పటితో ఆగదని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం కొనసాగుతుందని అన్నారు. మామునూరు విమానాశ్రయం, ఒఆర్‌ఆర్, కోచ్ ఫ్యాక్టరీ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ఓటు హక్కు, రాజ్యాంగం, అంబేడ్కర్ ఆశయాలు, పిల్లల భవిష్యత్తును కాపాడటమే కాంగ్రెస్ పోరాటమని ఎంపి కడియం కావ్య అన్నారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సిఇసిజ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ వ్యవహారంపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్, మండల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఆర్‌జిపి ఆర్ఎస్ నాయకులు, విద్యార్థి, యువజన విభాగాల ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిఇసి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం

సిఇసి ఏకపక్ష ధోరణికి వ్యతిరేకంగా పోచమ్మమైదాన్ సెంటర్‌లో పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన



ప్రజాపక్షం/ వరంగల్ : కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాడలని డిమాండ్ చేస్తూ ఎఐసిసి, టిపిసిసి ఆదేశాల మేరకు సోమవారం వరంగల్ పోచం మైదాన్ సెంటర్‌లో వరంగల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కూడా చైర్మన్ గుండు సుధారాణిలు నిరసన వ్యక్తం చేసి, దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం పాటించాలని, పెద్ద ఎత్తున జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని పార్టీ శ్రేణులు డి మాండ్ చేశారు.ప్రజల ఓటు హక్కును కాలరాయాలని చూస్తే చూస్తూ ఊరుకో బోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒబిసి సెల్ అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవీందర్ నాయక్, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, మండల అధ్యక్షులు దాడి శివ, ఎండ్ల రవికుమార్, పోశాల వెంకన్న, ఇస్లావత్ సావిత్రి, రవీందర్ రెడ్డి, వర్ధన్నపేట టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, డివిజన్ అధ్యక్షులు జన్ను అరుణాకర్, సయ్యద్ ఇంతియాజ్, మాడుగుల రాజ్ కుమార్, పసునూరి శ్రవణ్, మొహమ్మద్ జానీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు , మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రజాపక్షం/భూపాలపల్లి : కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. ఎఐసిసి,పిసిసి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరైనారు.సర్ ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌డిఒ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ అయితే ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజాబాబు, దాట్ల శ్రీనివాస్, దేవన్, బుర్ర కొమురయ్య, అంబాల శీను, చల్లూరు మధు, మండల అధ్యక్షులు రామినేని రవీందర్, భాస్కరరావు, పున్నం రవి , ఓం ప్రకాష్ అనిల్ కృష్ణారెడ్డి, జంగిటి శ్రీనివాస్, జాడి రాజయ్య, సుందర్, వెంకీ యాదవ్, పరమేశ్వరి, లక్ష్మి ముత్యాల రాజయ్య, పంతకాని సమ్మయ్య ప్రేమ్ కుమార్, అంగజాల అశోక్, దొంతుల శీను, కౌన్సిలర్లు స్వామి, సహదేవ్, అరుణ్ రావు, బౌద్ధ రాజేష్, శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు పృధ్వి చరణ్, శివ, సేవాదళ్ నాయకుడు ఏకు రవి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి జ్యోతి రెడ్డి, కోమల పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## సిఇసి జ్ఞానేష్‌కుమార్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి

కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ




ప్రజాపక్షం /జనగామ : చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలని తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. ఎఐసిసి, టిపిసిసి పిలుపు మేరకు సోమవారం కాంగ్రెస్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ పార్కు నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వయించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్ వద్ద చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాకు జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న కడియం శ్రీహరి మాట్లాడారు. బిజెపి అప్రజాస్వామికంగా, దొడ్డి దారిన అధికారంలోకి వస్తుందన్నారు. జ్ఞానేష్ కుమార్ గతంలో అనేక అవినీతి ఆరోపనలు ఉన్న వ్యక్తి అని, నరేంద్ర మోదీ తన స్వప్రయోజనాల కోసం రాజ్యాంగబద్ధమైన సిఇసి పదవిలో కూర్చొబెట్టారన్నారు. జ్ఞానేష్ కుమార్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను స్వయంగా ఎన్నికల సంఘంలోని మరో ఇద్దరు సభ్యులు ఆధారాలతో బయట పెట్టారన్నారు. ప్రజాస్వామ్య రక్షణ, రాజ్యాంగ హక్కుల్ని విస్మరించిన జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి, జనగామ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఓటు చోరీ అక్రమంగా అధికారంలోకి వస్తున్నారని మండిపడ్డారు. దేశ వ్యాప్త నిరసనల నేపథ్యంలో వెంటనే జ్ఞానేష్ కుమార్‌ను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి కుట్ర పూర్తితంగానే ఓట్లు చోరీ చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, యాదాద్రి లక్ష్మి నర్సింహ్మాస్వామి ట్రస్ట్‌బోర్డు సభ్యులు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్, మున్సిపల్ ఛైర్మన్‌లు కడకంచి బాల మణి శ్రీనివాస్, తాటికొండ వినయ్‌కుమార్, మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, కొమురవెల్లి దేవస్థానంచైర్మన్ గంగం నర్సింహ్మారెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, వైస్ ఛైర్మన్ కంచె రాములు, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, గుడి వంశీదర్‌రెడ్డి, ఉడుత రవి, నూకల బాల్‌రెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు దోర్నాల వెంకటేశ్వర్లు, బోనాసి క్రాంతికుమార్, మేడ శ్రీనివాస జాయ మల్లేష్, జిల్లెల సిద్దారెడ్డి, చింతకింది మల్లేష్, వేమళ్ల పద్మ, వంగాల కళ్యాణి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 17నుంచి వట్టివాగు సమ్మక్క సారలమ్మ మినీ జాతర



ప్రజాపక్షం/గూడూరు;మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల వట్టివాగు గ్రామంలో కొలువైన సమ్మక్కసారలమ్మ దేవతల మినీ జాతర తేదీలను ఆలయ జాతర కమిటి చైర్మన్ కారం లక్ష్మ య్య ప్రధాన కార్యదర్శి ఈసం సహాదేవులు ఆలయ ప్రధాన పూజారి దారం సిద్ధు అధికారికంగా ప్రకటించింది. వచ్చే 2027 ఫిబ్రవరి నెలలో నాలుగు రోజుల పాటు ఈ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.జాతర వివరాలు పూజా కార్యక్రమాలు ఫిబ్రవరి (బుధవారం)17న అమ్మవార్లకు పసుపు కుంకుమ మార్చుకొనుట (గురువారం) 18న గుడి మెలుగుట (శుక్రవారం) 19న భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుట (శనివారం) 20న ముగింపు కార్యక్రమం నిర్వహించుస్తునుట్లు తెలిపారు.

**భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం: కారం లక్ష్మ య్య**

ఫిబ్రవరి మాసంలో అంరరంగ వైభవంగా జరగనున్న వట్టవాగు సమ్మక్క సారలమ్మ మినీ మేడారం జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నామని జాతర కమిటి చైర్మన్ కారం లక్ష్మ య్య స్పష్టం చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణనే విశిష్ట గుర్తింపుపొందిన వట్టవాగు జాతరకు మహబూబాబాద్ జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి వరంగల్ ఖమ్మం తదితర పోరుగు జిల్లాల నుంచి కూడా భక్తులు లక్షలాదిగా తరలివచ్చే అవకాశం ఉందని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి అమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు ఇబ్బందులు తలెత్తకుండా జాతర కమిటి ఆధ్వర్యంలో పకడ్బందీ ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. జాతర ప్రాంగణంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకోని నిరంతరాయ విద్యుత్ దీపాలు పారిశుద్ధ్యం,భద్రతపరమైన అన్ని మౌలిక వసతులను సమగ్రంగా సమకూరస్తున్నామని కారం లక్ష్మ య్య వివరించారు. జాతర విజయవంతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, జాతర పరిసరాల్లో మరిన్ని శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆర్థిక వనరుల ఆవశ్యకత ఉందని గుర్తుచేశారు. అమ్మవారి సన్నిధిలో అభివృద్ధికార్యక్రమాలు నిరంతరం కొనసాగాలంటే పెద్ద ఎత్తున దాతలు ప్రజా ప్రతినిధులు వ్యాపార ప్రముఖులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని చైర్మన్ కారం లక్ష్మ య్య విజ్ఞప్తి చేశారు. అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు సమన్వయంతో పని చేసి జాతరను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు వాసం భద్రయ్య తాటి సుధాకర్ వాసం రమేష్ దారం సాంబరాజ్ సనప వీరస్వామి పూనెం జనార్ధన్ దారం నరేష్ సిద్ధ బొయిన పోతయ్య కోట్టెం వజ్జయ్య పెనక పాపయ్య పోడుగు వీరభద్రం నూనెం అశోక్ కొర్ణ గోవర్ధన్ బిజ్జ బుచ్చయ్య ఈసం భద్రయ్య ఈసం జయమ్మ తదితరులు పాల్గోన్నారు.

## క్రీడలతోనే ఆత్మవిశ్వాసం... నాయకత్వ లక్షణాలు

ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్,
ఎమ్మెల్సీ రవీందర్‌రావు

ప్రజాపక్షం/మహబూబాబాద్: క్రీడలతో విద్యార్థులకు ఆత్మవిశ్వాసంతోపాటుగా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కళ్ళపల్లి రవీందర్‌రావు అన్నారు.70వ, ఎజిఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా 17 సంవత్సరాల బాలబాలికల, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల ప్రారంభ కార్యక్రమం ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన క్రీడల ప్రారంభోత్సవ సభలో క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి, వాసిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, మాట్లాడుతూ రెండు రోజులు జరిగే ఈ టోర్నమెంట్లో, మహబూబాబాద్ జిల్లా ఆరు జోన్ల నుండి దాదాపు 1000 మంది క్రీడాకారులు,వ్యాయామ విద్య ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని, వారందరికీ ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నామని, అలాగే గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్స్ ట్రోఫీ ప్రధానం చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి రమేష్ నాయక్, 13వ వార్డ్ కౌన్సిలర్ కాట భాస్కర్, డిఎస్‌పి తిరుపతిరావు, జిల్లా సైన్స్ అధికారి,అప్పారావు, డివైస్‌ఒ. జ్యోతి, క్రీడా పోషకులు జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కొమ్ము రాజేందర్, శంకర్ నాయక్, అవారి శ్రీనివాస్, చాంప్ల నాయక్, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, పిల్లి కాశీనాథ్, కమల్ కిషోర్, జి బిక్షపతి, జక్కి నాగేశ్వర్, బొజ్జ సురేందర్, కొమురయ్య, దామల విజయ్ చందర్, లక్ష్మి , మాధవి, వరప్రసాద్, పుష్పలీల, గీత, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు పోరాడాలి

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 90 ఏండ్ల చరిత్ర ఏ విద్యార్థి సంఘానికి లేదని, స్వాతంత్ర్య ఉద్యమంలో పురుడు పోసుకుని దేశ స్వాతంత్ర్యం, దేశ భద్రత, శాస్త్రీయ విద్య లక్ష్యాలుగా చదువుతూ పోరాడు.. చదువుకై పోరాడు అన్న నినాదం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావం జరిగిందని తెలిపారు. కమ్యూనిస్టు భావజాలాన్ని పునికిపుచ్చుకున్న కామ్రేడ్ షహీద్ భగత్ సింగ్ వారసత్వంతో ఏఐఎస్ఎఫ్ పుట్టిందని, దేశంలో ప్రథమ విద్యార్థి సంఘం అయిన ఏఐఎస్ఎఫ్ లో నెహ్రూ, అటల్ జీ లాంటి వారు పని చేశారని తెలిపారు. నాటి నుండి నేటి వరకు ఏఐఎస్ఎఫ్ శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడుతున్నదని, ఏఐఎస్ఎఫ్ లో పని చేసిన వారు ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. నేడు విద్యా రంగం పలు సమస్యలను ఎదుర్కొంటున్నదని, విద్యార్థి లో కాన్ని నిర్వీర్యం చేసేలా పాలకుల విధానాలు కొనసాగుతున్నాయని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యా రంగంలో కాషాయీకరణ చొప్పిస్తూ విద్యార్థులలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదని విమర్శించారు. విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థుల నుండి రేపటి నవతరం నాయకులు తయారు కావాలని, అందుకు విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. వరంగల్ లోని ఆర్ఈసి నుండి ఒకప్పుడు ఎంతో మంది నాయకులు తయారై సమాజానికి సేవలందించారని గుర్తు చేశారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే ప్రతి కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జెండా ఎగురాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతో శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారు కావాలని, భగత్ సింగ్ వారసులుగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా మహాకవి శ్రీశ్రీ, వివేకానందుడి బోధనలను ఆయన ఉటంకిస్తూ సమాజాన్ని బాగు చేసే ముందు యుగం దూతలుగా విద్యార్థులు ఎదగాలని అన్నారు.

**ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగి రాజన్**

భారత రాజకీయాల్లో పాలకుల విధానాలను మార్చే శక్తి విద్యార్థులదేనని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగి రాజన్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవం బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ భగత్ సింగ్ వారసులైన విద్యార్థుల శక్తి జెన్ జీ ఉద్యమంగా మారిందని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ పాలన కొనసాగిస్తూ విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. చివరకు ఎన్నికల కమిషన్ ను ప్రయోగించి విద్యార్థి, యువ జనుల ఓటు హక్కును దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ను ఆ పదవి నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఇందుకోసం రియల్ హీరో లైన భగత్ సింగ్, బీఆర్ అంబేద్కర్, బిర్సాముండా లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



**హనుమకొండలో వేలాది మందితో విద్యార్థి మహా ప్రదర్శన**

ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల సందర్భంగా హనుమకొండలో వేలాది మంది విద్యార్థులతో మహా ప్రదర్శన నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల మొదటి రోజు సోమవారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుండి కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. వివిధ విద్యా సంస్థల నుండి విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు భారీగా తరలి రావడంతో ప్రదర్శన విద్యార్థుల నినాదాలతో హోరెత్తింది. అనంతరం కేయూ ఆడిటోరియంలో జరిగిన సభలో ప్రజానాట్యమండలి కళాకారులు విద్యార్థులను ఉత్తేజ పరుస్తూ పాటలు పాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి,ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, పుట్టా లక్ష్మణ్,రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్, హనుమకొండ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్, వరంగల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదెళ్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

**ఏఐఎస్ఎఫ్ తొంబై ఏండ్ల పాట ఆవిష్కరణ**

అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు రచించిన ఏఐఎస్ఎఫ్ 90 ఏండ్ల పాటను సోమవారం విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాల బహిరంగ సభ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా పాట సీడీని ఆవిష్కరించారు. ఈ పాటను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా బృందం గానం చేసింది. ఈ కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో పాటు సిపిఐ జిల్లా నాయకులు, ఏఐఎస్ఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.




---

విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 - AK47' చిత్రం నుంచి అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మొదటి గీతం 'నారాయణమ్మ' విడుదలైంది. తమన్ ఎస్ స్వరాలు సమకూర్చిన ఈ హుషారైన పాటను ప్రభ, రామ్ మిరియాల ఆలపించారు.

## రీల్

# 'తత్వం'లో నటించడం లక్కీగా ఫీలవుతున్నా..



హీరోయిన్ దష్విక

దినేష్ తేజ్, దష్వీక.కె హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తత్వం'.అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో శీమకుర్తి వంశీ కృష్ణ , శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్టోబర్ 2న చిత్రం థియేటికల్ విడుదలకు సిద్దమైంది. ఈ సందర్భంగా సోమవారం కథానాయిక దష్వీక. మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నా పేరు దష్వీక.కె . నా స్వస్థలం వైజాగ్. ఇది నా తొలిసినిమా.. సినిమా హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వాలనే ప్రయత్నంలో ఉన్న టైమ్‌లో సినిమా అవకావం వచ్చింది. తత్వం.. అడిషన్స చేసి సెలక్ట్ చేశారు. గతంలో నేను హీరో విజయ్ దేవరకొండతో కలిసి ఓ వాణిజ్య ప్రకటనలో నటించాను. ఫస్ట్ ప్రాజెక్ట్‌లోనే ఓ హీరోయిన్‌కు నటనకు స్కోప్ ఉన్న పాత్ర దొరకడం లక్కీగా ఫీలవుతున్నాను. నాకు ఈ మూవీలో కథ వినగానే ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఎమోషన్ ఉన్న పాత్ర ఇది. నా పాత్రలో గ్రే షేడ్స్ ఉంటుంది. బట్ అందరికి నచ్చే పాత్ర అది. ఇంతకు మించి ఇప్పుడు రివీల్ చేయకూడదు. సాఫ్ట్ కైండ్ ఆఫ్ గర్ల్.. హీరోకు సపోర్ట్గు ఉండే పాత్ర. కిల్లర్ను అన్వేషణలో హీరోకు సపోర్ట్ చేస్తూ ఉంటే పాజిటివ్‌గా ఉండే పాత్ర నాది . జనరల్‌గా మలయాలంలో ఇలాంటి స్టోరీలు వస్తుంటాయి. తెలుగులో కూడా ఇలాంటి కథతో సినిమా రావడం ఆనందంగా అనిపించింది. బోరింగ్‌గా ఉండదు. ఇదిమర్డర్ మిస్టరీ సస్పెన్స్.. ఎక్కడా ఎలాంటి పాయింటోలు ఉండాలో అవి ఉంటాయి. పర్సనల్‌గా నేను కూడా షై కాబట్టి ఈ సినిమాలో నా పాత్ర హెల్ప్ అయ్యింది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో కథ కొనసాగుతుంది. చిన్నప్పటి నుంచి నాకు యాక్టింగ్ ఇష్టం. మూడో తరగతిలోనే నేను నటిని అవుతానని మా టీచర్‌కు చెప్పాను. సినిమా, మోడలింగ్ అంటే ఇష్టం. అమ్మ నాన్న కోరిక మేరకు స్టడీస్ కంప్లీట్ అయిన తరువాత సినిమాలోకి అడుగుపెట్టాను. ఇప్పుడు అమ్మ నాన్న సపోర్ట్ ఉంది.యాక్టింగ్ ట్రైనింగ్ మహతి బిక్షు దగ్గర తీసుకున్నాను. వచ్చే ముందు భయపడ్డాను. టెన్షన్ పెడ్డాను. అయితే ఏదైనా మనం మేనేజ్ చేస్తూ ఏ ఫీల్డ్‌లోనైనా ఎదగాలి అని అర్థమయింది.. నా విషయంలో అంతా కూలింగ్ గోయింగ్లా జరిగింది. బయట అనుకున్నంతా బ్యాడ్ ఏమీ లేదుకథ, కథనాలతో పాటు చేతన భరద్వాజ్ సంగీతం ఆర్ఆర్ హైలైట్‌గా ఉంటుంది. చాలా డిఫరెంట్ టైటిల్. మొదట్‌లో జనాలకు నచ్చుతుందో లేదొ అని అందరం భయపడ్డాను. కానీ అందరి నుంచి మంచి పాజిటివ్ ఫీడ్బ్యాక్ వచ్చింది. టైటిల్లాగా సినిమా కూడా ఖచ్చితంగా డిఫరెంట్‌గా ఉంది అని అక్టోబర్ 2 తరువాత అందరూ అంటారు. అన్ని తరహా పాత్రలు ముఖ్యంగా లవ్‌స్టోరీస్ చేయాలని ఉంది.నటనకు ఆస్కారమున్న పాత్రలను ఎంపిక చేసుకుంటాను. నవంబరులో తమిళ సినిమా ప్రారంభమవుతుంది. తెలుగులో కూడా కొన్ని ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయి.

# 'నారాయణమ్మ' పాట విడుదల



విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 AK47' చిత్రం నుంచి అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మొదటి గీతం 'నారాయణమ్మ' విడుదలైంది. తమన్ ఎస్ స్వరాలు సమకూర్చిన ఈ హుషారైన పాటను ప్రభ, రామ్ మిరియాల ఆలపించారు. సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి ఈ పాటకు సాహిత్యం అందించారు.'నారాయణమ్మ' పాటలో డింపుల్ హయాతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్, వైబ్రెంట్ స్క్రీన్ ప్రజెన్స్‌తో పాటకు జోష్ తీసుకొచ్చారు. ఆమెతో పాటు విక్టరీ వెంకటేష్, శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్ కూడా సందడి చేసి, పాటను విజువల్ ట్రీట్ గా మార్చారు. మొత్తంగా 'ఆదర్శ కుటుంబం' సినిమా కుటుంబ చిత్రంగా ఏ స్థాయి వినోదాన్ని అందించబోతుందో తెలిపేలా ఈ 'నారాయణమ్మ' గీతం ఉంది. 'నారాయణమ్మ' గీతావిష్కరణ ఘనంగా జరిగింది. వెంకటేష్ మాట్లాడుతూ నారాయణమ్మ సాంగ్ లాంచ్ కి విచ్చేసిన అభిమానులకు, మీడియా మిత్రులకు ధన్యవాదాలు. దాదాపు 20 ఏళ్ళ తర్వాత త్రివిక్రమ్ తో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలు క్లాసిక్ లవ్ స్టోరీలు. అలాంటి సినిమాల తర్వాత ఇప్పుడు త్రివిక్రమ్ మరో అద్భుతమైన కథను తీసుకొచ్చారు. ఇందులో ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్, సెంటిమెంట్ అన్నీ ఉంటాయి. ట్రీట్మెంట్ కొత్తగా ఉంటుంది. మీరు ఊహించని ట్విస్టులు ఉంటాయి అని అన్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ నా జీవితంలో మొట్ట మొదటి డైలాగ్ రాసింది వెంకటేష్ సినిమాకెనని అన్నారు. వెంకటేష్ అంటే భక్తి తో కూడిన భయం కూడా ఉందని అన్నారు.

# రావణుడిగా యష్ పోస్టర్ రిలీజ్



నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, 8 సార్లు ఆస్కార్ అవార్డు గెలుచుకున్న డిఎన్ ఇ జీ యశ్కు చెందిన మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'రామాయణం'లో రణ్బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న నమిత్ మల్హోత్రా 'రామాయణ' ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి. సినిమా నుంచి వస్తున్న ప్రతి కొత్త అప్డేట్‌తో అంచనాలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో.. తాజాగా రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్న ఫస్ట్ అఫీషియల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆయన పోషిస్తున్న లార్జర్ ద్యాన్ లైఫ్ రావణుడి అవతార్ను పవర్ఫుల్‌గా చూపించారు. ఈ ఐకానిక్ పాత్రపై మరింత ఆసక్తిని పెంచుతున్నారు. ఈ చిత్రంలో రణ్బీర్ కపూర్ శ్రీరాముడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబె లక్ష్మణుడిగా నటిస్తున్నారు. ఈ సినిమా భారత్‌లో హిందీ, తమిళ్, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఐ మ్యాక్స్ లో విడుదల కానున్న 'రామాయణం పార్ట్ 1' 2026 దీపావళికి, 'రామాయణం పార్ట్ 2' 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

---

ఆసియా క్రీడలు–2026లో మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో రజత పతకం సాధించిన తెలంగాణకు చెందిన ఏస్ షూటర్ ఈషా సింగ్‌కు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించడం తెలంగాణకు, దేశానికి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. కఠినమైన పోటీలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి పోడియంపై నిలిచిన ఈషా సింగ్‌ను మంత్రి అభినందించారు.

# స్వేచ్ఛ, వాణిజ్యంతో రైతు, కూలీలకు ప్రమాదం

**మోదీవి వ్యవసాయ వ్యతిరేక విధానాలు**

**ఎఐకెఎంఎస్ జాతీయ మహాసభల్లో అశిష్ మిట్టల్**




**ప్రజాపక్షం/ఖమ్మం :** స్వేచ్ఛ, వాణిజ్యం పేరుతో దేశంలోని రైతులు, కూలీలకు ప్రమాదం పొంచి ఉందని స్వేచ్ఛ, వాణిజ్యం ఈ దేశానికి అత్యంత ప్రమాదకరమని అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డా॥ అశిష్ మిట్టల్ తెలిపారు. చారిత్రాత్మక రైతాంగ ఉద్యమాలతో నల్ల చట్టాల విషయంలో వెనక్కి తగ్గిన మోడీ స్వేచ్ఛ, వాణిజ్యం పేరుతో మరో రూపంలో సాగు రంగానికి ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నారని ఆయన తెలిపారు. అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ జాతీయ మహాసభలను పురస్కరించుకుని సోమవారం ఖమ్మంలో భారీ రైతాంగ ప్రదర్శనను నిర్వహించారు. పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానం వరకు సాగింది. ఎస్ఆర్అండ్‌బిజిఎన్ కళాశాల వద్ద వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో అశిష్ మిట్టల్ మాట్లాడుతూ కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని అప్పగించడం ద్వారా మోడీ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయాలనే కుట్రలో ఉన్నారని ఆ కుట్రను ఐక్య రైతాంగ ఉద్యమాల ద్వారా ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రంలో ల్యాండ్ మాఫియాకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉంటుందని ఆయన అన్నారు. మోడీ రైతులపై కార్చేసి ముసలి కన్నీరు మాత్రమేనని రైతులకు ఎక్కువ ధరకు కరెంటు ఇస్తూ కార్పొరేట్లు, పారిశ్రామిక వేత్తలకు తక్కువ ధరకు విద్యుత్‌ను అందిస్తున్నారని మిట్టల్ ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలు మోడల్ పేరుతో వ్యవసాయ రంగాన్ని కబళించేందుకు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. నల్ల చట్టాలను ఎదుర్కొన్న విధంగానే స్వేచ్ఛ, వాణిజ్యం కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడతామని మిట్టల్ స్పష్టం చేశారు. మోడీ విధానాలు దేశ ఆర్థిక అస్థిరతకు దోహదం చేస్తాయన్నారు. గిరిజనుల, ఆదివాసీల, రైతుల భూ సమస్యలు, గిట్టుబాటు ధరలపై చర్చించాలని ఆయన కోరారు. ఏఐకెఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షులు, పంజాబ్ రాష్ట్రానికి చెందిన నిర్భయ్ సింగ్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు భారతదేశంలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఈ సభలో ఏఐకెఎంఎస్ నాయకులు బాలచంద్ర షడంగి, కేదార్ సబాల్, స్టాలిన్ బాబు, సెల్వరాజ్, రాబీన్‌జ, ఐఎఫ్‌టియు నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మామిడాల భిక్షపతి, గాదె ఝాన్సీ, ఎంఎఫ్ గోపీనాథ్, వేణు ప్రసంగించారు.













Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com